ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో శాంతికి భారత్–చైనా కమాండర్స్ అంగీకారం 12

మళ్లీ మొదటికొచ్చిన గాజా యుద్ధ కథ! 02

సంపుటి 08, సంచిక: 328 | గురువారం | 30-10-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# మొంథా బీభత్సం



## తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు

- ఆకాశానికి చిల్లుపడినట్లు రోజంతా ముసురు
- వరంగల్ జిల్లా కల్లెడలో 36.7 సెం.మీ. వర్షపాతం నమోదు
- డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి భారీగా వరదనీరు, గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిపివేత
- ఖమ్మం జిల్లా నిమ్మవాగులో కొట్టుకుపోయిన డిసిఎం, డ్రైవర్ గల్లంతు
- డిండి ప్రాజెక్టు సమీపంలో కోతకు గురైన జాతీయ రహదారి
- వాహనాల దారిమళ్లింపు
- దేవరకొండ డివిజన్ కొమ్మేపల్లి గ్రామంలో ఎస్‌టి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను చుట్టుముట్టిన వరద
- 8 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ







ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రాన్ని మొంథా తుఫాన్ పూర్తిగా కమ్మివేసింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన వర్షం రోజంతా ఎడతెరపి లేకుండా కురిసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురువగా మరికొన్ని జిల్లాల్లో రోజంతా ముసరు కొనసాగింది. వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. కల్లెడలో 36.7 సెం.మి. కాపుల కనపర్తిలో 25.2, రెడ్డవాడలో 31.6, భీమదేవరపల్లిలో 29.25, ఉర్సులో 23.7, సంగెంలో 23.4, వర్ధన్నపేటలో 22.8 సెం.మి. వర్షపాతం నమోదు కాగా, జనగాం జిల్లాలోని గూడురులో23.5 సెం.మి వర్షం కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 10 సెం.మి ల నుంచి 34 సెం.మిలకు పైగా వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షం కురువడంతో డోర్నకల్ స్టేషన్‌లో వరద నీరు పట్టాలను ముంచెత్తింది. దీంతో భద్రతా కారణాలరీత్యా రైల్వే అధికారులు డోర్నకల్ రైల్వేస్టేషన్లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. ఖమ్మం జిల్లాలో నిమ్మవాగు వద్ద వంతెనను దాటే క్రమంలో వరద నీరు

తరువాయి 2లో



## రైతులకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు

అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి

మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా

మొంథా తుపాన్ ప్రభావం నేపథ్యంలో వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాలలో మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు

తరువాయి 2లో

మొంథా తుపాను వాయుగుండంగా బలహీనపడింది. గడచిన 6 గంటలుగా ఇది 12 కి.మీ వేగంతో కదులుతోంది. తెలంగాణ భూభాగంపై దీని ప్రభావం కొనసాగుతోంది. భద్రాచలానికి 50 కి.మీ, ఖమ్మం జిల్లాకు 110 కి.మీ దూరంలో ఇది కేంద్రీకృతమైంది. ఒడిశాలోని మల్కన్‌గిరికి 130 కి.మీ దూరంలో ఉంది. ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడనుంది. దీని కారణంగా రాగల 12 గంటల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు పడనున్నాయి. తెలంగాణలో ఒకట్రెండు ప్రాంతాలకు ఆకస్మిక వరద హెచ్చరికలను విశాఖ వాతావరణ కేంద్రం జారీ చేసింది. పలు ప్రాంతాల్లో 35–45 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.



## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి?

రేపు మంత్రివర్గ విస్తరణ : ఎఐసిసి ఆమోదముద్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అజహరుద్దీన్‌కు తెలంగాణ రాష్ట్ర మంత్రి పదవి దక్కనుంది. ఈనెల 31వ తేదీన తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుందని, అందులో అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణకు ఎఐసిసి ఆమోదముద్ర వేసినట్లు తెలిసింది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఎఐసిసిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం 15 మందితో ఉన్న రాష్ట్ర మంత్రివర్గంలో మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. 'ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గం ఏర్పడినా ముస్లిం మైనారిటీ నేతకు ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరపున చాలా మంది ముస్లిం మైనారిటీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి మంత్రివర్గంలో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం

తరువాయి 2లో

## తక్షణమే రూ.303 కోట్లు విడుదల చేయండి



2022 నుంచి నేటి వరకు ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించండి

ఆర్థిక శాఖ అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఓసి, మైనారిటీ విద్యార్థుల ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలు రూ.303 కోట్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రజాభవన్‌లో బుధవారం ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలపై డిప్యూటీ సిఎం ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. నిరాశ, నిస్పృహల్లో ఉన్న వేల కుటుంబాల్లో డిప్యూటీ సిఎం ఆదేశాలు ఆనందం నింపింది. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆలోచనతో వేలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ అందకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, రాష్ట్రంలో ఉన్న తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందక మరోవైపు అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాలలో కొత్త ఆంక్షలతో విద్యార్థులపై

తరువాయి 2లో

పాలనపై నమ్మకం, ప్రతిభపై విశ్వాసానికి మెక్ డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ప్రతీక 03



ఓట్ల కోసం మోదీ ఏదైనా చేస్తారు!

నృత్యం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు

బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ విమర్శ

05



రాఫెల్‌లో రాష్ట్రపతి గగన విహారం

ఇది మరపురాని అనుభూతి అని ద్రౌపదీముర్ము ఉద్ఘాటన

05

## 'పిఎం శ్రీ' అమలుపై సమీక్షిస్తాం

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

కేరళ ముఖ్యమంత్రి విజయన్ ప్రకటన

ఇది వామపక్ష ఐక్యతకు విజయం : బినోయ్ విశ్వం



**తిరువనంతపురం:** కేంద్ర ప్రభుత్వ పథకం 'పిఎం శ్రీ'ని రాష్ట్రంలో అమలు చేసే విషయంపై కేరళ ప్రభుత్వం సమీక్ష నిర్వహిస్తుంది. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసే విషయంపై వివాదాలు, ఆందోళనలు తలెత్తిన నేపథ్యంలో దీనిపై సమీక్ష జరపాలని నిర్ణయించినట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం తిరువనంతపురంలో చెప్పారు. సెంట్రల్ స్కూలు పథకాన్ని అమలు చేయడంపై అధ్యయనం చేసేందుకు ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అందువల్ల ఉపసంఘం నివేదిక వచ్చేవరకూ 'పిఎం శ్రీ' అమలుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను నిలిపివేసినట్లు చెప్పారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించిన సందర్భంగా ఈ విషయాన్ని ఆయన మీడియాకు చెప్పారు. ''ఈ విషయాన్ని ఒక లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తాం'' అని విజయన్ అన్నారు. సార్వత్రిక విద్యామంత్రి వి.శివన్‌కుట్టి ఈ మంత్రివర్గ ఉపసంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మంత్రులు కె.రాజన్, పి.రాజీవ్, రోషీ అగస్టిన్, కె.ప్రసాద్, కె.కృష్ణకుట్టి, ఎ.కె.సశీంద్రన్‌లు ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారు. అంతకుముందు ఈ విషయంపై గడచిన కొద్దిరోజులుగా సిపిఐ(ఎం), సిపిఐ నాయకులు విజయన్ నేతృత్వంలో బహుముఖస్థాయిల్లో చర్చలు

తరువాయి 12లో



## మరో 51 మంది..

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టులు


**బిజాపూర్ :** మావోయిస్టులు ఒక్కొక్కరిగా ఆయుధాలు వీడుతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో మరో 51 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో 20 మందిపై సమష్టిగా రూ. 66 లక్షల రివార్డు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులయ్యామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా ఈ కేడర్ ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారని బిజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. శాంతి, చర్చలు, అభివృద్ధి ద్వారా నక్సలిజాన్ని నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న లక్ష్యంలో హింస మార్గాన్ని విరమించుకోవాలనే వారి నిర్ణయం మరో ముఖ్యమైన అడుగు అని ఆయన అన్నారు. నక్సలైట్ల కోసం బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన పునరావాస చొరవ 'పూనా మార్గెం పునర్వాస్ సే పునర్జీవన్'

తరువాయి 2లో

## పది నెలలు ఆలస్యంగా సిపిసి ఉద్యోగులకు అన్యాయమే

సిఫారసుల అమలుకు మరో రెండేళ్ళు

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శ



**న్యూఢిల్లీ :** ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా జూలై 16న కేంద్రం 8వ కేంద్ర వేతన సంఘాన్ని (సిపిసి)ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందని, పది నెలల తరువాత బిహార్ ఎన్నికల ముంగిట సిపిసిని ఏర్పాటు చేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. ప్రధానినరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సిపిసి చైర్మన్, తాత్కాలిక సభ్యుడిని నియమించేందుకు 10 నెలలు పట్టిందని బుధవారం ఒక పత్రికా ప్రకటనలో ఎద్దేవా చేశారు. కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించడానికి 18 నెలల గడువు ఇచ్చారని, అంటే 2027 సంవత్సరం మధ్యలో మాత్రమే నివేదిక లేదా సిఫారసులను మనం ఆశించవచ్చు అని అన్నారు. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయానికి నిజాయితీగా వ్యవహరిస్తే, 2027 సంవత్సరం చివరి వరకూ కొనసాగవచ్చునని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనాలను సవరించడానికి మరో రెండు సంవత్సరాలు వేచి

తరువాయి 12లో

## నేడు ట్రంప్– జిన్‌పింగ్ భేటీ



**జియోంగ్జు :** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం దక్షిణ కొరియాలో శిఖరాగ్ర సమావేశం జరుగుతుందని బీజింగ్‌లోని చైనా ప్రభుత్వ వర్గాలు అధికారికంగా ధృవీకరించాయి. అటు వైట్ హౌస్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించడంతో యావత్ ప్రపంచ నాయకులూ ఈ కీలక సమావేశంపైనే దృష్టి సారించారు. ఇటీవలి కాలంలో చైనా–అమెరికామధ్య టారిఫ్‌ల యుద్ధం పెరగడంతో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు. ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర ప్రయోజనకరమైన సమస్యలు, వాణిజ్య వ్యవహారాలపై నాయకులు ఇద్దరూ చర్చిస్తారని చైనా విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశం ద్వారా వాణిజ్య ఉద్రిక్తతలకు తెరపడుతుందని అందరూ ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ, జిన్‌పింగ్‌తో సమావేశం సందర్భంగా యుద్ధ సమస్య పరిష్కారం గురించి మాట్లాడాలని ట్రంప్‌ను కోరారు. రష్యాకు అదేపనిగా సైనిక సహాయం, నైతిక మద్దతు ఇవ్వకుండా వెనక్కు తగ్గాల్సిందిగా చైనా అధ్యక్షుడికి విజ్ఞప్తి చేయాలని ట్రంప్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

**15 శాతానికి తగ్గనున్న ద.కొరియా–అమెరికా టారిఫ్‌లు**

రెండు రోజులపాటు 'ఎపెక్' (ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ) దేశాల సమావేశాలలో పాల్గొనేందుకు

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## తూర్పు పసిఫిక్‌లో డ్రగ్స్ పడవలపై అమెరికా దాడులు:14 మంది మృతి

**పెంటగాన్:** కరీబియన్ జలాల్లో అమెరికా నావికాదళంమరోసారి మాదక ద్రవ్యాల పడవలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 14 మందిని కాల్చి చంపారు. అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ బుధవారం ఈ విషయం చెప్పారు. మెక్సికో జలాల సమీపంలో తూర్పు పసిఫిక్ సముద్రంలో ఈ దాడులు జరిగాయి. మంత్రి హెగ్సెత్ ఈ దాడుల గురించి వివరిస్తూ, అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ చేసిన దాడులకంటే ఈ నార్కో ఉగ్రవాదుల కారణంగా ఎక్కువమంది మరణిస్తున్నారని అన్నారు. వారు ఏ విధంగా అయితే మనుషులను చంపుకుతింటున్నారో, వాళ్ళకు (డ్రగ్ కార్టెల్స్) కూడా అదే గతి పట్టిస్తామని, వారిని వదలిపెట్టేదిలేదని హెచ్చరించారు. ''వాళ్ళను వెంటాడి, వేటాడి చంపుతాం'' అని హెగ్సెత్ అన్నారు. మొత్తం నాలులు డ్రగ్స్ పడవలపై తూర్పు పసిఫిక్‌లో ఈ దాడులు జరిపినట్లు చెప్పారు. ఐతే వెనిజులా, కొలంబియా దేశాల నాయకులు అమెరికా చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బెదిరింపులకు, అస్థిరత్వానికి గురిచేస్తున్నారని వెనిజులా నేత మదురో, కొలంబియా నాయకుడు పెట్రో విమర్శించారు.

## దక్షిణ కొరియాలో వామపక్షాల ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు



**జియోంగ్జు:** ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ సభ్యదేశాల వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు దక్షిణ కొరియాకు చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వామపక్షాల వేదిక నాయకత్వాన నిరసన ప్రదర్శనలు ఎదురయ్యా యి. ట్రంప్‌ను అనుకరిస్తూ, ఆయన విధానాలు ఎలా ఉంటున్నాయో చూపరులకు అర్థమయ్యేవిధంగా ప్రదర్శకులు వ్యంగ్య వీధి నాటికలు ప్రదర్శించారు. ట్రంప్ తరహాలో సూటూ టై కట్టుకుని అనుకరిస్తూ ప్రదర్శనలు చేశారు. బ్యారికేడ్లను దాటి పోలీసు నిబంధనలు ఉల్లంఘించి ముందు కు దూసుకువెళ్ళారు. ఈ సందర్భంగా పోలీసులు, ప్రదర్శకుల మధ్య స్వల్పస్థాయిలో ఘర్షణలు జరిగాయి.

35 వామపక్షాల పౌర సంఘాలు, ప్రగతిశీల పౌర సంఘాలు, ప్రతిపక్షాల నాయకత్వాన ఇంటర్నేషనల్ పీపుల్స్ యాక్షన్ కమిటీ ఎగెనెస్ట్ ద ఎపెక్–2025 పేరుతో రాజకీయపార్టీలు ఏర్పాటు చేసిన సంకీర్ణ వేదిక ఈ నిరసన ప్రదర్శన నిర్వహించింది. బొమన్ టూరిస్ట్ కాంప్లెక్ వద్ద ఈ ఎపెక్ సమావేశ వేదిక ఏర్పాటు చేశారు. కానీ ప్రదర్శకులను ఈ వేదికకు ఐదు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు అడ్డుకున్నారు. భారీ సంఖ్యలో పోలీసులు వారిని ముందుకు వెళ్ళకుండా ఆపేశారు. దీంతో తోపులాటతోపాటు కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

వేలసంఖ్యలో ప్రజలు బుధవారం ఉదయం ఉత్తర జియోంగ్సాంగ్ రాష్ట్రం జియోంగ్జులో అమెరికాకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. రక్షణ వ్యయాలు పెంచుకోవడానికి అధిక సుంకాలు వసూలు చేయడం ద్వారా డోనాల్డ్ ట్రంప్ దక్షిణ కొరియాను దోపిడీ చేస్తున్నారని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ట్రంప్ విధానాలు దీర్ఘకాలిక మిత్రదేశమైన దక్షిణ కొరియాకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ నిరసన తెలియజేశారు. 'నో కింగ్స్, నో వెల్‌కమ్ టూ సౌత్ కొరియా, నో ఎపెక్' అంటూ నినాదాలు చేశారు. ట్రంప్ అనుసరిస్తున్న అనేక వ్యతిరేక విధానాలకు రూపం ఇస్తూ, ప్రదర్శకులు ప్రదర్శనల సందర్భంగా అనేక స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష ప్రోగ్రెసివ్ జస్టిస్ పార్టీ నాయకుడు క్వాన్ యంగ్ కూక్ మాట్లాడుతూ, ఎపెక్ సదస్సు ఆర్థిక వృద్ధి, ప్రజాక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతోందని, కానీ వాస్తవానికి ప్రపంచ నాయకులు అందరూ తమ తమ దేశాల టారిఫ్‌లు తగ్గించుకోవడంకోసం ట్రంప్ వెంటపడి పాకులాడుతున్నారని, సూట్లూ, బూట్లూ ధరించి తమ తమ దౌత్య నైపుణ్యాలు ప్రదర్శించి తక్కువ టారిఫ్‌లు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. అంతర్జాతీయ క్రమాన్ని కూడా ఆపలేకపోతున్న ఈ ఆర్థిక సంస్థ ఇక అభివృద్ధి గురించి ఏం మాట్లాడుతుందని ఆయన ప్రశ్నించారు.

**ఉత్తర కొరియా క్రూయిజ్ క్షిపణి ప్రయోగం**

జియోంగ్జు: దక్షిణ కొరియాలో ఎపెక్ సమావేశానికి హాజరయ్యేందుకు బుధవారం ట్రంప్ బుసాన్‌లో అడుగుపెట్టిన సందర్భంలోనే ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం చేసింది. సముద్రం నుండి భూఉపరితలం మీద ఉన్న లక్ష్యాలను ఛేదించగల క్రూయిజ్ క్షిపణిని ఉత్తర కొరియా ప్రయోగించిందని దక్షిణ కొరియా ధృవీకరించింది. ఉత్తర కొరియా కూడా బుధవారం ఒక ప్రకటన చేస్తూ క్రూయిజ్ క్షిపణి ప్రయోగం విజయవంతమైందని పేర్కొంది. తమదేశ సైనిక సామర్థ్యానికి ఇది మచ్చు తునక అని ప్రభుత్వం పేర్కొంది. ఐతే మరోవైపు కొరియా పర్యటనకు రాకముందు నుండీ ట్రంప్ ఉత్తర కొరియా అధినేత కిమ్‌ను కలుసుకునేందుకు ఆసక్తి చూపించారు. చివరకు ఆయన ఈ పర్యటన సందర్భంగా తాను కిమ్‌ను కలుసుకోవడం లేదని, తర్వాత మరో సందర్భంలో ఆయనను కలుసుకుంటానని ప్రకటించారు. ''కిమ్ జోంగ్ ఉన్ నాకు బాగా తెలుసు, మాకు చాలా కాలం క్రితమే పరిచయం'' అని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ మ్యుంగ్‌తో సమావేశానికి ముందుగా ట్రంప్ అన్నారు. ఎయిర్‌ఫోర్స్ విమానంలో బుసాన్‌కు వెళుతూ ఆయన పాత్రికేయుతో మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా కిమ్ క్షిపణులను ప్రయోగిస్తున్నారు మీకు తెలుసా? అని ఆయన అన్నారు.

## మళ్ళీ మొదటికొచ్చిన గాజా యుద్ధ కథ!

**ఒప్పందం ఉల్లంఘన:**
**ఐడిఎఫ్ దాడుల్లో 104 మంది మృతి**
**ఇజ్రాయెల్ దాడులను సమర్థించిన ట్రంప్**
**మృతదేహాల స్వాధీనం ప్రక్రియ నిలిపివేసిన హమాస్**



**గాజా:** హమాస్ ఉగ్రవాద స్థావరాలపై దాడుల పేరుతో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. బుధవారం తెల్లవారక ముందుగానే ఇజ్రాయెల్ సైనికులు గాజాపై ప్రాణాంతకమైన భీకర దాడులు చేశారు. ఈ దాడులను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సమర్థించారు. క్రమంగా పెరుగుతూ వచ్చిన దాడుల్లో మృతులసంఖ్య కడపటి వార్తాల నాటికి 104 కు చేరింది. వీరిలో 35 మంది పిల్లలు ఉన్నారు. మరో 200 మంది గాయపడ్డారు. వాయువ్య ఖాన్‌యూనిస్‌లో రోడ్డుపై వెళుతున్న ఒక వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఎయిర్‌క్రాఫ్ట్ నుండి చేసిన దాడిలో మరో ఐదుగురు మరణించారు. గాజా సిటీలో ఇళ్ళు, స్కూళ్ళు, రెసిడెన్షియల్ బ్లాక్స్, ఉత్తర గాజాలోని బెయిత్ లహియా, సెంట్రల్ గాజాలోని బురియజ్, నుజైరత్, దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్ ప్రాంతాలలో విస్తారంగా గగనతల దాడులు జరిగాయి. బురియజ్‌లోని శరణార్థ శిబిరంలో తలదాచుకున్న అబూషరార్ కుటుంబంలోన ఐదుగురు సభ్యులూ మరణించారు. 30 మంది సాయుధులైన కమాండర్స్ గ్రూపుపై కూడా దాడిచేసి హతమార్చినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. గాజాలో ప్రాణాలకు హామీ లేకపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దాడుల సమయంలో గాజా అంతటా పొగలతో నిండిపోయింది. అనేక ప్రాంతాలు బాంబు ధ్వనులతో దద్దరిల్లాయి. మంటలు ఎగసిపడ్డాయని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. ధ్వంసమైన భవంతులవద్దకు చేరుకుని సహాయ కార్యక్రమాలు చేసేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. పౌర రక్షణ బృందాలు, ఆసుపత్రి వర్గాలు, హమాస్ పాలిత ఆరోగ్యమంత్రిత్వ శాఖలను ఉటంకిస్తూ 'అల్‌జజీరా' మీడియా నెట్‌వర్క్ ఈ విషయం వెల్లడించింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత 19 రోజుల్లో పాలస్తీనియన్లు ఇంత భారీసంఖ్యలో మరణించడం ఇదే. రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీ ఈ దాడులను ఖండించింది. తాము ఎంతో సానుకూలమైన దృక్పథంతో ఉనానమని తెలిపింది.

గాజాలో భీకర దాడులు పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్ ప్రభుత్వం బుధవారం ఉదయం విద్దారమైన ప్రకటన చేస్తూ గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని యథాతథంగా అమలు చేస్తామని ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించి తమ సైనికుణ్ణి కాల్చి చంపిందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఆరోపించారు. బందీలను స్వాధీనం చేయకుండా హమాస్ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఈ పరిణామాలపై హమాస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్‌కు బందీల మృతదేహాలను స్వాధీనం చేసే ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. డజన్లసంఖ్యలో ఉగ్రవాదుల కేంద్రాలను, ఉగ్రవాదులను లక్ష్యంగా పెట్టుకుని ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు. హమాస్ సంస్థ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, తమ సైనికుణ్ణి కాల్చి చంపిందని కట్జ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను హమాస్ ఖండించింది. రఫాలో దాడులకు తమకూ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పటికీ తాము కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది.

ఐతే ట్రంప్ మాత్రం భిన్నంగా స్పందించారు. హమాస్ ఉగ్రవాదులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ సైనికుణ్ణి కాల్చి చంపారని, అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ దాడి చేస్తుందని సమర్థించారు. ఇలాంటి ఘటనలవల్ల కాల్పుల విరమణ ఒప్పందానికి ఎలాంటి నష్టం, హానీ జరగదని ఆయన కొట్టిపారేశారు. ఇజ్రాయెల్ దాడులను ఐక్యరాజ్య సమితి ఖండించింది. కానీ దాడులకు ముందే అక్కడున్న పరిస్థితులను ఐక్యరాజ్యసమితికి ఇజ్రాయెల్ తెలియజేసిందని అమెరికా అధికారులు చెప్పారు. మీరంటే మీరే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ గడచిన ఇరవై రోజులుగా హమాస్ సంస్థ, ఇజ్రాయెల్ మధ్య ఆరోపణలు కొనసాగుతున్నాయి.

**మొత్తం 16 మంది బందీల మృతదేహాలు స్వాధీనం**

పాలస్తినా–ఇజ్రాయెల్ మధ్య గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అక్టోబరు తొమ్మిదో తేదీన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 11వ తేదీ నుండి కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. అక్టోబరు 13వ తేదీన 20 మంది సజీవులైన బందీలను, నాలుగు మృతదేహాలను ఇజ్రాయెల్‌కు హమాస్ స్వాధీనం చేసింది. ఇక అప్పటినుండి మంగళవారం 28వ తేదీ వరకూ విడతల వారీగా హమాస్ సంస్థ 16 మంది బందీల మృతదేహాను అప్పగించింది. దీంతో హమాస్ ఇంకా 12 మృతదేహాలను ఇజ్రాయెల్‌కు స్వాధీనం చేయాల్సి ఉంటుంది. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు వందలమంది ఇజ్రాయెల్ సరిహద్దు కంచెను బద్దలు కొట్టుకుని లోనికి ప్రవేశించి తుపాకులు, భారీ ఆయుధాలతో హింస సృష్టించారు. ప్రధానంగా సంగీత ఉత్సవంపై దాడిచేసి 1200 మంది కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు. ఆ తర్వాత గాజాలో యుద్ధం మొదలైంది. ఈ రెండేళ్ళ యుద్ధకాలంలో 68 వేలమంది పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ అధీనంలో ఉన్న వారిలో మరణించిన బందీలు మరణించగా, కొందరు పారిపోయారు. కొందరు సజీవ–నిర్జీవ బందీలను గడచిన మార్చి నెలలో ఒప్పందం ప్రకారం హమాస్ స్వాధీనం చేసింది. మొత్తంమీద ఈ రెండేళ్ళలో హమాస్ ఇప్పటివరకూ అంటే మంగళవారం వరకూ 51 మంది ఇజ్రాయెలీ బందీల మృతదేహాలను స్వాధీనం చేసింది. ఇంకా 13 మంది బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది. కానీ హమాస్ మరణించిన బందీల అస్థికల స్వాధీన చర్యలు సక్రమంగా లేవని, సగం సగం అస్థికలను ఇస్తున్నారనీ, హమాస్‌పై నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌లో బందీల బంధువుల వేదిక కోరింది.

## మరోసారి హస్సన్‌కే టాంజానియా అధ్యక్ష పదవి!




**దోడోమా:** తూర్పు ఆఫ్రికాదేశం టాంజానియాలో బుధవారం సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. రెండు ప్రధాన ప్రతిపక్షాలకు చెందిన నాయకులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించిన తర్వాత దేశాధ్యక్షురాలు సమియా సులుహు హస్సన్ (65)కే ఈసారి కూడా అధ్యక్ష పదవి దక్కుతుందన్నది ప్రముఖంగా వినిపిస్తున్న కథనం. దేశంలో ఆధిపత్యం చెలాయించే పాలక ''పార్టీ ఆఫ్ ద రివల్యూషన్'' (చామా చా మా పిండుజీ) ఆఫ్రికా చరిత్రలో అతి ఎక్కువకాలంగా పదవిలో కొనసాగుతున్నది. సిసిఎం పార్టీ గడచిన ఆరుసార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించింది. 2020లో జరిగిన ఎన్నికల్లో సిపిఎంపార్టీ 256 సీట్లు గెలుచుకుని జాతీయ అసెంబ్లీలో పూర్తి మెజారితో కొనసాగుతోంది. ఐతే పోలింగ్ సందర్భంగా నిరసనలు తెలియజేసేందుకు కొన్ని గ్రూపులు ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు వారిని చెదరకొట్టి ఆ ప్రాంతం నుండి తరిమివేశారు. దేశంలో అధ్యక్షురాలు హస్సన్‌కు వ్యతిరేకత ఉన్నప్పటికీ అణచివేత చర్యలు కొనసాగుతున్నాయి. ఆమెకు వ్యతిరేకంగా నిరసనలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిరంకుశ పాలకురాలుగా ఆమె పేరు పొందారు. కొందరు ప్రతిపక్ష నాయకులు జైలుపాలయ్యారు. తీవ్ర ఆంక్షల మధ్య దేశంలో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. టాంజానియా జాతీయ అసెంబ్లీలో 393 స్థానాలున్నాయి. 264 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మహిళలకోసం 113 స్థానాలు రిజర్వు చేశారు. దేశాధ్యక్షురాలు పదిమందిని నామినేట్ చేస్తారు. ఒక ఎక్స్–అఫీషియో సభ్యుడు ఉంటారు. అటానమస్ ఐలాండ్ జాంజిబార్ నుండి ఐదుగురు సభ్యులు ఉంటారు.

## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి?
(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం గత కొంత కాలంగా ఆలోచన చేస్తోంది. అజాహరుద్దీన్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎంఎల్‌ఎసిలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి (టిజెఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. కాగా వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎంఎల్‌ఏసి నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసిసి ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండు రోజులుగా ఏఐసిసిలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన అనంతరం మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కనట్లయితే త్వరలో కొన్ని ఎంఎల్‌సి స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలలలో అజాహరుద్దీన్‌ను ఎంఎల్‌సిని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు టిపిసిసి నేతల ద్వారా తెలుస్తోంది.

## మరో 51 మంది..
(మొదటి పేజీ తరువాయి)

(సామాజిక సమైక్యతకు పునరావాసం)లో భాగంగా వారు లొంగిపోతున్నారన్నారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్ నంబర్ 01, కంపెనీ నంబర్లు 01, 02, 05 కు చెందిన ఐదుగురు సభ్యులు, ఏరియా కమిటీలు, ప్లాటూన్‌కు చెందిన ఏడుగురు సభ్యులు, ఎల్‌ఓఎస్ (స్థానిక సంస్థ స్క్వాడ్) గ్రూపునకు చెందిన ముగ్గురు సభ్యులు, ఒక మిలీషియా ప్లాటూన్ కమాండర్, 14 మంది మిలీషియా ప్లాటూన్ సభ్యులు, 20 మంది దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని ఆయన చెప్పారు. జనవరి 2024 నుండి బిజాపూర్‌లో మొత్తం 650 మంది మావోయిస్టులు ప్రధాన స్రవంతిలో చేరారు. ఎన్‌కౌంటర్లలో 196 మందిని తటస్థీకరించగా, 986మందిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

**రూ.9.50 లక్షల రివార్డు అందుకున్న లొంగిపోయిన మావోయిస్టులు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేసి ఇటీవల లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రూ.9 లక్ష 50 వేల నగదును ఎస్‌పి రోహిత్ రాజ్ వారికి అందజేశారు. ఈ రివార్డులను ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాకు చెందిన రామ్‌సింగ్ కొడే, నరోటి మనీష్ రూ.5 లక్షలు, ఊసూరు బ్లాక్ చెందిన ముచ్చిక సోందాల్ రూ.3.75 లక్షలు, చింతగుప్పకు చెందిన మోడి భీమీ అలియాస్ దేవా రూ.75 వేలు చెక్కుల రూపంలో ఎస్‌పి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిషేదిక సిపిఐ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు.

కాలం చెల్లిన సిద్ధాంతాలతో స్వార్థ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ నాయకులు, అమాయకులైన ఆదివాసీలను బలవంతంగా తమ పార్టీలోకి చేర్చుకునివారి చేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించారని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు జిల్లా పోలీసులు అండగా ఉంటారన్నారు.ఇంకా మావోయిస్టు పార్టీ లో ఉంటూ అజ్ఞాత జీవితాన్ని సాగిస్తూ ఉన్న వారి లొంగిపోయి జనజీవస్రవంతిలో కలవాలని ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ నరేందర్, ఆర్‌ఐ ఆపరేషన్స్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## మొంథా బీభత్సం (మొదటి పేజీ తరువాయి)



ఉదృత్తితో డిసిఎం వ్యాన్ కొట్టుకుపోవడంతో డ్రైవర్ గల్లంతు అయ్యారు. దీంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కురుస్తున్న భారీ వర్షాలతో కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు ఏడు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి విడుదలతో మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, పశువులను కూడా నది వైపు తీసుకెళ్లవద్దని సూచించారు. అదేవిధంగా భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లతిపూర్ సమీపంలో డిండి జలాశయం మత్తడి పరవళ్ల



తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి కోతకు గురి కావడంతో బుధవారం సాయంత్రం నుంచి అధికారులు రాకపోకలను నిలిపేశారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలను అచ్చంపేట మండలంలోని హాజీపూర్ నుంచి వంగూరు మండలం చింతపల్లి కొండారెడ్డిపల్లి మీదుగా మళ్లించారు. కోతకు గురైన జాతీయ రహదారిని నాగర్ కర్నూల్ ఎస్పీ పరిశీలించారు. దీనిపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారం అందించారు.

**వర్షాలకు నీట మునిగిన ఎస్టీ గురుకుల పాఠశాల**

భారీ వర్షాల నేపథ్యంలో దేవరకొండ డివిజన్‌లో పర్యటించి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిస్థితిని పర్యవేక్షించారు. మండలంలోని కొమ్మేపల్లి గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ తెగల బాలుర హాస్టల్లోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాత్రికేయ ప్రతినిధులతో మాట్లాడుతూ మంగళవారం నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో కొమ్మేపల్లి ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, లోతట్టు ప్రాంతంలో ఉండడం వంటి కారణాల వల్ల హాస్టల్లోకి నీరు ప్రవేశించిందని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో విద్యార్థులను పక్కనే ఉన్న బిసి గురుకుల హాస్టల్‌లోకి తరలించామని తెలిపారు. ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు, 26 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరిని తరలించినట్లు ఆమె వెల్లడించారు.

**16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లెడ్ ముప్పు :**

మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని 16 జిల్లాలకు ఫ్లాష్ ఫ్లెడ్ ముప్పు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, పెద్దపల్లి జిల్లాలకు వరద ముప్పు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అధికారులు ప్రకటించినట్లుగానే వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడ్డాయి. కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రంగారెడ్డి, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుశాయి.

**8 జిల్లాలకు రెడ్ అలర్ట్ :**

హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. అదేవిధంగా కుమురం భీం, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించిన అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పాటు నల్లగొండ, సూర్యాపేట, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం :** తుపాన్ ప్రభావంతో బుధవారం హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోజంతా ఏకదాటిగా జల్లులు పడడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు అష్ట కష్టాలు పడ్డారు. భారీ వర్షం కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వర్షంలో తడవాల్సి వచ్చింది. ముషీరాబాద్, మారెడ్‌పల్లి, చార్మినార్, సరూర్‌నగర్, అంబర్‌పేట్, అల్వాల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

## తగిన జాగ్రత్తలు (మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాలలో ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు వివిధ బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సిఎం సూచించారు.

వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు.

రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలలో లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిఎం చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జిహెచ్‌ఎంసి, హైడ్రా, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

**అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావద్దు : మంత్రి పొన్నం ప్రభాకర్**

మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఎక్కడ ఇబ్బందులు ఉన్న అధికారుల దృష్టికి తీసుకోవాలని తెలిపారు. జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, వాటర్ వర్క్స్, పోలీస్, విద్యుత్, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది ఉండేలా జిహెచ్‌ఎంసి అధికారులు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ స్థంబాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొంథా తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## విడుదల చేయండి
(మొదటి పేజీ తరువాయి)

మానసిక ఒత్తిడి తీవ్రమైంది. వివిధ దేశాల్లో గతంలో మాదిరిగా చదువుకుంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి లేదు. అక్కడ నిత్యం ఆర్థిక భారం పెరిగిపోతుంది. మరోవైపు బ్యాంకులలో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నిటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఈ సమస్యను ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది. ఇదిలా ఉండగా, తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో డిప్యూటీ సిఎం ఆదేశాలతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. కష్టకాలంలో ప్రభుత్వం ప్రతి విద్యార్థి సుమారు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో తమ బిడ్డలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, తమ ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి తిరిగి అర్థవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్‌సీస్ విద్యార్థులు అంటున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భారత్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ పౌర సరఫరాల శాఖ ప్రత్యేక స్టాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆల్ ఇండియా రైస్ ఎగుమతిదారుల సంఘం ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వం, భారత్ ఇంటర్నేషనల్ రైస్ కాన్ఫరెన్స్ సహకారంతో ఈనెల 30, 31 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న భారత్ రైస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ పౌర సరఫరాల శాఖ పాల్గొన్ననుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ పాల్గొనాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతి అవకాశాలను విస్తరించేందుకు ఈ కాన్ఫరెన్స్ ను సద్వినియోగం చేసుకునేందుకు గాను తెలంగాణా పౌర సరఫరాల శాఖా కాన్ఫరెన్స్ లో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులోభాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తెలిపింది.

# జిసిసిల రాజధానిగా హైదరాబాద్

### పాలనపై నమ్మకం, ప్రతిభపై విశ్వాసానికి ప్రతీక మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్

### కార్యాలయం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రతిభపై విశ్వాసం పరిపాలనపై నమ్మకానికి మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి టి హబ్ సమీపంలో మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ తెలంగాణ అద్భుత ప్రతిభకు మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ కోసం హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఒక నిదర్శనం అన్నారు. జిసిసిలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని డిప్యూటీ సిఎం తెలిపారు. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకుని ఆ తర్వాత పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి మహానేతలు దూరదృష్టితో చేపట్టిన చర్యలతో హైదరాబాద్‌కు మరింత బలం చేకూరిందన్నారు. సమానత్వంతో కూడిన వృద్ధి, సమిష్టి అభివృద్ధి అనే అంశాలు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలని డిప్యూటీ సిఎం వివరించారు.

మెక్ డోనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ నూతన కేంద్రం కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తున్న కొత్త పరిణామంలో కీలక అధ్యాయమన్నారు. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ ఇటువంటి సెంటర్లకు రాజధానిగా మారిందని, వందలాది గ్లోబల్ కెపబిలిటీ హబ్‌లు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇవి అన్నీ తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభపై విశ్వాసం, పాలనపై నమ్మకం, భవిష్యత్తుపై ఆశకు ప్రతీకలు అన్నారు. ఇవి కేవలం బ్యాక్ ఆఫీసులు కావని, ఇవి ప్రపంచ ఆవిష్కరణకు జీవనాడులన్నారు. మెక్ డోనాల్డ్స్ తన సప్లై చైన్స్, సస్టైనబిలిటీ, డిజిటల్ అనుభవాలను పునర్నిర్మించినట్లే హైదరాబాద్ కూడా టెక్నాలజీ, మానవతా విలువలు కలిసిన నగరంగా మళ్లీ తనను పునర్ నిర్వచిస్తోందన్నారు. మ్యాక్ డోనాల్డ్స్ తెలంగాణ యువత కోసం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై భాగస్వామి కానుందని, ఈ భాగస్వామ్యం గ్లోబల్ సామర్థ్యాన్ని స్థానిక అవకాశంగా మార్చుతుందన్నారు. కార్యక్రమంలో డోనాల్డ్ కంపెనీ ప్రతినిధులు మిస్ స్కై ఆండర్సన్, దేశాంత్ కైలా, మ్యాటిజ్ బ్యాక్స్, స్పీరో డ్రూలియాస్, శదాస్ దాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

### కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించండి: మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ప్రజా పాలన ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధికి పాటు పడాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది.. టిఆర్ఎస్ కేంద్రంలో లేదు రాష్ట్రంలో లేదు.. దానికి ఓటేస్తే ఉపయోగం లేదు... ప్రయాణించే బండి ఎక్కాలి... కానీ మూలకువద్ద కారు ఎక్కితే మీరు ముందుకు పోలేరు అని ఆయన జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్‌తోనే సాధ్యం అని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య కాదు, ఎన్నిక కాంగ్రెస్ అభివృద్ధికి... టిఆర్ఎస్ అబద్దాలకు మధ్య జరుగుతుందన్నారు. మీకు అభివృద్ధి కావాలా, అబద్ధాలు కావాలా తెలుసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో బండలను కరిగించి పేదలకి ఇండ్ల పట్టాలు, ఇండ్లు కట్టించి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి చూపింది కాంగ్రెస్ పార్టీనేని తెలిపారు. సన్న బియ్యం ఇచ్చింది కూడా తమ పార్టీనే అని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న అందరికీ నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేశాం, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2 లక్షల 40 వేల మందికి పైగా ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందుతున్నాయన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం, 500కి గ్యాస్ అందిస్తున్నాం అని చెప్పారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నాం, 80 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. తమ పార్టీ అభ్యర్థి బిసి బిడ్డ విద్యావంతుడు నిత్యం ప్రజల్లో ఉండే నవీన్‌యాదవ్‌ను రౌడీ అంటున్నారు. వాళ్ళు ఎన్ని అన్న అవి మా ఆశీర్వాదాల కిందికే వస్తాయన్నారు. బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు ఆటోలో ప్రయాణం చేస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారన్నారు. 2012 తరువాత నగరంలో ఒక్క ఆటోకి పర్మిట్ ఇవ్వలేదు.. ఉమ్మడి ఎపిలో బొత్స సత్యానారాయణ ఇచ్చినవి తప్ప మళ్ళీ ఇవ్వలేదు. తమ ప్రభుత్వం 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. 11న జరిగే ఎన్నికల్లో ఉన్నత విద్యావంతుడు, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే నవీన్ యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు చరణ్ కౌశిక్ యాదవ్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అప్రమత్తం చేశారు. బుధవారం ఆయన ఆర్ అండ్ బి ఈఎన్‌సిలు, సిఈలు, ఎస్‌ఈలతో ఫోన్‌లో మాట్లాడారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో హై అలెర్ట్‌గా ఉండాలనీ,అత్యవసరం అయితే తప్పా ఎవరూ సెలవుపై వెళ్లొద్దనీ మంత్రి స్పష్టం చేశారు. మాన్సూన్ సీజన్‌లో ఆర్ అండ్ బి ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో చేపట్టిన జాగ్రత్త చర్యలు ప్రశంసనీయమని అదే స్ఫూర్తిని ఈ సమయంలో కూడా కొనసాగించాలన్నారు. లో కాజ్‌వేలు, కల్వర్టులు వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలనీ, ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పిఆర్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ అన్ని జిల్లాలతో అనుసంధానం చేయాలనీ, సర్కిల్ వారిగా అన్ని జిల్లాలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలనీ, అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.


ఫారం -VI

(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ - 1 రూల్ 19 ప్రకారం)

తెలంగాణ ప్రభుత్వం

కలెక్టర్/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)

ప్రాథమిక నోటిఫికేషన్

ఫైల్ నెం.B/67/2022 తేది: -09-2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్గొండ గారు మల్లాపురం గ్రామము, పి.ఎ.పల్లి మండలము నల్గొండ జిల్లాలో విస్తీర్ణం **ఎ.2.01 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం నిమిత్తం అనగా 1L Minor of D-7 of AMRSLBC Project కొరకు అవసరము అయియున్నదని భావించబడినది. G.O.Ms. No.54 Irrigation & CAD (LA R&R/A2) Department, dated: 25.07.2017 ప్రకారం The Chapter-II and Chapter-III under Sec-10 A(b) Act No.21/2017 under RFCT LA RR Act, 2013ను మినహాయించనైనది మరియు భూసేకరణ కారణంగా ఎటువంటి కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి లేదు. కావున ఇట్టి ప్రకటన, పైన తెలుపబడిన ప్రాజెక్ట్‌కు క్రింద **మల్లాపురం గ్రామము, పి.ఎ.పల్లి మండలము** నల్లగొండ జిల్లాలో నిర్దేశించబడిన కొలతల ప్రకారం వచ్చిన విస్తీర్ణం **ఎ.2.01 గుంటల** భూమి భూసేకరణ నిమిత్తం ఈ క్రింద చూపిన విధముగా కలదు.

గ్రామము : మల్లాపురం మండలము : పి.ఎ.పల్లి

| క్రమ సంఖ్య | సర్వే నెం. | భూమి వర్గీకరణ | భూమి స్వభావం | సేకరించవలసిన విస్తీర్ణం (ఎకరాల్లో) | పట్టాదారు పేరు /తండ్రి పేరు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు రకము | సంఖ్య | నిర్మాణాలు రకము | విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 47 | ప్రభుత్వ | మెట్ట | 0.14 | మదాల వెంకటయ్య S/o మల్లయ్య | 48 | 43 | 26 | 46 | మామిడి తాటి ఈత | 22 3 5 | పైప్ లైన్ | - |
| 2 | 64 | పట్టా | మెట్ట | 0.33 1/2 | మారపాకల వెంకటయ్య S/o ఈదయ్య | 63 | 41 | 65 | 52 | బత్తాయి తాటి | 31 5 | పైప్ లైన్ | - |
| | | | | 0.33 1/2 | మారపాకల నర్సింహా S/o ఈదయ్య | | | | | బత్తాయి ఈత | 31 5 | పైప్ లైన్ | |
| మొత్తం విస్తీర్ణం ఎ. 2.01 గుంటలు | | | | | | | | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమంలోని సెక్షన్ (11)1 ప్రకారం సంబంధించిన వారికై ఇవ్వనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.) ఎ.ఎం..ఆర్.పి, విభాగము-1, నల్గొండ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ..), ఎ.ఎం..ఆర్.పి, విభాగము-1, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ (12) నిర్దేశం ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు తవ్వకం పనులు మట్టిలో చేపట్టడానికి మరియు సరైన విధముగా పని గావించుటకు అవసరమైనవన్నీ అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి అనుమతి లేకుండా ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం మరియు ఎలాంటి క్లెయిమ్ చేయరాదు.

భూసేకరణ విషయంలో సంబంధిత వ్యక్తులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఏ.యం.ఆర్.పి., యూనిట్-1, నల్లగొండ గార్లకు ప్రకటన జారీచేసిన (60) దినముల లోపల తెలపవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు ఆర్ఆర్.ఎల్,ఎ.,యూనిట్ - 1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, నల్లగొండ.
సం/- అదనపు కలెక్టరు నల్లగొండ.
సం/- జిల్లా కలెక్టరు నల్లగొండ.

DIPR RO NO. 774/LA/PP/Advt/Pub/2025-26


# ముఖ్యమంత్రిని కలిసిన వివిధ మైనారిటీ సంఘాల నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి వర్గంలో చోటు కల్పించనున్న నేపథ్యంలో బుధవారం వివిధ మైనారిటీ సంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మైనారిటీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మైనారిటీ సంఘాల నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫహీం ఖురేషి, వివిధ మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యల పరిష్కారానికి

# రేపు డిఇఒ కార్యాలయాల ముట్టడి

### మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల31వ తేదీన తలపెట్టిన డిఈఓ, కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని, జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ వంట కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచకుండా, నాణ్యమైన భోజనాలు అందించాలని, మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ఇప్పటికే 11 నెలలుగా అల్పాహారం బిల్లులు, 9 నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, 6నెలలుగా వంట బిల్లులు 8 నెలలుగా వేతనాలు పెండింగ్ లోనే ఉంటే, వంట కార్మికులు వంటలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఒక్క కూరకు మాత్రమే డబ్బులు చెల్లిస్తూ, రెండు కూరలు వడ్డించాలని ఒత్తిడి చేస్తే, ఆ నష్టం ఎవరు భరించాలి అన్నారు, కోడిగుడ్డుకు ప్రభుత్వం ఆరు రూపాయలు చెల్లిస్తే, మార్కెట్లో రూపాయలు 7 నుండి 8 వరకు లభిస్తోందని మరి ఈ నష్టాలు ఎవరు చెల్లిస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం నెలకు రూ.10 వేలు వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టం చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని అధికారులను సంప్రదిస్తే ఏమాత్రం స్పందించపోవడం వల్లే తాము తప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలలో వంటలు బందు చేసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. అప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాకపోతే నవంబర్ 12వ తేదీన కమిషనరేట్ కార్యాలయం ముట్టడికిగాను, చలో హైదరాబాద్ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ పరిస్థితి రాకుండా ఉండేలాంటే, తమను ఇబ్బందుల గురి చేయకుండా ప్రభుత్వం, అధికారులు, శాసనసభ్యులు, మంత్రులు కృషి చేయాలని రవీందర్ కోరారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్ఎ టి.హరీష్ రావును బుధవారం కోకాపేటలోని ఆయన నివాసంలో మాజీ ఎంఎల్ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మంగళవారం టి.హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మంగళవారం మృతి చెందడంతో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి సత్యనారాయణ రావు చిత్రపటానికి చాడ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మంచితనం, మానవత్వం మూర్తిభావించిన సత్యనారాయణ రావు ప్రభుత్వ ఉద్యోగిగా అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించి ఎంతో మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. తన కుమారుడు హరీష్‌రావు రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ ప్రజలకు సేవ చేయడం పట్ల తండ్రిగా సత్యనారాయణరావు ఎంతో సంతోషపడేవారన్నారు. ఎంతో గొప్ప వ్యక్తిత్వం ఉన్న సత్యనారాయణరావు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి చాడ వెంకటరెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మత్స్యకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు

### మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** చేపలు పెంపకం ద్వారా మత్స్యకారుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర మత్స్య, పాడి, పశు సంవర్ధక యువజన సర్వీసులు క్రీడలు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం బొల్లారం గ్రామంలో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌లో రూ.12 లక్షల విలువ గల 7 లక్షల 77 వేల చేప పిల్లలకు గాను మొదటి విడత 2 లక్షల 50 వేల చేప పిల్లలను వంద శాతం సబ్సిడీతో మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి. ఖదీర్ అహ్మద్, మత్స్యశాఖ ఏడి. రాధా రోహిని, మత్స్య సహకారి సంఘాల అధ్యక్షులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా కొయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 123 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.94 కోట్లతో 88 కోట్ల చేప పిల్లలను రాష్ట్రంలోని 26000 చెరువుల్లో, రూ.29 కోట్లతో 300 చెరువులలో 10 కోట్ల రొయ్యలను వంద శాతం సబ్సిడీతో వదలు తున్నట్లు తెలిపారు. చేపల పెంపకంతో మత్స్యరంగంపై ఆధారపడ్డ 5 లక్షల మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి కలుగనున్నట్లు తెలిపారు. మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గంను మొదట అభివృద్ధికి మక్తల్ నియోజకవర్గంతో పాటు ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాలలో చేప పిల్లల ఉత్పత్తిపై దృష్టి పెట్టలేదని అన్నారు. తాను క్యాబినెట్ మంత్రి అయిన తర్వాత మత్స్య శాఖకు ఆరకొరగా కేటాయించిన బడ్జెట్ పెంచాలని అడిగిన వెంటనే రూ.123 కోట్లు చేపల ఉత్పత్తికి కేటాయించారని, రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో రూ.175కోట్లతో 3600 ఇండ్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పాలకులు వరి వేస్తే ఉరి అన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యంకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 తెలిపారు. కుటుంబంలో ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం అందచేస్తున్నట్లు తెలిపారు. బొల్లారం గ్రామంలో ఉన్న చేపల పెంపకం కేంద్రం నవీకరణ పనులకు రూ.ఒక కోటి మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా కొత్తకోట, మదనాపరం, దేవరకద్రలో చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి అ జెండాతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజల సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో వలె కాకండా చేపలు 80 ఎంఎం సైజు తక్కువ కాకుండా, ఖచ్చితమైన నంబర్‌తో చేపలపై శ్రద్ధ వహించినట్లు తెలిపారు. వెటర్నరీ ఆసుపత్రులలో మందుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని, వెటర్నరీ ఆసుపతులను అప్‌గ్రేడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి. ఖదీర్ అహ్మద్, మత్స్యశాఖ ఏ.డి రాధా రోహిణి, ఆర్.డి.ఓ నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, ఎం.పి.డి.ఓ శ్రీనివాస రావు, తహశీల్దార్ దీపిక, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు లు పాల్గొన్నారు.

**దేవరకద్ర మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రారంభం**

చేప పిల్లలు వదలిన అనంతరం దేవరకద్ర మండలం నార్లోని కుంటలో జి.పి.భవనంను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. పెద్ద గోపాల్ పూర్, మీనగోయినపల్లి, బలుసుపల్లి గ్రామం ఓపెన్ జిమ్, పార్కుల సుందరీకరణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తర్వాత దేవరకద్ర మండలంలో ఇందిరమ్మ మోడల్ హౌస్, సహాయక ఇంజనీర్, కార్యాలయం ను ప్రారంభించారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అదేశించారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడి మంత్రి పలు సూచనలతో పాటు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారంరాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు తమ పంటలను వర్షాల భారీనుండి కాపాడుకోవాలని, తొందరపడి పంటలను అమ్ముకోవొద్దని, వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలను వాగులు వంకలు దాటకుండా చూడాలని, అందుకోసం పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావంతో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా చెరువుల వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ గా ఉండాలని ఆదేశించిన మంత్రి తుమ్మల అత్యవసర పరిస్థితిలో తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని ప్రజలను కోరారు.

## ఇక జనగాంలో.. ఆ రైలు ఆగుతుంది



భువనగిరి ఎంపి చామల కృషి ఫలితం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తన నియోజక వర్గం ప్రజల అవసరాల నేపథ్యంలో విజయవాడ–సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు భువనగిరి రైల్వే స్టేషన్‌లో అదనపు స్టాపేజ్ పెట్టాలని ఏడాది కాలంగా ఆయన పోరాటినికి ఫలిఫలం దక్కింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి విజయవాడ – సికింద్రాబాద్ శతవాహన ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబర్ . 12713/12714) రైలుకు జనగాం రైల్వేస్టేషన్‌లో అదనపు స్టాపేజ్ మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ సదుపాయం ప్రయోగాత్మకంగా 2025 అక్టోబర్ 30వ తేదీ నుండి అమల్లోకి రానుంది. జనగాం జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడి ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు మరియు వ్యాపారవేత్తలు తరచూ హైదరాబాద్, విజయవాడలకు ప్రయాణిస్తుంటారు,శతవాహన ఎక్స్‌ప్రెస్‌కు జనగాం స్టేషన్‌లో స్టాపేజ్ కల్పించడం వలన ప్రజలకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది, ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడుతుంది. ఈ ప్రజా విజ్ఞప్తిని గౌరవించి తక్షణం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను అని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే, ఆయన ఈ నిర్ణయం జనగాం పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.


జల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం : రంగారెడ్డి జిల్లా

'E'- ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

Lr. Roc. No. E1/JLPM/MGF/CC Road/SP-077/01/2025-26 తేది: 29.10.2025

జల్‌పల్లి మునిసిపాలిటీలోని వార్డు నెం.24 వద్ద (1 సంఖ్యలు) సిసి రోడ్డు వేయడానికి రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. రూ. 10.50 లక్షలకు టెండర్లను జల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ ద్వారా 06.11.2025 మధ్యాహ్నం 03:30 గంటల వరకు స్వీకరించబడతాయి మరియు టెండర్లను మ. 03.31 గంటలకు జల్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ లేదా అతని డిప్యూటీ, టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో తెరుస్తారు.

పిలవబడే టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:

1. టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్న తేదీ : 29.10.2025.
2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్ల దాఖలు : 06.11.2025 మ.03:30 గంటలకు.
3. టెండర్ల ప్రారంభం : 06.11.2025 మ.03:31 గంటలకు

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారమ్ అనగా https://tender.telangana.gov.inని సంప్రదించండి. లేదా జల్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం ఫోన్: 9573904333 / 9652776588.

సం/- కమిషనర్ జల్‌పల్లి మునిసిపాలిటీ

DIPR R.O. No. : 9887-PP/CL/ADVT/1/2025-26, Date: 29-10-2025

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ GHMC

NIT No. Q8/EE/Divn.15/SBZ/GHMC/2025-26 తేది: 28-10-2025

| క్ర. సం. | కింద పేర్కొనబడిన ఐటెమ్స్ కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అథారిటీలు మరియు డీలర్లు, ఏజెన్సీలు మొదలైన వారి నుండి కొటేషన్లు ఆహ్వానించడమైనది. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్, ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|
| 1 | 1) అన్ని ఛార్జీలు మొదలైన మొదలైన వాటితో సహా 2-3 టన్నుల సామర్థ్యం గల 5 HP డీజిల్ ప్లేట్ కాంపాక్టర్ సేకరణ పూర్తి.<br>2) స్తంభాల ఎత్తు 1200 m.m తెరిచిన పొడవు 3500 m.m మాత్రమే మెట్రో ఫ్లాషర్ మరియు 3m రిఫ్లెక్టివ్ టేప్‌తో కూడిన మెటల్ బారియర్ సరఫరా మరియు డెలివరీ, అన్ని మెటీరియల్ ఛార్జీల ఖర్చు మరియు రవాణాతో సహా పూర్తి.<br>3) బిట్‌మన్ ఎమల్షన్ RS1సీల్డ్ డ్రమ్ 200లీటర్లు సరఫరా | 29-10-2025 ఉ.11:00గం.ల నుండి<br>31-10-2025 సా.5.00గం.ల వరకు | సీల్డ్ కొటేషన్లను తేది: 31-10-2025న సా.05.00గం.లు లేదా అంతకు ముందు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-డివిజన్-15, జిహెచ్‌ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్‌లో సమర్పించవచ్చు. సెల్: 7995997437 |

పైన పేర్కొనబడిన ఐటెమ్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి స్పెసిఫికేషన్‌లను GHMC. వెబ్‌సైట్: https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు.

To, The notice board

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్ నెంబర్.15, GHMC.

DIPR R.O. No. : 9909-PP/CL/ADVT/1/2025-26, Date: 29-10-2025

## నేడు సిపిఐ సూర్యాపేట జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : నేడు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సిపిఐ జాతీయ కమిటి నిర్ణయాలను విస్తృత కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు తెలియజేస్తారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మోంతా తుఫాన్ ప్రభావంతో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని ఈ మేరకు సూర్యాపేట జిల్లాకు రెయిన్ అలర్ట్ ప్రకటించినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా రోడ్లపై నుండి నీటి ప్రవాహం ఉధృతంగా ఉంటే అలాంటి కల్వర్టులు, వంతెనలు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారినపడ్డవద్దన్నారు. జిల్లా పోలీస్ శాఖ అంత అప్రమత్తంగా ఉందని, సెలువులు రద్దుచేసి విధుల్లో నియమించినట్లు వివరించారు. ప్రమాద స్థలాలు, నాళాలు, వంతెనలు, కల్వర్టుల వద్ద పికెటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వరదనీరు వంతెనలపై నుండి ప్రవహిస్తే వాహనాలతో వంతెనలు దాటవద్దని కోరారు. ప్రజలు పోలీస్ వారి సూచనలు పాటించాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 100, సూర్యాపేట పోలీస్ కంట్రోల్ రూమ్‌కు 8712686026కు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ స్థంబాలు, తీగలు ముట్టుకోవవద్దు, మరమత్తులు చేయవద్దని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్ళవద్దు, చేపల వేటకు, పశువుల మేతకు బయటకు వెళ్ళవద్దన్నారు.

## మహిళపై దాడి చేసిన వారికి శిక్ష ఖరారు

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 సంవత్సరంలో నమోదైన కేసులో నర్సాపురం గ్రామానికి చెందిన కవాటి మహేశ్, కవాటి నరేశ్, కవాటి శివ, ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల రామకృష్ణ , కవాటి సుధర్శన్ అనే ఆరుగురు నిందితులు మహిళపై దాడి చేసి, గాయపరిచిన సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వలిగొండ ఎస్‌ఐ పి.శివనాగ ప్రసాద్, (ప్రస్తుతం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,నాగోల్ పోలీస్ స్టేషన్) ఆధారాలను సేకరించి, సాక్ష్యాలతో కోర్టులో చార్జిట్ సమర్పించారు. బుధవారం రామన్నపేట అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, న్యాయమూర్తి యస్. శిరీష నిందితులందరినీ దోషులుగా నిర్ధారించి, ప్రతి ఒక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో ఏపీపీ పి.వెంకట అవినాష్ సమర్థంగా వాదించారు. కేసు విజయవంతంగా పూర్తికావడంలో సహకరించిన సిడిఓ ఏ.రామచారి వలిగొండ పోలీస్ సిబ్బందికి అభినందించారు. వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే పనులకు మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

## 31 జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఈ నెల31న జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యకతన నల్లగొండ మఖ్దూమ్ భవనంలో జరిగింది ఈ సమావేశంలో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం లో ఎఐటియుసి కీలక పాత్ర పోషించిన చరిత్ర ఘనమైనదన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాల ని 4 కోడ్ లుగా మార్చి హక్కులు లేకుండా చేసి యాజమాన్యంలకు తొత్తు లుగా చట్టాలు మార్పులు చేశారు అని ఆరోపించారు. దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని నాటి నుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజిలేని సమరశీల పోరాటాలు నడుపుతుందన్నారు. కాంటాక్ట్ వ్యవస్థ రద్దు కోసం కనీస వేతనాలు అమలు కోసం ఉద్యోగ భద్రత కోసం రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయాద్,కేఎస్ రెడ్డి,సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు,దోటీ వెంకన్న,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె రవి,నాగరాజు, వి లెనిన్ పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

ప్రజాపక్షం/మోటకొండూరు : మోంథా తుపాను ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన గత రెండు రోజులగా కురుస్తున్న బారీ వర్షాలకు వరి, పత్తి పంటలు చేతికి వచ్చే సమయంలో రైతులు బారీగా నష్టపోతున్నారని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరిపొలాలు మొత్తం పడిపోయి, రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయివున్నారని, ప్రభుత్వం వెంటనే అధికారులతో సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. పత్తి పంటలు వర్షాలకు పూర్తిగా తడిసి పోయిందని సిసిఐ ద్వారా ఎలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోల్లు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మండల వ్యవసాయాదికారులతో సర్వే చేయించి నష్టపోయిన పత్తి, వరి పంటల వివరాలు సేకరించి పరిహారం అందించాలని సత్యనారాయణ కోరారు.

## రైతులకు కన్నీటిని మిగిల్చిన 'మొంథా'



ప్రజాపక్షం/చింతలపాలెం : సూర్యాపేట జిల్లా ఉమ్మడి మండలాలైనటువంటి చింతలపాలెం, మేళ్లచెరువు మండల కేంద్రాల్లో సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములు నీరు సరిగ్గా అందకపోవడంతో ఇక్కడి ప్రాంత రైతులు ఎక్కువగా మెట్ట ప్రాంతం అయినటువంటి పత్తి, మిరప అత్యధికంగా సాగు చేయడం జరుగుతుంది. మరికొన్ని చోట్ల బోర్లకింద వరి నాట్లు వేయడం జరిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలు, తుఫాన్ దాటికి పత్తి ఏరివేసే సమయం ఆసన్నమైనప్పటికి వర్షాలు కురవడంతో రైతులు వెనుకబడటం జరిగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలంలోని పత్తి రంగు మారటం, గింజలు మొలకలు రావడం జరుగుతుందని ఒకవేళ వర్షం తగ్గినాక ఏరించినా పత్తి కొనే పరిస్థితి ఉండదని కూలీ ఖర్చులు అధికంగా అవుతాయని, గిట్టుబాటు కూడా కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్లకు, ప్రభుత్వానికి చేరవేయాలని, ఒకవేళ ప్రభుత్వాలు ఆదుకోలేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు కన్నీటితో తమ బాధను వెలుబుచ్చుతున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుల పక్షాన చొరవ తీసుకొని రైతులకు వెంటనే పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు అందించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

## పొట్టకూటి కోసం వస్తే ప్రాణం పోయింది

విద్యుత్ షాక్ తగిలి మృతి

నల్లగొండ ఉర్సు మేళాలో విషాదం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలో గత 20రోజులుగా నడుస్తున్న ఉర్సులో ఏక్ మాల్ ఐటమ్స్ అమ్ముకోవడానికి యుపి రాష్ట్రానికి చెందిన రియాజ్(25) వచ్చి వ్యాపారం చేసుకుంటు న్నారు. ఈ క్రమంలో మృతుడు రియాజ్ షాపులో కరెంటు కోసం పక్క షాపు నుంచి తీగ లాగి, టేప్ బదులు ప్లాస్టిక్ కవర్లు చుట్టాడు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల నీరు కవర్లలో చేరి, ఇనుప ర్యాకులకు కరెంట్ సరఫరా కావడంతో అది గమనించని రియాజ్ ర్యాక్ తాకగానే షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొని వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడిని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# సూర్యాపేట జిల్లాలో పత్తి, వరి పంటలకు తీవ్రనష్టం

మొంథా తుపాన్‌తో విస్తారంగా వర్షాలు

చందంపేట మండలం చిత్రియాలలో

పదుల సంఖ్యలో గొర్రెలు మృత్యువాత





హాలియాలో




భూదాన్‌పోచంపల్లి



కొండమల్లేపల్లిలో





ప్రజాపక్షం/సూర్యాపేట : మొంథా తుపాన్‌తో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. సూర్యాపేటతోపాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజక వర్గాలలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో తుపాన్ ప్రభావంతో వీధులు జలమయంగా మారి మురుగు కాలువలు ఉప్పొంగిపోతున్నాయి. పలు చోట్ల రోడ్లు, వంతెనలపైకి నీరు రాగా గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలలోని ఇండ్లలోకి నీరు చేరాయి. తుఫాన్ ప్రభావంతో పత్తి, వరి పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఆయా ప్రాంతాలలో నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండలంలో అత్యధికంగా 125.0 మీ.మీ. వర్షపాతం నమోదుకాగా, అతి స్వల్పంగా మునగాల మండలంలో 1.8 మీ.మీ. వర్షపాతం నమోదైంది. నాగారం మండలంలో 106.8 మీ.మీ., తిరుమలగిరి మండలంలో 105.5 మీ.మీ., అర్వపల్లి మండలంలో 99.3 మీ.మీ., నాగారం మండలంలో 90.3 మీ.మీ, సూర్యాపేట మండలంలో 89.8 మీ.మీ., మద్దిరాల మండలంలో 87.5 మీ.మీ, మోతె మండలంలో 61.5 మీ.మీ., చిలుకూరు మండలంలో 42.5 మీ.మీ., నూతనకల్ మండలంలో 24.0 మీ.మీ., కోదాడ మండలంలో 22.8 మీ.మీ., పెన్‌పహాడ్ మండలంలో 22.3 మీ.మీ., చివ్వెంల మండలంలో 20.0 మీ.మీ., ఆత్మకూర్(ఎస్) మండలంలో 16.5 మీ.మీ. వర్షపాతం నమోదైంది. పాలకీడు, గరిడేపల్లి మండల్లాలో 15.0 మీ.మీ., మేళ్లచెరువు మండలంలో 14.0 మీ.మీ., చింతలపాలెం మండలంలో 13.5 మీ.మీ., మట్టంపల్లి మండలంలో 9.8 మీ.మీ., నేరేడుచర్ల మండలంలో 6.3 మీ.మీ., హుజూర్‌నగర్, నడిగూడెం మండల్లాలో 2.0 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

మోంతా తుఫాన్‌తో జిల్లాలో పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా రైతులు పత్తి పంటను 91వేల ఎకరాలలో సాగు చేయగా, వరి పంటను 4 లక్షల 85 వేల 69 ఎకరాలలో సాగు చేశారు. పత్తి చేతికందిన సమయంలోనే వర్షాలు కురుస్తుండడంతో చెట్టు మీద ఉన్న పత్తి నేల రాలడంతోపాటు రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఇప్పటి వరకు మొదటి పంట మైల పత్తిని మాత్రమే తీశారు. మిగతా పత్తి అంతా పంట చేలలోనే ఉండిపోయింది. ఇదిలా ఉంటే వరి పంటకు కూడా అదే స్థాయిలో నష్టం వాటిల్లింది. బావులు, బోర్ల కింద వరి పంటను సాగు చేసిన రైతులు కొంతమంది పంటను కోసి నూర్పిడి చేయగా, మరి కొంత మంది పైరును కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇటీవల కాలంలో వరుసగా అకాల వర్షాలు కురవడంతోపాటు గత రెండు రోజులు నుండి మోంతా తుపాన్‌తో కురుస్తున్న వర్షాలతో పైరు నేలకు ఒరిగి కిందపడిపోయి గింజలు నేలరాలాయి. ఈ తుపాన్ ప్రభావం ఇలానే మరో 24 గంటలు కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి.

ప్రజాపక్షం/చందంపేట : మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి అలుగు పొస్తున్నాయి. మంగళవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి చిత్రియాల గ్రామంలో తుమ్మల వెంకటయ్యకు చెందిన గొర్రెలు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డాయి.



## గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు యువతను చైతన్యం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎంజాయి పేరుతో గంజాయి వద్దు నాటక కళా ప్రదర్శన




ప్రజాపక్షం/నల్లగొండ : అనేక ప్రజాద్యమాలకు కీలక పాత్ర పోషించిన యూనివర్సిటీ విద్యార్థులు సామాజిక రుగ్మతలకు మూల కారణమైన గంజాయి, డ్రగ్స్ నిర్మూలించేందుకు ప్రజలను,విద్యార్థి యువతను చైతన్యం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి నేతృత్వంలో చేపట్టిన ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దు బస్సు కళా జాత బుధవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని, ఆ వ్యవసం నుంచి బయటపడడం చాలా కష్టమని, వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ వ్యసనాలు ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తుందని, పర్యావరణానికి నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో అతి కొద్ది మంది సంపన్నులకే పరిమితమైన గంజా యి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో కిరాణం షాప్‌లలో చాక్లెట్ రూపంలో రావడం దురదృష్టకరమన్నారు. వీటి నిర్మూలనకు విస్తృతమైన ప్రచారం కోసం బస్సు కళాజాత చేపడుతున్న ప్రజా నాట్య మండలిని ఆయన అభినందించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ సామాజిక రుగ్మతల రూపుమాపుటలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,తెలంగాణ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు,ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ఎఐఎస్‌ఎఫ్ యూనివర్సిటీల కన్వీనర్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ మురళి కృష్ణ, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ఎంజియూ అధ్యాపకులు డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి,డాక్టర్ అనిత కుమారి,డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఏ మధు తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం డ్రగ్స్ బారిన పడు తున్న విద్యార్థులు ఆ కుటుంబ పరిస్థితులపైన ప్రదర్శించిన వీది నాటకం విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నది.



## సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద..

గంట గంటకూ పెరుగుతున్న వరద ఉధ్ధృతి..

4గేట్లు ఐదు అడుగుల మేర పైకి లేపి నీరు విడుదల

ప్రజాపక్షం/నందికొండ: మొంథా తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాలలో భారీగా వర్షాలు పడుతుండటంతో ఎగువ ప్రాజెక్టులనుంచి శ్రీశైలం కు భారీగా ఇన్ ఫ్లో వస్తున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ వైపు 3 లక్షల క్యూసెక్కుల పైన నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు 50 వేల క్యూసెక్కులుగా ఉన్న వరద ఒకేసారి 4 లక్షలకు పెరగడంతో ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తూ గరిష్ట నీటిమట్టానికి చేరుకొని ఉండటంతో ప్రాజెక్టు అధికారులు సాయంత్రం ఏడు గంటల తరువాత నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర పైకి లేపి 65077 క్యూసెక్కుల నీటిని దిగువ విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతూ ఉండగా కుడి ఎడమ కాలువల నుంచి ఎటువంటి నీటి విడుదల కొనసాగటం లేదు ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం 589.60 అడుగులుగా ఉన్నది. వరద ఉధృతి ఇదేవిధంగా కొనసాగితే ఇంకా మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

## మైనర్ పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం

బేబీలను అక్రమ దత్తత చేసిన ఏడుగురు వ్యక్తులు అరెస్ట్.. రిమాండ్

జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వెల్లడి





ప్రజాపక్షం/నల్లగొండ : మైనర్ పిల్లలను అమ్మడం, కొనడం, దత్తత తీసుకోవడం, మధ్యవర్తిత్వం వహించడం చట్టరీత్యతీవ్ర నేరం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డిడబ్ల్యుఓ, డిసిపిఓ,ఐసిడిఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో రెండు రోజుల క్రితం 10 రోజుల బేబీని 21 రోజుల బాబును అక్రమంగా దత్తత చేసుకున్నారన్న విషయంలో వన్‌టౌన్,టు టౌన్ పోలీస్ స్టేషన్‌ల లో ఐసిడిఎస్ సూపర్వైజర్ సరస్వతి ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసుకొని విచారణ చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్రమ దత్తత చేసిన ఏడుగురు వ్యక్తుల ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని బేబీలను సురక్షితంగా రెస్క్యూ చేసి, శిశు గృహానికి అప్పగించి మధ్యవర్తిత్వం చేసిన డాక్టర్, మరొక వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు.అరెస్టు చేసిన వారి దగ్గర నుండి 20 వేల రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లు, అగ్రిమెంట్ డాక్యుమెంట్ స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎ1 అయిన కుర్ర బాబుది సొంత ఊరు ఎల్లాపురం, తిరుమలగిరి సాగర్ మండలం ప్రస్తుత బిటిఎస్ నల్లగొండలో ఉంటున్నానని, తనకు పార్వతితో 11 ఏండ్ల క్రితం వివాహమై కూలి పని చేస్తూ, తాగుడుకు బానిసై, వివాహం అయిన దగ్గర నుండి కొడుకు కావాలని భార్యని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో వారికి మొదట మగ పిల్లగాడు పుట్టి చనిపోగా,తర్వాత ఇద్దరు ఆడపిల్లలు పుట్టినాక మళ్లీ ఒక ఆడపిల్ల పుట్టి 2 సం.ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. తిరిగి 15 రోజుల క్రితం బాబు పుడతాడు అనుకుని, హాలియాలోని నిర్మల హాస్పిటల్ లో పార్వతిని అడ్మిట్ చేయగా,మళ్ళీ ఆడపిల్ల పుట్టేసరికి ఆడపిల్లను సాకడం భారమవుతుందని అదే హాస్పిటల్ ఉక్రెయిన్‌లో ఎంబిబిఎస్ చేసి డ్యూటి డాక్టర్‌గా పనిచేస్తున్న ఎ4 శాంతి ప్రియా అనే డాక్టర్ కి తెలియజేయగా తనకు తెలిసిన బంధువు సరస్వతి ద్వారా సాంబమూర్తి దంపతులకు పిల్లలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిసి ఏలూరుకు చెందిన ఎ 2 సాంబమూర్తి, ఎ 3 రజితలకు తెలియజేసి, ఈనెల 25నఈనెల నల్లగొండ బస్టాండ్ నల్లగొండ,రైల్వే స్టేషన్ పోవు దారి మద్యలో రోడ్డు దగ్గరికి వచ్చి కుర్ర బాబు, అతని బార్య పార్వతి దగ్గర నుండి పాపను రెండు లక్షల 30 వేల రూపాయలకు దత్తత ఒప్పందం కుదుర్చుకొని, అడ్వాన్సుగా పదివేల రూపాయలను ఇచ్చి, పాప హెల్త్ చెకప్ లీగల్ ప్రాసెస్ పూర్తి చేసి మిగతా డబ్బులను ఇచ్చే విధంగా ఒక ఒప్పందంతో పాపను సాంబమూర్తి దంపతులు తీసుకొని వెళ్ళిపోయరని తెలిపారు.

## చట్టాలకు విలువనివ్వని వారు దేశద్రోహులు : మందకృష్ణ మాదిగ

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 1న హైదరాబాదులో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మహా నిరసన ప్రదర్శనచేపట్టడం జరుగుతుందని చేపట్టడం జరుగుతుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై ఇప్పటికి వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యలు, హత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి నిత్యం సామాన్య ప్రజల మీద ఎక్కడో ఓ దిక్కు జరుగుతూనే ఉన్నాయని మీడియా ద్వారా చూస్తూనే ఉన్నామన్నారు. దేశ అత్యున్నత వ్యవస్థ సుప్రీం కోర్టు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దళితుడైన గవాయ్ మీదనే సుప్రీం కోర్టులో బూటుతో దాడి జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో దేశం, ప్రపంచంలోనే ప్రజలు నివ్వెరపోయారన్నారు. దేశంలో దళితులకు ఇప్పటికీ రక్షణ లేదని స్పష్టంగా రుజువు అవుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద్ నరేష్ మాదిగ,ఎంఎస్ ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఉద్యోగ సంఘం నాయకులు మల్లేపాక వెంకన్న, నాయకులు మేడి శంకర్, కొమిరే స్వామి,కూరపాటి కమలమ్మ, పోలే యాదయ్య పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 12 రాష్ట్రాలు, యుటిల్లో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

**న్యూఢిల్లీ:** వచ్చేవారం నుంచి 12 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో (యుటి) ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను (సర్) ఎన్నికల సంఘం నిర్వహించనుంది. అయితే ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓటింగ్ క్యూలను తగ్గించడానికి మరిన్ని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే బిహార్‌లో సర్ పూర్తికాగా, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,500 మంది ఓటర్లతో దేశంలోనే మొదటి రాష్ట్రంగా అవతరించింది. హేతుబద్ధీకరణ కసరత్తులో భాగంగా ఎక్కువ పోలింగ్ కేంద్రాలు రానున్నాయి. బిహార్ తరహాలో ఇక్కడ ఈ సంఖ్య గతం లో 77,895 నుండి 90,712 కు పెరిగింది. అదే విధంగా హేతుబద్ధీకరణ అంటే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తమ వంతు కోసం వేచి ఉన్నప్పుడు తక్కువ సమయం క్యూలలో గడపవలసి ఉండడమే. నవంబర్ 4న సర్ కసరత్తు ప్రారంభమయ్యే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సం ఘం సూచనల ప్రకారం ఎత్తయిన భవనాలు, నివాసి సంక్షేమ సంఘాలు ఉన్న కాలనీలు, మురికివాడల సమూహాలలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

# ఓట్ల కోసం మోదీ ఏదైనా చేస్తారు!

### నృత్యం చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు
### బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ విమర్శ



ముజఫర్‌నగర్/దర్భాంగ : ఓట్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఏదైనా చేస్తారని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. బిహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని బిజెపి 'రిమోట్ కంట్రోల్ ద్వారా' నడుపుతోందని ఆరోపించారు. రాహుల్ బుధవారం బిహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముజఫర్‌పూర్, దర్భంగాలలో నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొన్నారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్‌తో కలిసి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఏదో ఒక డ్రామా ఆడుతారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఛట్ పూజ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ యమునా నదిలో స్నానం చేస్తానని చెప్పారని, అయితే నదిలో కాకుండా నది పక్కన ఒక కుంటను తవ్వించి, అందులో పైప్ ద్వారా స్వచ్ఛమైన నీళ్లను నింపించి స్నానం చేశారని తెలిపారు. ఈ చర్య ద్వారా యమునా నదిలో మురుగు నీరు ప్రవహిస్తుందనే నిజాన్ని దేశానికి తెలియజెప్పారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోసం ప్రధాని ఈ డ్రామా ఆడారని, అయితే కుంటలోకి స్వచ్ఛమైన నీళ్లను వదిలేందుకు ఏర్పాటు చేసిన పైపు ఫొటో బయటపడటంతో ఆ డ్రామా బెడిసికొట్టిందని రాహుల్ చెప్పారు. తర్వాత జరిగే ప్రధాని ప్రచార సభలో ఓ 200 మంది లేచి ఓట్ల కోసం డ్యాన్స్ చేయాలని ప్రధానిని కోరితే వెంటనే డ్యాన్స్ మొదలవుతుందని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ఏకంగా భరతనాట్యమే చేస్తారని ఆయన విమర్శించారు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ నాయకత్వంలో బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని, కుల, మతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను జాగ్రత్తగా చూసుకుంటారన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారనే భ్రమ నుంచి బయటపడాలని, తాను రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన వర్గాలను కోరుతున్నానన్నారు. ఇది రిమోట్ కంట్రోల్ ద్వారా నడిచే ప్రభుత్వమని, బిజెపి, బిహార్‌ను పట్టించుకోదని విమర్శించారు. మీరంతా ధరించే దుస్తులు ఎక్కువగా చైనాలో తయారు చేసిన లేబుల్‌ను కలిగి ఉంటాయని, వాటిని బిహార్‌లో తయారు చేసిన వాటితో భర్తీ చేసే రోజును తాను చూడాలనుకుంటున్నానన్నారు. కానీ పెద్ద వ్యాపార సంస్థలకు పనిచేసే విధానంలో ఇది జరగదన్నారు. నోట్ల రద్దు, లోపభూయిష్ట జిఎస్‌టి వంటి చర్యల ద్వారా బిజెపి నాశనం చేసిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అవసరమన్నారు. కాంగ్రెస్ పట్టుదల వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందని గాంధీ పేర్కొన్నారు. 'రెండు భారతదేశాలు ఆవిర్భవిస్తున్నాయి. ఒకటి సా మాన్య ప్రజలకు చెందినది, మరొకటి ఐదుగురు లేదా పది మంది బిలియనీర్లకు చెందినది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో ము నిగిపోవడానికి ఇదే కారణం, దాని విస్తారమైన సామర్థ్యం ఉపయోగించబడకుండానే ఉంది' అని ఆయన ఆరోపించారు. చౌకైన ఇంటర్నెట్ పేదలకు కూడా సోషల్ మీడియాను అందుబాటులోకి తెచ్చిందని ప్రధాని చెప్పుకుంటున్నారని, అయితే టెలికాం రంగంలో ఒక వ్యాపార సంస్థ గుత్తాధిపత్యాన్ని తాను అను ప్రజలు ఉద్యోగాలులేక రీల్స్, ఇన్‌స్టాగ్రామ్‌కు బానిస కావాలని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు. అమెరికా ఒత్తిడితో ఆపరేషన్ సిందూర్ ఆగిపోయిందని పదే పదే చెబుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఖండించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. బిజెపి మహారాష్ట్ర, హర్యానాలో ఎన్నికలను దొంగిలించిందని, బీహార్‌లో కూడా అదే చేయడానికి ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. బిహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడుతామని రాహుల్ గాంధీ హామీనిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక నలంద విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ హయాంలోనే నాంది పడిందన్నారు. భవిష్యత్తులో అమెరికన్లు సైతం తమ ఉన్నత విద్య కోసం ఇక్కడికి వస్తారని జోస్యం చెప్పారు.

**ఫ్యాక్టరీలు గుజరాత్‌కు... బిహార్‌లో గెలుపు కావాలా: తేజస్వీ**

తేజస్వి యాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లో ఫ్యాక్టరీలను తెరవడానికి ఆసక్తి చూపుతున్నారని, కానీ బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షం అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్లను రూ.500లకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. బిహార్ ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇటీవల కాలంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు తాను గతంలో ఇచ్చిన హామీలకు 'కాపీ' అని కూడా ఆయన పేర్కొన్నారు. ఒక ఉదాహరణను ఉటంకిస్తూ, తాము మేము 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును హామీ ఇచ్చామని, అధికారంలో ఉన్నవారు ఇది ఓటర్లను ఆకట్టుకుంటుందని భయపడి 125 యూనిట్లను ఉచితంగా ఇస్తున్నారని ఆరోపించారు. నితీశ్ కుమార్‌ను విమర్శిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని బిజెపి రిమోట్ కంట్రోల్‌బిహార్‌లో ఓట్లు కోరుతూ గుజరాత్‌లో మాత్రమే ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయడం పట్ల శ్రద్ధ వహించే బయటి వ్యక్తుల (బహారీ) నియంత్రణలో ఉన్న ప్రభుత్వాన్ని మనం బిహారీలు తరిమికొట్టాలని విజ్ఞప్తి చేశారు. తన కుటుంబంపై ఉన్న అవినీతి మరకలను , ఆర్‌జెడి పాలనపై ఎన్‌డిఎ మోపిన 'జంగల్ రాజ్' ఆరోపణలను గుర్తుంచుకున్న యాదవ్, ఈ రెండు ఉపద్రవాలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

# నకిలీ ఓటర్లను తొలగించండి

### పశ్చిమ బెంగాల్‌లో సిఇఒకు లెఫ్ట్‌ఫ్రంట్ మెమోరాండం

**కోల్‌కతా :** మృతి చెందిన, నకిలీ ఓటర్లను తొలగించాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత నిజమైన ఓటర్లను చేర్చాలని ఎన్నికల సంఘాన్ని పశ్చి మ బెంగాల్‌లోని లెఫ్ట్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. 12 రాష్ట్రాలు, యుటిల్లో సర్ చేపడతామని ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ)కి ఒక మెమోరాండంను సమర్పించింది. ఆధార్, ఓటరు, ఉద్యోగం, రేషన్‌కార్డులను అర్హత కలిగిన ఓటరుకు రుజువుగా అంగీకరించాలని విజ్ఞప్తి చేసింది. సర్ పౌరసత్వాన్ని ధృవీకరించే ప్రక్రియ కాదని ఇసి ప్రచారం చేయాలని లెఫ్ట్ ఫ్రంట్ ఆ మెమోరాండంలో పేర్కొంది. మెమోరాండంపై సంతకం చేసిన వారిలో సిపిఐ, సిపిఐ(ఎం), ఆర్‌ఎస్‌పి, ఎఐఎఫ్‌బి, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసిఐ(సి) నాయకులు ఉన్నారు. సర్ గురించి ప్రజలలో ముఖ్యంగా వెనుకబడిన వర్గాలలో గందరగోళం సృష్టించడానికి కొన్ని విభాగాల నుండి ప్రయత్నం జరుగుతోందని పేర్కొంటూ, పోల్ ప్యానెల్ ప్రజలకు ఈ అంశంపై స్పష్టతను నిర్ధారించాలని లెఫ్ట్ ఫ్రంట్ పేర్కొంది. అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం సర్‌కు సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను అందించాలని పేర్కొంటూ, భారతీయ పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి మినహాయించకూడదని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ బెంగాల్ నుండి వలస వచ్చిన కార్మికుల ఓటు హక్కులను కాపాడటానికి ఇసి ఆదేశాలు ఇవ్వాలని, ఇతర ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులు వారి స్వస్థల నియోజకవర్గాల ఓటరు జాబితాలో వారి పేర్లు ఉండాలి వామపక్షనేతలు పేర్కొన్నారు. సరైన ఓటర్ల జాబితాతో రాష్ట్రంలో ఎన్నికలు జరిగేలా చూసుకోవాలని తాము ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామన్నారు. సర్ విధానం పారదర్శకతను నిర్ధారించడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, కమిషన్‌తో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని లెఫ్ట్ ఫ్రంట్ ఇసిని కోరింది. మెమోరాండం సమర్పించే ముందు జరిగిన సభలో ప్రసంగించిన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమాన్ బోస్, 1952 నుండి దేశంలో కాగా, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రానున్న ఎన్నికలపై ప్రజలలో భయానక మానసిక స్థితి సృష్టించబడుతున్న విధానం అపూర్వమైనది, ఆశ్చర్యకరమైనదని బోస్ నొక్కిచెప్పారు. కేంద్రంలో, పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న పార్టీలు ఓటర్లకు సహాయం చేస్తున్నామని చెప్పి వారిలో అపోహలు వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# అన్ని చోట్లా సర్‌ను వ్యతిరేకిస్తాం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ



**వయనాడ్ :** పార్లమెంటు లోపల, వెలుపల చేసినట్లుగానే కేరళలో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ అమలును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ చర్య గురించి విలేకరుల ప్రశ్నలకు వయనాడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియాంక సమాధానమిచ్చారు. 'కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సర్‌ను అమలు చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. మేము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాము' అని ఆమె అన్నారు. 'వారు (ఇసి) బిహార్‌లో దీన్ని ఎలా చేశారో చూస్తే, పార్లమెంటులో, ప్రతిచోటా దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాము' అని కాంగ్రెస్ ఎంపి బదులిచ్చారు. ఈ చర్యను 'ఎన్నికలలో మోసం, మోసం చేయడానికి ఏకైక మార్గం' అని పేర్కొన్నారు. బిహార్‌లో నిర్వహించిన విధంగా సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని ఆమె ఆరోపించారు. బిహార్‌లో ఏం జరిగిందో, అక్కడ సర్‌ను ఎలా అమలు చేశారో మనమంతా చూశామన్నారు. ప్రతి రాష్ట్రంలో వారు అదే చేయబోతున్నట్లయితే, అది ప్రజాస్వామ్యానికి అవమానం, మనం దానిపై పోరాడాలి అని ప్రియాంక సూచించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రియాంక వయనాడ్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె తన నియోజకవర్గంలో అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. మంగళవారం ఉదయం కరిపూర్ విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గంలో వయనాడ్‌కు ప్రయాణించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ముందు రోజు, ఆమె తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలప్పురం జిల్లాలోని ఎర్నాడ లో కొత్తగా నిర్మించిన రాజీవ్ గాంధీ స్మారక ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ భవనాన్ని ప్రారంభించారని వారు తెలిపారు.

# రాఫెల్‌లో రాష్ట్రపతి గగన విహారం

### ఇది మరపురాని అనుభూతి
### అని రాష్ట్రపతి ఉద్ఘాటన



**అంబాలా (హర్యానా) :** రాఫెల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ దేశ రక్షణ సామర్థ్యాలు తనలో కొత్త గర్వాన్ని నింపిందని, ఇది 'ఒక మరపురాని అనుభూతి'గా ఆమె అభివర్ణించారు. బుధవారం ఆమె ఇక్కడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి విహరించిన తర్వాత తన ప్రయాణ అనుభూతిని తెలియజేశారు. రాష్ట్రపతి ముర్ము తన పర్యటన సందర్భంగా స్క్వాడ్రన్ లీడర్ శివాంగీ సింగ్‌తో కలిసి ఆకాశంలో విహరించడానికి ముందు ఫోటోలు దిగడంతో శివాంగీ సింగ్ వార్తల్లో నిలిచారు. శివాంగీ సింగ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఆమె గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు శోధిస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా రాఫెల్ జెట్ పైలట్ అయిన శివాంగీ సింగ్ పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేశారు. భారత్ రాఫెల్ విమానాలను కూల్చివేశామని, ఒక మహిళా పైలట్‌ను బంధించామని తన అనుకూల సోషల్‌మీడియాలో పాకిస్థాన్ అసత్యాలు ప్రచారం చేసింది. మే 10న 'దిప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్' ఇది నకిలీది అని ఆరోపించింది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాఫెల్ జెట్‌లో ప్రయాణించగా, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ కూడా అదే వైమానిక స్థావరం నుండి ఒక ప్రత్యేక ఎయిర్ క్రాఫ్ట్‌లో ప్రయాణించారు. భారత వైమానిక దళం నుండి రెండు యుద్ధ విమానాలను తీసుకున్న మొదటి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2023 ఏప్రిల్‌లో, అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి సుఖోయ్30 ఎంకెఐ ఫైటర్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. మాజీ రాష్ట్రపతులు ఎ.పి.జె. అబ్దుల్‌కలామ్, ప్రతిభాపాటిల్ 2006 జూన్ 8న, 2009 నవంబరు 25l పుణే సమీపంలోని లోహెగాన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుండి తీసుకున్న సుఖోయ్30 ఎంకెఐ యుద్ధ విమానాలలో ప్రయాణించారు. రాఫెల్ జెట్‌ను ఎక్కడానికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక జిసూట్ ను ధరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్, మరికొంతమంది ఇతర సీనియర్ భారత వైమానిక దళం అధికారులతో ఫోటోలు దిగారు. ఉదయం 11.27గంటలకు విమానం ఆఫ్ అయ్యే ముందు ఆమె విమానంలోపలి నుండి చెయ్యి ఊపింది. ఆమె తన బొటనవేలును పైకి చూపుతూ సంజ్ఞ చేయడం కూడా ఒక చిత్రంలో కనిపించింది. ఈ విహారం దాదాపు 30 నిమిషాల పాటు కొనసాగింది. దాదాపు 200 కి.మీటర్లు ప్రయాణించి తిరిగి ఇక్కడి వైమానిక దళ కేంద్రానికి చేరుకుంది. ఈ ఎయిర్ క్రాఫ్ట్‌ను 17వ స్క్వాడ్రన్ యొక్క కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ నడుపుతారని రాష్ట్రపతి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది.ఈ ఫైటర్ జెట్ సముద్ర మట్టానికి ఎగువన దాదాపు 15,000 ఫీట్ల యెత్తున దాదాపు గంటకు 700 కి.మీటర్ల వేగంతో ప్రయాణించిందని ఆ ప్రకటన తెలియజేసింది. బుధవారం ఉదయం ఇక్కడి వైమానిక స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సామరస్య పూర్వక గౌరవ వందనం లభించింది. అనంతరం రాష్ట్రపతి ఇక్కడి సందర్శకుల పుస్తకంలో ఒక సంక్షిప్త నోట్‌ను రాశారు. ముర్ము మాట్లాడుతూ 'భారత వైమానిక దళం యొక్క రాఫెల్ ఎయిర్ క్రాఫ్ట్‌లో నా తొలి విమానం కోసం అంబాలా లోని వైమానిక దళ స్టేషన్‌ను సందర్శించడం నాకు చాలా ఆనందంగా ఉంది. రాఫెల్‌లో సార్టీ నాకు మరపురాని అనుభవాన్ని మిగిల్చింది' అని రాష్ట్రపతి తన అనుభూతిని పంచుకున్నారు. 'శక్తివంతమైన రాఫెల్ విమానంలో ఈ మొదటి విమానం దేశ రక్షణ సామర్థాలపై కొత్త గర్వాన్ని నింపింది. ఈ విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు, భారత వైమానిక దళం, అంబా లా వైమానిక దళ స్థావరం మొత్తం బృందాన్ని నేను అభినందిస్తున్నాను' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఈ సందర్భంగా రాఫెల్ గురించి, భారత వైమానిక దళం కార్యాచరణ యొక్క సామర్థ్యాల గురించి కూడా రాష్ట్రపతికి వివరించారు.

# బిహార్ సిఎం, ప్రధాని పదవులకు ఖాళీల్లేవ్

### ఆర్‌జెడి, కాంగ్రెస్‌పై అమిత్ షా విమర్శలు

**దర్భంగా/సమస్తిపూర్/బెగుసరాయ్ :** ఇండియా కూటమిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ తన కుమారుడు తేజస్వీని బిహార్ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని తన కుమారుడు రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేయాలని చూస్తున్నారన్నారు. అయితే ఆ రెండు పదవులూ ఖాళీగా లేవన్నారు. బుధవారం బిహార్ దర్భంగాలో జరిగిన బహిరంగ ర్యాలీలో షా మాట్లాడుతూ అరెస్టయిన రాడికల్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) సభ్యులు కాంగ్రెస్– ఆర్‌జెడి కూటమి బిహార్‌లో అధికారంలోకి వస్తే జైలులో ఉంటారా అని ప్రశ్నించారు. బిజెపి చాలా మంది యువకులకు బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు టిక్కెట్లు ఇచ్చింది, కానీ ఆర్‌జెడి, కాంగ్రెస్ ఇవ్వలేదని, ఎందుకంటే లాలూజీ తన కుమారుడు తేజస్వీని ముఖ్యమంత్రిగా చేయాలని, సోనియాజీ కూడా తన కుమారుడు రాహుల్‌ను ప్రధానమంత్రిగా చేయాలని కోరుకుంటున్నారన్నారు. లాలూ ప్రసాద్ పశుగ్రాసం, బిటుమెన్, భూమి ఉద్యోగాల కుంభకోణాలలో ఇరుక్కున్నారని ఆరోపిస్తూ మహాఘట్‌బంధన్‌ను 'దొంగ బంధన్'గా అభివర్ణించారు. కాంగ్రెస్ రూ. 12 లక్షల కోట్ల విలువైన అవినీతి కేసుల్లో చిక్కుకుందని ఆరోపించారు. బెగుసరాయ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో షా ప్రసంగిస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటరు అధికార్ యాత్రను ప్రస్తావిస్తూ, రాహుల్ కొన్ని నెలల క్రితం బిహార్‌కు వచ్చి చొరబాటుదారులను రక్షించు యాత్రను ప్రారంభించారన్నారు. సమస్తిపూర్‌లో జరిగిన మరో ర్యాలీలో షా మాట్లాడుతూ, బిహార్ ఎన్నికలు రాష్ట్రంలో ఆటవిక రాజ్యం తిరిగి రాకుండా నిరోధించే ఎన్నికలని, రాష్ట్రంలోని ఎన్‌డిఎ 'పంచ్ పాండవ్' లాంటి ఐదు పార్టీల బలమైన కూటమి అని అన్నారు.

**బిహార్‌కు 'గూండా రాజ్' అవసరం లేదు : రాజ్‌నాథ్**

243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల మెజారిటీ రావడం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజున (నవంబర్ 14న) ఆయనకు తగిన నివాళి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం అన్నారు. బిహార్‌కు 'గూండా రాజ్' అవసరం లేదని రాష్ట్రంలో ఆర్‌జెడి పాలనను ప్రస్తావిస్తూ ఆయన పేర్కొన్నారు. బిహార్ సిఎం నితీష్ కుమార్ ఆర్‌జెడి 'జంగల్ రాజ్' వల్ల కలిగే నష్టాన్ని తొలగించడంలో చాలావరకు విజయం సాధించారని రాజ్‌నాథ్ సింగ్ పాట్నా జిల్లాలోని బార్హ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో అన్నారు. ఎన్నికల కమిషన్‌పై దాడి చేసినందుకు కాంగ్రెస్, ఆర్‌జెడిలనును ఆయన తీవ్రంగా విమర్శించారు. 'రాజ్యాంగ సంస్థలను కించపరిస్తే ప్రజాస్వామ్యం ఎలా నడుస్తుంది' అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.


**FORMAT C-2**

*(for political party to publish in website, newspapers, TV)*

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of State/ UT : TELANGANA STATE**

**Name of the Constituency: 61-JUBILEE HILLS**

**Name of the candidate : NAVEEN YADAV. V**

**4 (A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No .and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**5 (B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

T.KUMAR RAO
Vice President
Authorized Signatory

ప్రజాపక్షం
గురువారం, 30 అక్టోబరు

# క్యూబాపై అగ్రరాజ్య దుష్ప్రచారం

తన పెత్తనాన్ని ధిక్కరించే దేశాలను అమెరికా కక్షకట్టి వేధిస్తుంది. వాటికి వ్యతిరేకంగా ఎన్ని అబద్ధాలనైనా అవలీలగా ఆడేస్తుంది. క్యూబాపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితిలో ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చే నిదర్శనం. క్యూబాపై బురద చల్లేందుకు తన దుష్ప్రచార అస్త్రాన్ని అమెరికా మరోసారి ప్రయోగించింది. తన ఆంక్షల నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేసింది. ప్రపంచ దేశాలను తప్పుతోవ పట్టించే వాదనల సంగ్రహాన్ని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ నిస్సిగ్గుగా వినిపించారు. అసలు ఆర్థిక నిర్బంధనం విధించ లేదని నమ్మబలికారు. అదే నిజమైతే, హెల్మ్స్‌బర్టన్ చట్టం, టోరిసెల్లి చట్టం ప్రకారం వివిధ రంగాల్లో క్యూబాపై విధించిన ఆంక్షల మాటేమిటో? క్యూబా ఆర్థిక వ్యవస్థ గొంతు నొక్కడం ద్వారా, సామాజిక అశాంతిని రెచ్చగొట్టడానికి చేస్తున్న ప్రయత్నం నిజంకాదా? ఇంధనం, ఆర్థిక, పర్యాటకం, వైద్యం తదితర రంగాలను నిర్వీర్యం చేయడమే అమెరికా లక్ష్యంగా ఎంచుకుంది. కుట్ర చేస్తున్నది. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదికలపై క్యూబాకు అనుకూలంగా ఓట్లు రాకుండా దౌత్యపరమైన ఒత్తిళ్లు పెంచుతున్నది. క్యూబాలో ఆహారం, మందుల కొరతకు అక్కడి ప్రభుత్వ విధానాలే కారణమని మరో నిరాధార ఆరోపణకు మైక్ తెగబడ్డారు. ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక ఔషధ జాబితాలో 69 శాతం అడ్డంకులను అమెరికా ఆర్థిక ముట్టడి కారణంగా ఎదుర్కొంటున్నది. కొన్ని కీలక ఔషధాలు, వైద్య పరికరాలపై ఉన్న ఆంక్షల చట్రం నుంచి బయటపడేందుకు క్యూబా చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ప్రస్తావించనే లేదు. తప్పంతా క్యూబా ప్రభుత్వంపై నెట్టి, తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకుంది.

ఆహారం విషయంలోనూ ఇదే పరిస్థితి. అమెరికా ఆంక్షల కారణంగా దాదాపు 337,000 టన్నుల మొక్కజొన్న, 120,300టన్నుల సోయాబీన్స్ దిగుమతులు నిలిచిపోయాయి. గతంలో చేసుకున్న కొనుగోళ్ల ఒప్పందాలను సైతం అగ్రరాజ్యం విస్మరించింది. అక్కడితో ఆగకుండా, క్యూబాకు సాయం అందించకుండా ఇతర దేశాలను వివిధ రూపాల్లో నిరోధిస్తున్నది. ఇంకా అమల్లో ఉన్న '180 రోజుల నియమం'తో షిప్పింగ్ కంపెనీలు క్యూబన్ ఓడరేవులకు రావడం లేదు. ఎగుమతి, దిగుమతులకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. ఈ అంశాన్ని పక్కకుపెట్టి, ప్రస్తుత పరిస్థితులకు క్యూబాయే కారణమంటూ అమెరికా తప్పుడు సంకేతాలు ఇచ్చింది. బయోమెడిసిన్, మైనింగ్, పర్యాటకం, పెట్టుబడి లైసెన్సుల సడలింపు, బ్యాంకింగ్ రంగాలకు అధికారులు అనుమతులు ఇవ్వడం వంటివి అమెరికా ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. కానీ, మైక్ తన సుదీర్ఘ ఉపన్యాసంలో నెపాన్ని క్యూబాపైకి నెట్టారు. యథేచ్ఛగా అబద్ధాలు ప్రచారం చేశారు.

క్యూబాతో లావాదేవీలు జరపకుండా బ్యాంకులను, సరఫరాదారులను బెదిరించే స్థాయికి అమెరికా దిగజారింది. 'స్వేచ్ఛా వాణిజ్యం' పేరుతో క్యూబా ప్రభుత్వంతో సంబంధం లేకుండా, అక్కడి వ్యక్తులు, సంస్థలతో ఒప్పందాలకు ప్రయత్నించడం అమెరికా పతనానికి పరాకాష్ట. ఒకవైపు ఆంక్షలను విధించి, ఆర్థికంగా దెబ్బతీయడమేగా, క్యూబాతో వ్యాపార సంబంధాలు పెట్టుకోకుండా ఇతర దేశాలను వివిధ రీతుల్లో బెదిరించడం దుర్మార్గం. క్యూబా ప్రభుత్వం దేశంలో ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్నది. అక్కడి నుంచే ఎంతోమంది వైద్యులు, వైద్య సిబ్బంది వివిధ దేశాల్లో సేవలు అందిస్తున్నారు. అక్కడ ప్రభుత్వం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉంది.

రాజకీయ అస్థిరతకు తావులేదు. క్యూబాను పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్చడానికి, ప్రైవేటు చేతుల్లోకి తీసుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దీనిని అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. అందుకే కుయుక్తులతో, తప్పుడు సమాచారంతో, అబద్ధపు ప్రచారాలతో, అభూత కల్పనలతో దాడులు చేస్తున్నది. దిగ్బంధనాలతో ఆర్థిక ఒత్తిళ్లు పెంచుతున్నది. దీనిని వ్యతిరేకిస్తున్న ప్రపంచ దేశాల ముందు నిర్దోషిత్వాన్ని ప్రదర్శించుకోవడానికి ఏ స్థాయికైనా పతనమవుతున్నది. తన ప్రభావానికి లొంగని రష్యా, చైనా వంటి దేశాలపై అమెరికా ఆంక్షలు.. ఆర్థిక దిగ్బంధనాలు, కుయుక్తులు బహిరంగ రహస్యాలు. కరేబియన్ ప్రాంతాన్ని క్యూబా అస్థిరపరుస్తున్నదని, ఉక్రేన్‌పై యుద్ధంలో రష్యాకు మద్దతునిస్తున్నదని చేస్తున్న ఆరోపణలు సత్య దూరం. అమెరికా ఆధిపత్య ధోరణి జగద్విదితం. ఐక్యరాజ్య సమితి వేదికగా క్యూబాపై చేసిన ఆరోపణల్లో ఏదీ నిజం లేదు. అక్కడ అమెరికా దుష్ట రాజకీయం మరోసారి బయటపడింది. అంతే.

# పాశ్చాత్య దేశాల గందరగోళం : సర్కోజీ జైలు శిక్ష

## పారిస్ నుంచి వాషింగ్టన్ వరకూ సవాళ్ళు ఎదుర్కొంటున్న మితవాద ప్రభుత్వాలు

టి.ఎస్.అశోక్

ఫ్రాన్స్ దేశాధ్యక్షుడిగా పనిచేసి, జైలుకు పంపబడిన మొదటి వ్యక్తిగా ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ వార్తల్లో నిలిచారు. లిబియా ప్రచార నిధి కుంభకోణం ఆరోపణలపై ఐదు సంవత్సరాల శిక్ష పడిన ఆయన అవమానకర రీతిలో గతవారం జైలుకు వెళ్ళాల్సి వచ్చింది. తనకు వ్యతిరేకంగా 'నో కింగ్స్' నిరసనలో 70 లక్షల మంది ప్రజలు, డజనుకుపైగా నగరాల్లో వీధుల్లోకి రావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఒత్తిడికి లోనవుతుండడం, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు, మితవాది బొల్సొనారో కుట్రకు ప్రయత్నించారని నిరూపితమవడం, చరిత్రలో మొదటిసారిగా ప్రధానమంత్రిగా ఒక మహిళ ఎన్నికవడంతో జపాన్‌లో కలకలం రేగడం వంటి పరిణామాలతో భౌగోళిక రాజకీయాలు గందరగోళంగా మారుతున్నాయి.

దౌత్యపరమైన ప్రయోజనం చేకూర్చినందుకు బదులుగా 2007 అధ్యక్ష ఎన్నిక ప్రచారం కోసం లిబియా నుంచి సర్కోజీకి నిధులు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఈ కేసులోనే ఆయనకు శిక్ష పడింది. మరణించిన లిబియా నియంత్ర మోమేర్ ఖడ్డాఫి హయాంలో సర్కోజీ అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నడిపినట్లు బలమైన ఆధారాలు కోర్టుకు లభించాయి. ఇది విదేశీ ప్రభావానికి లోనవడమనే ఫ్రెంచ్ ఎన్నికల చట్టాల కిందకు వస్తుంది.

ఇది నిజమైన అవినీతే తప్ప రాజకీయ వేధింపులు కాదు. సర్కోజీ అప్పీళ్ళు చేసుకునే అవకాశాలన్నీ పూర్తిగా అయిపోయే వరకు మూడు వేర్వేరు న్యాయస్థానాలు సాక్ష్యాలను సమీక్షించాయి. బలమైన చట్టబద్ధ ఆధారాల కారణంగానే దోషిగా నిరూపితమైంది. అయినప్పటికీ తాను బాధితుడిననే ముసుగులో సర్కోజీ ధిక్కారాన్ని ప్రకటిస్తున్నారు. 70వ ఏట మూడవసారి నేరంలో దోషిగా నిరూపించబడడంతో, ఆయన క్రియాశీల రాజకీయ జీవితం ముగిసినట్లుగానే కనపబడుతోంది.

సర్కోజీ శిక్ష ఫ్రాన్స్‌ను గందరగోళ రాజకీయ జలాల్లో నడిపిస్తోంది. 2022లో ఆయన సంకీర్ణ ప్రభుత్వం చట్టపరమైన మెజారిటీని కోల్పోయినా, పార్లమెంటరీ మెజారిటీ లేకుండానే అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మ్యాక్రాన్ పలనను కొనసాగిస్తున్నారు. వివిధ రాజకీయ వర్గాలతో నిరంతరం చర్చలు జరపాల్సిన స్థితి ఏర్పడింది. పెన్షన్‌లు, వలసలపై కీలక చట్టాలు, ఆర్థిక సంస్కరణల ప్రతిష్టంభనతో పరిపాలన స్తంభించిపోయింది.

సాంప్రదాయ మధ్య, మితవాద రిపబ్లికన్‌లైన సర్కోజీ పార్టీ మధ్యేవాదులతో జతకట్టడం లేదా మెరైన్ లీ పెన్ కి చెందిన నేషనల్ ర్యాలీకి వ్యతిరేకంగా పోటీ చేయడమనే మీమాంసలో చిక్కుకొని మద్దతును కోల్పోతుంది. ఆర్థిక స్థానాలను నియంత్రిస్తూ, వలసలు జాతీయ అస్థిత్వంపై కఠిన వైఖరిని కొనసాగిస్తూ లీ పెన్ అత్యంత సంప్రదాయవాదవాదుల మద్దతును విజయవంతంగా సాధించింది.

జీన్–లూక్ మెలెన్‌కాన్ అతివాద వామపక్ష ఫ్రాన్స్ అన్‌బోవ్డ్, ఇబ్బందులు పడుతున్న సోషలిస్టులు, గ్రీన్స్, కమ్యూనిస్టుల మధ్య వామపక్షాలు విడిపోయి ఉన్నాయి. వారు సర్కోజీ దోషిగా నిరూపితమవడాన్ని మితవాద అవినీతికి రుజువును ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. కానీ, పరిస్థితిని పూర్తిగా అనుకూలంగా మార్చుకునేందుకు వారి మధ్య ఐక్యత లేదు. పాలకుల వాగ్దానాలతో ఓటర్లు అలిసిపోవడంతో మధ్యేవాదులు క్షీణిస్తున్నారు.

మితవాదులు, ముఖ్యంగా లీ పెన్ నేషనల్ ర్యాలీ, దీని నుండి ఎక్కువగా ప్రయోజనం పొందుతుంది. పాత నాయకులు అక్షరాలా జైలుకు వెళుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకతకు తమను తాముగా ప్రత్యామ్నాయాలుగా ఆ పార్టీ నేతలు నిలుపుకుంటున్నారు. సర్కోజీ జైలు శిక్ష మాక్రాన్‌కు భిన్నమైన చిక్కులను సృష్టిస్తుంది. ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని చాటుతుంది కోర్టులు మాజీ అధ్యక్షులను కూడా జవాబుదారీగా ఉంచడం, ప్రజాస్వామ్య బలం.









ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య ఒత్తిడి పరీక్షకు గురవుతున్న నేపథ్యంలో ఫ్రాన్స్ నాటకీయత ఆవిష్కృతమైంది. 2022 తిరిగి ఎన్నికలో ఓడిపోయిన తర్వాత పదవిలో ఉండటానికి తిరుగుబాటుకు ప్రయత్నించినందుకు బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో దోషిగా నిర్ధారించబడ్డాడు. అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా చేతిలో తన ఎన్నికల ఓటమిని తిప్పికొట్టడానికి కుట్ర పన్నినందుకు 27 సంవత్సరాల 3 జైలు శిక్ష విధించబడింది.

లూలా, ఉపాధ్యక్షుడు గెరాల్డో ఆల్క్‌మిన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రే డి మోరేస్‌లను పేలుడు పదార్థాలు, ఆయుధాలు లేదా విషం ద్వారా హత్య చేయడం వంటి ప్రణాళికల గురించి బోల్సోనారోకు 'పూర్తి అవగాహన' ఉందని ప్రాసిక్యూటర్లు నిరూపించారు. డోనాల్డ్ ట్రంప్ తన మిత్రుడిని గట్టిగా సమర్థించారు. విచారణ పేరుతో ఉద్దేశ్యపూర్వకంగా వెంటాడారని అన్నారు. దీనికి అనుగుణంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పందిస్తారని పేర్కొంటూ, బ్రెజిలియన్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించారు. ట్రంప్ జోక్యంతో బోల్సోనారో విచారణను భౌగోళిక రాజకీయ ఒత్తిడి ప్రచారంగా మారుస్తుంది. అమెరికన్ ఆర్థిక శక్తికి వ్యతిరేకంగా బ్రెజిల్ న్యాయ స్వతంత్రతను పరీక్షిస్తుంది.సర్కోజీ చట్టపరమైన ఓటమిని నిశ్శబ్దంగా అంగీకరించడానికి భిన్నంగా, బోల్సోనారో కేసు అంతర్జాతీయ ఒత్తిడి, దేశీయ రాజకీయ కుయుక్తి ద్వారా పోరాడుతున్నారు.

ఖైదు చేయబడిన ఈ ఇద్దరు మాజీ అధ్యక్షుల మధ్య వ్యత్యాసం జవాబుదారీతనం పట్ల భిన్నమైన ప్రజాస్వామ్య ప్రతిస్పందనలను వెల్లడిస్తుంది. ఫ్రాన్స్ ప్రాసిక్యూషన్ అంతర్జాతీయ జోక్యం లేకుండా కొనసాగింది, బ్రెజిల్ అమెరికన్ ఆర్థిక ప్రతీకారాన్ని ఎదుర్కొంది.

జపాన్ పార్లమెంటు అతివాద సంప్రదాయవాది సనే తకైచిని తమ దేశ తొలిమహిళా ప్రధాన మంత్రిగా ఎన్నుకుంది. ఆమె తన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ, మితవాద జపాన్ ఇన్నోవేషన్ పార్టీతో సంకీర్ణ ఒప్పందంతో ఇది సాధ్యమైంది.

జులైలో జరిగిన ఎన్నికలలో ఎల్‌డిపి ఘోరంగా ఓటమి పాలైన తర్వాత మూడు నెలల రాజకీయ శూన్యతను ముగించి, షిగెరు ఇషిబా స్థానంలో తకైచి ఎన్నికయ్యారు. ఆమె స్వల్ప విజయం, చివరి నిమిషంలో సంకీర్ణ చర్చలు అవసరం అనేది జపాన్ రాజకీయ విచ్ఛిన్నతను ప్రతిబింబిస్తుంది. ఈ కూటమికి పార్లమెంటు ఉభయ సభలలో అవసరమైన మెజారిటీ లేదు. చట్టాన్ని ఆమోదించడానికి ఇతర ప్రతిపక్ష గ్రూపులను ఆశ్రయించాల్సి ఉంటుంది, ఇది ఆమె ప్రభుత్వాన్ని అస్థిరంగా, స్వల్పకాలిక కొనసాగేదిగా మార్చే ప్రమాదాలను సృష్టిస్తుంది.

హత్యకు గురైన మాజీ ప్రధాన మంత్రి షింజో అబే శిష్యురాలు తకైచి బలమైన సైనిక, ఆర్థిక వ్యవస్థ, అలాగే జపాన్ శాంతివాద రాజ్యాంగాన్ని సవరించడం వంటి ఆయన విధానాలను అనుకరిస్తుందని భావిస్తున్నారు. ఆమె ఎంపిక పరివర్తన కంటే కొనసాగింపునే సూచిస్తుంది. ఇది సంస్థాగత సంస్కరణ కంటే రాజకీయ సంక్షోభానికి సాంప్రదాయిక సమాధానం.2020లో అబే పదవీవిరమణ చేసినప్పటి నుండి నలుగురు ప్రధానులు మారడం ద్వారా జపాన్ రాజకీయాలు ప్రపంచ ప్రభుత్వ అస్థిరత నమూనాలను ప్రతిబింబిస్తుంది.

ట్రంప్ అధికారానికి ఆచరణీయ మార్గాన్ని కొనసాగిస్తూనే పెరుగుతున్న చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. రాజకీయ విభజనతో జవాబుదారీతనాన్ని సమన్వయం చేసుకోవడానికి అమెరికన్ ప్రజాస్వామ్యం ఎలా కష్టపడుతుందో ఇది వెల్లడిస్తుంది. బ్రెజిల్ న్యాయ ప్రక్రియలో ట్రంప్ జోక్యం ప్రజాస్వామ్య జవాబుదారీతనం ఏ విధంగా భౌగోళిక రాజకీయాకరణ చెందుతుందో తెలియజేస్తుంది. శక్తివంతమైన దేశాలు చట్టపరమైన చర్యలను విదేశాంగ విధాన సాధనాలుగా ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి.

2020 అమెరికా ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ను విజయవంతంగా తప్పించుకున్న తర్వాత ట్రంప్ ఇప్పటికే వైట్ హౌస్‌కు తిరిగి వచ్చారు. ప్రధాన అమెరికన్ నగరాలు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలను చూస్తున్నాయి. ప్రజాస్వామ్య నిబంధనలు, సంస్థాగత చట్టబద్ధత, జాతీయ దిశపై లోతైన సామాజిక విభజనలను ప్రతిబింబిస్తాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ నమూనాలను ప్రతిబింబిస్తాయి. ఇక్కడ పట్టణ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల నుండి రాజకీయంగా వేరుగా మారుతున్నాయి. ప్రజాస్వామ్య పాలన ను క్లిష్టతరం చేసే భౌగోళిక విభజనను సృష్టిస్తాయి.

వామపక్ష, మితవాద పక్షాలు రెండిటికీ ప్రజాదరణ అనే ప్రపంచ ధోరణి సంస్థాగత వైఫల్యాన్ని పోషిస్తుంది. ఓటర్లు తమను తాము రక్షించుకునే సంస్థలను విశ్వసించరు. ఇబ్బందులకు కలిగించేలా బయటి వ్యక్తులను ఆలింగనం చేసుకుంటారు. అయినప్పటికీ ఆ బయటి వ్యక్తులు తరచుగా తమను తాము అవినీతిపరులుగా నిరూపించుకుంటారు లేదా వాగ్దానం చేసిన మార్పును అందించలేకపోతున్నారు, భ్రమలు కలిగించే ప్రక్రియలను శాశ్వతం చేస్తారు. బ్రెజిల్, ఫ్రాన్స్, జపాన్, అమెరికా ప్రతి ఒక్కటి ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొంటున్నా యి. అవన్నీ రాజకీయ అస్థిరత , సంస్థాగత ఒత్తిడి నమూనాలను కలిగి ఉన్నాయి. పాతుకపోయిన పార్టీలు విచ్ఛిన్నమవతాయి లేదా కూలిపోతాయి. సంకీర్ణ ప్రభుత్వాలు పనిచేయడానికి కష్టపడతా యి. ఓటర్లు పాతుకుపోయిన వ్యక్తులకు, వ్యవస్థ వ్యతిరేక ప్రజాదరణ కలిగినవారి మధ్య ఊగిసలాడుతున్నారు. ఇద్దరూ సంతృప్తికరంగా లేరని భావిస్తున్నారు. ఆర్థిక ఆందోళన, సాంస్కృతిక ఉద్రిక్తతలు,సాంకేతిక అంతరాయం రాజకీయ అస్థిరతను మరింత పెంచుతాయి.ఖండాలలో పెరుగుతున్న అనిశ్చితి, ప్రజాస్వామ్య పాలన ఇరవై ఒకట వ శతాబ్దపు ఒత్తిళ్లను తట్టుకుంటుందా లేదా దాని వైరుధ్యాల కింద కూలిపోతుందా అని నిర్వచిస్తుందా అనేది వేచి చూడాలి.

(ఐపిఎ సర్వీస్)

# బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం).. సత్వర వైద్యమే కీలకం...

గుండెకే కాదు మెదడు కూడా పోటుకు గురవుతుంది. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలతో చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్ అనేది చాలా తీవ్రమైన అనారోగ్య సమస్యగా పరిణమించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి నలుగురిలో ఒక్కరు తమ జీవిత కాలంలో స్ట్రోక్ బారిన పడుతున్నారు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం ద్వారా స్ట్రోక్ను నివారించవచ్చు. అయితే, దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో.. అనేక మంది బ్రెయిన్ స్ట్రోక్కు గురై ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఒకప్పుడు 60–70 ఏళ్ల వయసులో ఈ సమస్య కనిపించేది.. బాధితుల్లో 30–45 ఏళ్ల మధ్య వయసున్న వారు 15 శాతం వరకు ఉంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను ఎలా గుర్తించాలి.. ఒకవేళ స్ట్రోక్ వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే కీలక వివరాలను రెనోవా సెంచరీ హాస్పిటల్స్, సీనియర్ కన్సల్టెంట్ & హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ న్యూరాలజీ, డా. వై.మురళీధర్ రెడ్డి గారి మాటల్లో...

**బ్రెయిన్ స్ట్రోక్ అంటే ఏమిటి?**

మస్తిష్క రక్తనాళాల్లో ఏర్పడే వైఫల్యం కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ సంభవిస్తుంది. రక్తం గడ్డకట్టడం ద్వారా రక్తనాళాలు పూర్తిగా లేదా పాక్షికంగా మూసుకుపోయి, మెదడుకు రక్త సరఫరా సక్రమంగా జరగకపోవడం స్ట్రోక్ కు కారణమవుతోంది. దీనివల్ల మెదడు కణాలు మరణించి, శాశ్వత వైకల్యం లేదా మరణం సంభవించవచ్చు.

**స్ట్రోక్‌కు ప్రధాన కారణాలు:**

* అధిక రక్తపోటు (హైపర్టెన్షన్)
* మధుమేహం (రక్తంలో అధిక చక్కెర స్థాయులు)
* పొగ తాగడం, మద్యం సేవించడం
* స్థూలకాయం, అనారోగ్యకరమైన జీవన విధానం

స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం
BE FAST:

B Balance (పట్టు): ఒక్కసారిగా మైకం రావడం లేదా పట్టు తప్పిపోవడం

E Eyes (కళ్లు) : అకస్మాత్తుగా చూపు పోవడం లేదా మసకబారడం

F Face (ముఖం): ముఖం ఒకవైపునకు జారిపోవడం

A Arm (చెయ్యి) : అవయవాలు బలహీనపడటం లేదా మొద్దుబారిపోవడం

S Speech (మాట): మాట్లాడేందుకు కష్టపడటం లేదా మాట అస్పష్టంగా ఉండటం

T Time (సమయం): తక్షణం ఆసుపత్రికి వెళ్లాలి తొలి 4,5 గంటలు చాలా కీలకం

**నిర్ధారణ:**

బ్రెయిన్ స్ట్రోక్‌ను నిర్ధారించడానికి, వైద్యులు మీ ఆరోగ్య చరిత్ర, శారీరక పరీక్షతో పాటు CT స్కాన్, MRI, రక్త పరీక్షలు, ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (EKG), కరోటిడ్ అల్ట్రాసౌండ్, మరియు సెరెబ్రల్ యాంజియోగ్రామ్ వంటి అనేక పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా CT స్కాన్ లేదా MRI స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలను ఉపయోగిస్తారు. ఈ పరీక్షలు మెదడులో రక్తస్రావం జరిగిందా లేదా మెదడు కణజాలానికి నష్టం జరిగిందా అని తెలుపుతాయి.

**రకాలు:**

రక్తనాళంలో అడ్డంకి ఏర్పడితే 'ఇస్కీమిక్ స్ట్రోక్', రక్తనాళం చిట్లిపోతే 'హెమరేజిక్ స్ట్రోక్'... ఇలా రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్ ఉంటాయి. అయితే రెండు స్ట్రోక్స్ లక్షణాలు ఒకేలా ఉంటా యి. కొన్ని సందర్భాల్లో హెమరేజిక్ స్ట్రోక్‌లో మూర్ఛలు కూడా రావచ్చు. తలనొప్పి, వాంతులు కూడా ఉండవచ్చు.

**ఎవరికి, ఎందుకు?**

రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్‌కు వయసుతో సంబంధం లేదు. అయితే 50ఏళ్లు పైబడిన వాళ్లలో మధుమేహం, అధిక రక్తపోటు సమస్యల ఉంటాయి కాబట్టి వాళ్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. అలాగే పెద్ద వయసులో రక్తనాళాల పటుత్వం తగ్గడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు తోడవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలుంటాయి. ఇక పిల్లల్లో సికిల్ సెల్ అనీమియా, పుట్టుకతో రక్తనాళాలు బలహీనంగా ఉండడం వల్ల, తలకు దెబ్బలు తగలడం వల్ల అరుదుగా కొందరు పిల్లలు కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతూ ఉంటారు. ఇటీవలి కాలంలో మద్యపానం, ధూమపానం, డ్రగ్స్, సెడెంటరీ లైఫ్ స్టైల్, వ్యక్తిగత, వృత్తిగత ఒత్తిడులు, ఒబేసిటీల కారణంగా, మధ్య వయస్కుల్లో (32–50) కూడా బ్రెయిన్ స్ట్రోక్స్ పెరుగుతున్నాయి.

**సమయమే కీలకం**

చికిత్స ఒక సెకను పాటు వృధా అయినా, మెదడులో 19 లక్షల న్యూరాన్లు డ్యామేజ్ అయిపోతూ ఉంటాయి. కాబట్టి సమస్యను ఎంత త్వరగా నిర్ధారించి, చికిత్స అందిస్తే, మరింత నష్టం జరగకుండా అక్కడితే నియంత్రించ గలుగుతాం. ఇస్కీమిక్ స్ట్రోక్ విషయంలో తక్షణ చికిత్స ఎంతో కీలకం. లక్షణాలు తలెత్తిన నాలుగున్నర గంటల్లోగా బ్రెయిన్ స్కాన్ చేసి, రక్తపు గడ్డను గుర్తిస్తే, థ్రాంబోలైటిక్ ఇంజెక్షన్ ఇచ్చి, అంతటితో నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చు. కొన్ని రక్తనాళాల్లో ఏర్పడే రక్తపు గడ్డలను థ్రోంబెక్టమీ చికిత్స ద్వారా ఆరు గంటల్లోపు తొలగించవచ్చు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో 24 గంటల్లోగా చికిత్స అందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. అయితే ఈ చికిత్సలన్నీ స్ట్రోక్ వల్ల మెదడుకు జరిగిన నష్టాన్ని నివారించడానికి కాకుండా, మరింత నష్టం జరగకుండా నిలువరించడానికి మాత్రమే పనికొస్తాయి. థ్రోంబెక్టమీ చికిత్సలో గుండెకు యాంజియోగ్రామ్ చేసిన విధానాన్నే అనుసరిస్తారు. ఇక హెమరేజిక్ స్ట్రోక్‌కు ప్రధానంగా అధిక రక్తపోటే కారణమవుతూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో సూక్ష్మ రక్తనాళాలు చిట్లిపోతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో మెదడులో వాపు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, రక్తపోటును అదుపు చేయవలసి ఉంటుంది. అయితే బ్రెయిన్ స్ట్రోక్ విషయంలో సమయం కీలకం.

**తదనంతర చికిత్స ఇలా...**

స్ట్రోక్ వచ్చిన కారణం మీద చికిత్స తదనంతర మందులు ఆధారపడి ఉంటాయి. ఫిజియోథెరపీతో పాటు, యాంటీ ప్లేట్లెట్లు, యాంటీ కాగ్యులెంట్లు, స్టాటిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి బ్రెయిన్ స్ట్రోక్ గురైన వాళ్లు మరొక స్ట్రోక్‌ను నివారించడం కోసం జీవితాంతం మందులు వాడక తప్పదు. అయితే మందుల మోతాదును వైద్యులు క్రమేపీ మారుస్తూ ఉంటారు. ఈ మందులతో పాటు మధుమేహం, అధిక రక్తపోటులను కూడా అదుపులో ఉంచుకోవాలి. గుండె సమస్యలను అదుపులో ఉంచుకోవడం, దురలవాట్లకు దూరంగా ఉండడం చేయాలి. పీచు, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.

సాధారణంగా మందులతో సమస్య సరిదిద్దుకోవచ్చు అనుకుంటారు. కానీ బ్రెయిన్ స్ట్రోక్ లో ఇది అసాధ్యం. బ్రెయిన్ స్ట్రోక్ మూలంగా పక్షవాతం, మాటల్లో తేడా, అవయవాల్లో బలహీనతలు మందులతో మెరుగుపడవు. మందులతో రెండోసారి స్ట్రోక్ రాకుండా మాత్రమే నియంత్రించవచ్చు. అప్పటికే తలెత్తిన లక్షణాలను మెరుగు పరుచుకోవడం కోసం, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను అనుసరించాలి.

**నివారణ:**

90% బ్రెయిన్ స్ట్రోక్‌లు నివారించదగినవే! క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహాలను పరీక్షించుకుంటూ, వాటిని మందులతో అదుపులో ఉంచుకోవడం, సమతులాహారం తీసుకోవడం, రోజుకు 30 నిమిషాల చొప్పున వారంలో ఐదు రోజుల పాటు వ్యాయామం చేయడం, మద్యపానం, ధూమపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించుకోవచ్చు.

# ఘనంగా ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

స్వాతంత్ర్యానికి పూర్వం రవి అస్తమించని సామ్రాజ్యవాద బ్రిటీష్ ప్రభుత్వ కాలంలో రహస్య జీవితాలు గడుపుతూ నాటి కార్మిక నాయకులు దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, బ్రిటీష్ సామ్రాజ్యవాది భారత దేశం వదిలి వెళ్ళాలని, పోరాడుతూనే, కార్మికులు అనేక కష్టాలకు, బాధలకు, ఆకలి, దరిద్రం, పేదరికానికి గురవుతూ పనిచేస్తున్న కార్మికులకు 30 సంవత్సరాల పోరాటాల తర్వాత, కార్మికులకు అండగా నిలబడేందుకు 31.10.1920న బొంబాయి నగర నడిసముద్రంలో రహస్యంగా పడవలో సమావేశమై ఎఐటియుసి పేరును నామకరణం చేసి నేటికి 106 సంవత్సరాలు అవుతున్నది. ప్రతి సంవత్సరం ఎఐటియుసి కార్మిక వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడుతూ, ఎఐటియుసి అవతరణ దినోత్సవాన్ని దీక్షదినంగా, పోరాటాలకు పదును పెడుతూ, దేశవ్యాపితంగా కోటాను కోట్ల కార్మికులు, యూనియన్ ఉన్న ప్రతిచోట యూనియన్ కార్యాలయాల వద్ద ఎఐటియుసి జెండావిష్కరణ కార్యక్రమాలు చేసేందుకు ఎర్ర తోరణాలు, ఎర్రరంగులతో దిమ్మెలకు రంగులు వేసి అందంగా అలంకరించి, దేశవ్యాపితంగా ఎఐటియుసి అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.మన తెలంగాణ రాష్ట్రంలో కూడా ఘనంగా జరుపుకుందాం.

1920లో ఎఐటియుసి ఏర్పడ్డ నాటి నుండి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యూనియన్‌లు పెట్టుకొనే హక్కు కావాలని, నాటి బ్రిటీష్ ప్రభుత్వం మెడలు వంచి ప్రమాద నష్టపరిహార చట్టం 1923, 1926లో ట్రేడ్ యూనియన్‌లు ఏర్పాటు చేసుకునే చట్టం, వేతనాల చెల్లింపు చట్టం 1936 సాధించుకుంది. ఆ తర్వాత స్వతంత్ర భారతదేశంలో పారిశ్రామిక వివాదాల చట్టం 1947, కనీస వేతనాల చట్టం 1948, ఫ్యాక్టరీల చట్టం 1948, ఇయస్ఐ చట్టం 1948 (కార్మికరాజ్య బీమా), ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) చట్టం 1952, ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961, బోనస్ చెల్లింపు చట్టం 1965, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ చేయాలన్న చట్టం 1970, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, బాలకార్మిక నిషేధ చట్టం 1986, దుకాణాల సంస్థల చట్టం 1988, ఉద్యోగుల పదవి విరమణ పెన్షన్ పథకం 1995, భవన నిర్మాణ మరియు ఇతర కార్మికుల సంక్షేమ చట్టం 1996, ఉపాధి హామీ చట్టం 2005 వీటితో పాటు 44 కార్మిక చట్టాలను ఎఐటియుసి అగ్రభాగాన నిలబడి పోరాటాలు, ఉద్యమాలు చేయడం ద్వారా సాధించుకో గలిగామని చెప్పటానికి ఏమాత్రం సంకోచం లేదు. పై చట్టాలన్నీ నేటికి అమలవుతున్నాయి. మోడీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు లాభాలు చేకూర్చేందుకు 29 చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు తేవడం జరిగింది.

దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు నిండినా, భారతదేశం ఆశించిన మేరకు అభివృద్ధి చెందలేదు. తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చినా కార్మికవర్గానికి ఒరిగిందేమీ లేదు. నేడు కూడా 13వేల కోట్ల మంది ఒక్కపూట తిండికి నోచుకోని, కనీసం భరోసలేని బ్రతుకులు గడుపుతు దరిద్ర భారతదేశంలో ప్రజలు, కార్మికులు ఇసురోమని జీవితాలు వెల్లదీస్తున్నారు. దేశంలో 9కోట్ల మంది విద్యావంతులు ఉద్యోగాలు లేక పొట్టచేత పట్టుకొని పట్టణాలలో బ్రతుకుదామని, బ్రతకలేక ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాలవుతున్నారు. నేడు దేశంలో 47 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు పనిచేస్తున్న వారికి, ఎఐటియుసి పోరాడి సాధించిన కార్మిక చట్టాలు అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోగా గత 11 సంవత్సరాల క్రితం అధికారానికి వచ్చిన మోడీ ఎన్డీయే ప్రభుత్వం, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుంది. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు, మోడీ స్నేహితులకు లాభం చేకూర్చేందుకు 4 కోడ్‌లు తెచ్చి 47 కోట్ల ప్రజల కార్మిక, రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నది. దేశంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా 3 రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్న మోడీ ప్రభుత్వం తన విధానాలను ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని 27సార్లు ఈ దేశంలో 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా నిరసనలు, సమ్మెలు చేస్తున్నా, దున్నపోతుపై వర్షంపడ్డట్లుగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న విషయాన్ని ఎండగడుతున్నాం. కార్మికవర్గ పోరాటాలకే పెట్టుబడి దారి విధానాన్ని అంతంచేసి కార్మికరాజ్యం (సోషలిజం) తెచ్చే శక్తి యుక్తులు ఉన్నాయని చరిత్ర నిరూపించింది. మన ముందు అదే కర్తవ్యం ఉన్నది.

భారతదేశంలోని కార్మికవర్గానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల సభ్యులు, ఎఐటియుసి అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త నుండి నాయకుని వరకు శపథంబూని, ఎఐటియుసి బలోపేతానికి రాష్ట్రంలో పనిచేస్తున్న కార్మికవర్గానికి యూనియన్లు ఏర్పాటు చేసి, పోరాటాలు, ఉద్యమాలు, సమ్మెలు, నిరసనలు కొనసాగిస్తూనే కార్మికులకు రాజకీయ, సైద్ధాంతిక, వర్గ దృక్పథంతో చైతన్యవంతమైన పోరాటాలు, ఉద్యమాలు చేసేందుకు ఎఐటియుసి అవతరణ దినోత్సవం సందర్భంగా దీక్షబూనుదాం, ప్రతిజ్ఞ చేద్దాం. ఎఐటియుసి ఎర్రజెండాను మరింత ఎరుపెక్కిద్దాం.

పోరాటాల సంవత్సరం : కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ మరిన్ని పోరాటాలు, ఉద్యమాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చే ద్దాం, బిజెపి ఎన్డీయే కూటమిని బొందపెట్టేందుకు, బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటు, కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ యూనియన్‌లు, అసోసియేషన్‌లు, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తునందున కార్మికులను, ప్రజలను, సమస్త పీడిత, తాడిత వర్గాలకు అండగా ఉంటూ పోరాటాలు ఉద్యమాలు చేయాల్సిన ఆవశ్యకత అసన్నమైనది.

దేశ ఆర్థిక వ్యవస్థకు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, బీడీ కార్మికులు, తునికాకు ఉత్పత్తి దారులు, కాంట్రాక్ట్ కార్మికులు, హమాలీలు, బొగ్గగని కార్మికులు, ఇంటిపనివారలు, నిర్మాణ కార్మికులు, ప్లాంటేషన్, వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మిక ఉద్యోగులు, ఎల్ఐసి, పోస్టల్, విద్యుత్, టెలికాం ఇతర రంగాల కార్మికులు, మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా పోరాటాలు, ఉద్యమాలు చేసినప్పుడే కార్మికులకు ప్రయోజనం.

కావున ఎఐటియుసి అవతరణ దినం సందర్భంగా ఎఐటియుసి అనుబంధ సంఘాలు, ఎఐటియుసి దిమ్మెలకు రంగులు వేసి, ఎర్ర తోరణాలతో భారీగా అలంకరించి, ఎర్ర షర్టులు, ఎర్ర చీరలు ధరించి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి.

## ఆర్థిక భరోసాగా జన సురక్ష కార్యక్రమం

ఎల్డియం ఉత్పల్ కుమార్ దామ్

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషన్ రాజు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టి) గ్రామంలో మావల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్డియం) ఉత్పల్ కుమార్ దామ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు హాజరై మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ కోసం బ్యాంకులు నిరంతరం కృషి చేస్తాయని అన్నారు. అకౌంట్ కలిగి ఉండాలన్నారు. అకౌంట్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పృథ్వీరాజ్, అసిస్టెంట్ మేనేజర్ ఆదర్శ్, పంచాయతీ కార్యదర్శి రాఖీ, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, కారోబారి సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 31న ఆవిర్భావ దినోత్సవాలు

కార్యకర్తలకు ఎస్ విలాస్ పిలుపు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఈనెల 31న ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి ఎస్ విలాస్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి. గోవర్ధన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ విలాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టడం కోసం కార్యాచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ. చంద్రకళ, ఎస్‌కె.అఫ్రోజ్, కె.గంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె.ఉస్మాన్, కే.రమణ, వై.ఆశన్న, ఎం.కాంతారావు, కోశాధికారి టి. రామన్న, ఎండి ఖాసీం పాల్గొన్నారు.



## నిర్లక్ష్య వైద్యానికి సింగరేణి కార్మికుడి మృతి

**ప్రజాపక్షం/మందమర్రి :** కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సరైన వైద్యం అందక మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేసే సింగరేణి కార్మికుడు తాళ్ల రమేష్ ప్రాణాలు కోల్పోవడంపై ఎఐటియుసి నాయకులు శైలేంద్ర సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఫేస్ హాస్పిటల్‌కు రిఫర్ చేయబడిన రమేష్‌కు చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు. జ్వరంతో బాధపడుతున్న రమేష్‌ను పరీక్షలు చేయకుండానే కాలయాపన చేసి, సీరియస్‌గా ఉన్నాడని, 9 లక్షల రూపాయల ఖర్చు అప్రూవల్ లేకుండా చికిత్స ప్రారంభించబోమని వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. కొత్తగూడెం సిఎంఒ అప్రూవల్ ఇచ్చిన తర్వాత కూడా సరైన చికిత్స చేయకపోవడంతోనే రమేష్ మరణించినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం వేల కోట్లు కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెచ్చిస్తున్నా, కార్మికుల ప్రాణాలు కాపాడే బాధ్యత మాత్రం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రమేష్ మరణం నిర్లక్ష్య వైద్యానికి బలైపోయిన దుర్ఘటన అని ఆయన అన్నారు. అలాగే, సింగరేణి హాస్పిటల్స్‌లో ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులను నియమించి, కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో వైద్యం అందించాలంటూ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శైలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, సిహెచ్‌పి. శర్మ, ములకలపల్లి వెంకటేశ్వర్లు, ఎగేటి రాజేశ్వరరావు, పొన్నం శ్రీనివాస్, అంతోని దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వే గడువు నవంబర్ 1వరకు పొడిగింపు

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందని, ఈ సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వేలో పాల్గొనడానికి గడువును నవంబర్ 1, 2025 వరకు పొడిగించారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో మీ ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. అక్టోబర్ 10న ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటికే ఉద్యోగులు, ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటరీని రూపొందిచండంలో ప్రతి రాష్ట్ర పౌరుడు భాగస్వామ్యమై సిటిజన్ సర్వేలో పాల్గొని తెలంగాణకు దిశను నిర్ణయించాలన్నారు. ఈ సర్వేలో పాల్గొనేందుకు http//www. telangana. gov.in/ telanganarising/ అనే లింక్ ద్వారా భాగస్వాములు కావాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు.



## రైతులు నష్టపోకుండా చూడాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** మొంథా తుఫాను నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తుఫాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. తుపాను ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ, అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న మూడు రోజుల పాటు అవసరమైతే వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట అధికారులు తదితరులు ఉన్నారు.

## పరిసరాల శుభ్రతకు శ్రమదానం

స్వచ్ఛత ఉన్న చోట ఆరోగ్యం : ఎం.విజయ భాస్కర్ రెడ్డి

**ప్రజాపక్షం/గోలేటి :** స్వచ్ఛత ఉన్న ప్రాంతవాసులంతా ఆరోగ్యంగా ఉంటారని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛత కోసం శ్రమదానం నిర్వహించారు. జిఎం ఎం.విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులు జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి గంటన్నర పాటు చెత్త గడ్డి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ స్వచ్ఛత కోసం సింగరేణి ఉద్యోగులు పడుతున్న శ్రమను సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్న తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఏరియా అధికారుల సంఘం కార్యదర్శి ఉజ్వల్ కుమార్ బెహరా, డిజిఎం (సివిల్) ఎస్.కె మదీనా బాషా, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, ఏరియా సెక్యూరిటి అధికారి శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్సనల్ డిపార్ట్ మెంట్ హెచ్ఒడి శ్రీనివాస్, సివిల్ ఇఇ రాజేంద్రప్రసాద్, ఏరియా ఐటి అధికారి ముజీబ్, అకౌంట్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని హావర్గా గ్రామంలో పిఎసిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కేంద్రంలో నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్‌ఫ్రీ నంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. టెంట్, తాగునీటి వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు, వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి, పంట రుసుము సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని సూచించారు. అన్నిరకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పంటకు మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని శుభ్రపరిచి, తగిన తేమ శాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, టోల్‌ఫ్రీ నంబర్ 9182958858ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డిసిఒ నర్సయ్య, జిల్లా పౌర సరఫరా అధికారి రాజేందర్, పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, తహసీల్దార్ భోజన్న, ఎంపిడిఒ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని, పనుల్లో నాణ్యతకు లోటు లేకుండా ఉండాలని ఆదేశించారు. అలాగే వరద వలస దెబ్బతిన్న పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి ప్రాజెక్ట్‌పై పనుల వేగం పెంచాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ దృష్ట్యా ఈ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఇంజనీరింగ్ శాఖల మధ్య సమన్వయం సాధించి అడ్డంకులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇఇ పంచాయతీరాజ్ అనిల్, డిఇపిఆర్ తుకారాం అధికారులు పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి ఎఐటియుసి

**ప్రజాపక్షం/రెబ్బెన :** బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్ స్థానిక సమస్యల పరిష్కారం యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డితో గుర్తింపు సంఘం ఎఐటియుసి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు అనేక సమస్యలను జిఎం దృష్టికి తీసుకువచ్చారు. గోలేటి హాస్పిటల్ లో పనిచేయని బ్లడ్ షుగర్ టెస్ట్ మెషిన్ ఎక్స్‌రే మెషిన్‌లను వెంటనే రిపేరు చేయించాలని, గోలేటి టౌన్ షిప్‌లోని కొన్ని లైన్లలో సరిగా రాని వాటర్ సరఫరాను సరిచేయాలని వారు కోరింది. మెడికల్ ట్రీట్మెంట్ కోసం ఎంప్లాయ్ ఫ్యామిలీ ఐడెంటిఫికేషన్ ఫొటోల అప్లోడింగ్ సమస్యను పరిష్కరించాలని, గోలేటి టౌన్ షిప్ సబ్ స్టేషన్ పైకప్పు రేకుల లీకేజీని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి ఏరియా వర్క్ షాప్ మెకానిక్ గ్యారేజీలో ఎయిర్ గన్ ఏర్పాటు చేయాలని, ఖైరగూడలోని బేస్ వర్క్‌షాప్ ఎం సెక్షన్ షెడ్ లీకేజీలను రిపేరు చేయాలని కోరారు. బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ గోలేటి డిస్పెన్సరీలో తక్కువగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని, మాదారం టౌన్‌షిప్ లాల్ బహదూర్ స్టేడియంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అధికారులు మచ్చగిరి నరేందర్, ఉమాకాంత్, భాష, రవిబాబు, మురళి, పర్సనల్ అధికారి శ్రీనివాస్, ఎఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్యా మొగిలి, జిఎం కమిటీ సభ్యులు జూపక రాజేష్, బి.జగ్గయ, ఎస్ ఆనంద్, మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు

ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ (పిఆర్‌సి) అమలు చేయాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రోజు నిర్మల్ ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన యూనియన్ సమావేశంలో మూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2023 జులై నెల నుంచి అమలు కావాల్సిన పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, ఐదు విడతల డిఎ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి మాట్లాడుతూ వైద్య శాఖలో గత 60సంవత్సరాలుగా గుర్తింపు పొందిన యూనియన్‌గా ఉద్యోగులకు ఎన్నో విజయాలు సాధించి పెట్టిందన్నారు. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీలు జరిపితే,రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి, వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందని ఆయనగుర్తు చేశారు. వైద్యశాల చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317జి.ఓ ద్వారా ఇప్పటికీ న్యాయం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని, మహిళా నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పురుషులకు కూడా చెల్లించాలని, టివివిపిలో అసిస్టెంట్ కమిషనర్(నర్సింగ్) పోస్ట్‌ను తక్షణం భర్తీ చేయాలని కోరారు. సీనియర్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ వనజ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన నర్సింగ్ డైరెక్టరేట్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ యూనియన్ నాయకులను అభినందించారు.

**నూతన కార్యవర్గ ఎన్నిక..**

యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.విజయలక్ష్మి, అధ్యక్షురాలుగా బి.శేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా అపర్ణ, ఉపాధ్యక్షులుగా జయలక్ష్మి, తిరుపతి,రజనీకాంత్, ప్రశాంత్ కుమార్, కార్యదర్శిగా సి.హెచ్. రాకేష్, బి.రాజ్‌కుమార్,అనీల్, కోశాధికారిగా వి.పుష్పలత ఎన్నికయ్యారు.

## రైతుల కోసం బాధ్యతాయుతంగా పిఎసిఎస్ కేంద్రాలు నిర్వహణ

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదు

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. బుధవారం బైంసా మార్కెట్ యార్డ్‌లో ప్రభుత్వ సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం జరిగిందని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా కుభీర్ మండలంలో మూడు కేంద్రాలు, ప్రతి మండలంలో రెండు చొప్పున కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం సోయాకు క్వింటాలుకు 5328 రూపాయల ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాలకు వరి కొనుగోలు కేంద్రాల బాధ్యత అప్పచెప్పడం జరిగిందన్నారు. పిఎసిఎస్ కేంద్రాలు రైతుల కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రైతుల కోసం పనిచేసే సంఘాలకు కమిషన్‌లు ముఖ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేనివిధంగా జొన్న, శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజాప్రతినిధులు నిరంతరం రైతుల శ్రేయస్సుకు పాటుపడాలని, లాభాల కోసమైతే స్వంత వ్యాపారం చేసుకోవాలని సూచించారు. జొన్న, శనగ కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆనంద్‌రావ్ పటేల్ పని తీరును ఎమ్మెల్యే అభినందించి, రైతుల పక్షాన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, తహసీల్దార్‌లు,పాక్స్ చైర్మన్‌లు, ఆత్మ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం తూప్రాన్ మండలంలోని రావెల్లి లో ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే బాలికల పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నూతన పిహెచ్‌సి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. నిర్మాణంలో ఉన్న సమీకృత కార్యాలయ సముదాయాన్ని పరిశీలన చేశారు. గురుకుల పాఠశాల కళాశాలలో వంటగదిని, వంట సామాగ్రిని, వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినిలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు చదువుకొని మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ పరిధిలో నూతన పిహెచ్సి భవన నిర్మాణాన్ని స్థల పరిశీలన చేశారు. ఎంత మేరకు స్థలం అవసర పడుతుందో, ఏ విధంగా భవన నిర్మాణం చేయాలో అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న సమీకృత కార్యాలయాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట స్థానిక ఆర్డిఓ జయచంద్ర రెడ్డి, తహసీల్దార్లు ఉన్నారు.

## సమర్థవంతంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** అమృత్ 2.0 పథకం క్రింద జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, ఇందు కొరకు అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిటిసిపి సంయుక్త సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, మంచిర్యాల డిటిసిపిఒ సంపత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, మందమర్రి మున్సిపల్ అధికారులకు మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. నగరం ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి, 20 సంవత్సరాల వరకు భవిష్యత్తు అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. డిజిటల్ మ్యాపింగ్ లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించవచ్చని, నూతన డేటాను ప్రతిబింబించేలా జి ఐ ఎస్ ఆధారిత ప్లాన్‌లను నవీకరించవచ్చని, తద్వారా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు పనుల వేగవంతం

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో ప్రభుత్వం చేపటిన ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుగుణంగా భూసేకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబందిత విభాగాల అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంగారెడ్డి జహీరాబాద్ డివిజన్లో పురోగమిస్తున్న టీజీఐఐసి జాతీయ రహదారి 65 విస్తరణ రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) ప్రాజెక్టులకు సంబందించిన భూ సేకరణ నిమ్జ్‌కు సంబందించిన భూమిని ప్రత్యేక ప్రయోజన సంస్థ కు అందించే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు అందించే పరిహారం జాప్యం లేకుండా అందించాలని సూచించారు. ఆర్‌ఆర్ ఆర్ ప్రాజెక్టు పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు మంజూరైన నగదు వెంటనే చెల్లించాలని నగదు విడుదలలో జాప్యం జరుగకుండా అధికారులు మందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వడానికి నిధులు కొరత ఏదీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిమ్జ్ సంబంధించిన భూసేకరణ అనంతరం సొంత హక్కులు బాధ్యతలు అధికారికంగా సంస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూమిని ప్రత్యేక సంస్థ అందించడం చేయాలని సూచించారు. టిజిఐఐసి నీమ్జ్ ప్రాజెక్టులకు ఇప్పటి వరకు భూములు ఇచ్చిన రైతులకు ప్యాకేజీల ప్రకారం పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని తెలిపారు. జాతీయ రహదారి 65 విస్తరణలో బాగంగా చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులు అడ్డంకులు లేకుండా కొనసాగేలా అవసరమైనచర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ టిజిఐఐసి నిమ్జ్ ఆర్ అండ్ బి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్థిక ప్రణాళిక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి సంగారెడ్డి, జహీరాబాద్ ఆర్డీఒలు టిజిఐఐసి నిమ్జ్ జాతీయ రహదారి ఆథారిటీ అధికారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి పేట్రేగిపోయిన దొంగలు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పెట్రేగిపోయి హల్‌చల్ చేశారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన గంగుల కిష్టారెడ్డి రిటైర్డ్ విఆర్ఒ, కిష్టారెడ్డి అనసూయ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం కాగా అందరికీ వివాహాలు జరిపించగా, ఇంట్లో వృద్ధ దంపతులు ఒంటరిగా ఉంటున్నారు. ఇది అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి కిష్టారెడ్డి వృద్ధ దంపతులు గాఢ నిద్రలో ఉండగా గ్రామంలోని విద్యుత్ వీధి దీపాలను నిలిపేసి నిచ్చెనవేసుకొని ఇంటి కమాన్ పొయ్యి నుంచి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు కిష్టారెడ్డి బెడ్ పరుపు కింద దాచిన రూ.50వేల నగదు, డబ్బాలో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారం దోచుకెళ్లారు.

**నిద్రలో ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు లాగబోయి..**

కిష్టారెడ్డి ఇంట్లో దొంగతానికి వచ్చిన దొంగలు రూ.50వేల డబ్బులు, మూడున్నర తులాల బంగారం దొంగలించి తిరిగి వెళ్తున్న క్రమంలో నిద్రలో ఉన్న కిష్టారెడ్డి భార్య అనసూయ మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగలు తెంపడానికి ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించడంతో అక్కడి నుంచి దొంగలు పరారయ్యారు. 100కాల్ ద్వారా ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై మధుకర్‌రెడ్డి పరిశీలించారు. పోలీసు క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. బాధితుడు కిష్టారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకొని కేసును చేధిస్తామని తెలిపారు.

## అనుమతిలేని ఇసుక లారీ పట్టివేత

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని గొల్లపల్లి శివారు ప్రాంతంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమతి లేని ఇసుక లారీ పట్టుబడినట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల వైపు నుండి ఇసుక లోడుతో వస్తున్న లారీని గుర్తించి, డ్రైవర్‌ను విచారించగా, లారీ ఓనర్ అస్లాం ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మండలం నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నామని, మార్గం వెంబడి ఓనర్ అస్లాం పైలెట్ గా వెళ్తూ, పోలీసుల రాకపోకలు గమనిస్తూ ఉంటారనీ తెలిపారు. వీరికి దూలం వెంకటేష్ అను అతడు సహకరిస్తారని తెలుపగా, వెంటనే లారీతో పాటు డ్రైవర్, ఓనర్, వెంకటేష్‌ను వారు ప్రయాణించిన మారుతి షిఫ్ట్ కారు, లారీ(టిఎస్ 07 యుజె 6757) ని స్టేషన్‌కు తరలించి, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## తుపాన్ ఎఫెక్ట్‌తో నేలకొరిగిన వరి పంటలు

**ప్రజాపక్షం/ముత్తారం:** తుఫాన్ ఎఫెక్ట్‌తో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా రెండు రోజుల నుండి ఎడతెరపు లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.ఇప్పటికే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలల్లో నీళ్లు నిలిచాయి.ప్రస్తుతం వరి పంట పొలాలు కోతదశకు చేరడంతో వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు దేవుడా ఈ తుఫాన్ గండం దాటించాలని రైతులు మొక్కుతున్నారు. ఇప్పటికే పొలాలు వర్షాల దాటికి వరి పోలాల నేలవాలిన, నీటి మునిగిన రైతులు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ అధికారులు రైతులకు తగు సూచనలు చేస్తున్నారు.



## వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** తుఫాన్ ప్రభావంతో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్‌లో మాట్లాడి చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాలకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఐకెపి కేంద్రాలు ప్రారంభమైన నేపధ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని, టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. రెవెన్యూ, విద్యుత్ సిబ్బందితో మాట్లాడి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

## పెద్దపల్లి జిల్లాలో 413.4 మిల్లీమీటర్ల వర్షం


**ప్రజాపక్షం/పెద్దపల్లి:** మోంతా తుఫాను కారణంగా బుధవారం రోజున పెద్దపల్లి జిల్లాలో జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయనీ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా బుధవారం 413.4 మిల్లీమీటర్ల వర్షం పడిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా జిల్లాలో వరి కోతలు ప్రారంభం కాలేదని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారి మాట్లాడుతూ రైతులకు చెందిన వ్యవసాయ మార్కెట్లో పత్తి, వడ్లు తడవకుండా టార్ ఫాలింగ్ లతో తగిన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వర్షాల కారణంగా ఐకెపి సెంటర్లు ఇంకా ప్రారంభించలేదని, వర్షాలు తగ్గిన తర్వాత ఐకెపి సెంటర్లు ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో వరి పంట నష్టాన్ని ఇంకా అంచనా వేయలేదని, గురువారం వరకు తుఫాను ఇలాగే కొనసాగితే వరి పంటకు జరిగిన నష్టాన్ని తెలుపుతామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన 'సుడా' చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. లెక్చరర్లు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించి విధ్యార్థినులకు భరోసా కల్పించారు. కళాశాలలో వసతులపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సాయంత్రం విధ్యార్థినులు ఇంటికి వెళ్లే సమయంలో మెయిన్ గేటు వద్ద ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని విధ్యార్థినులు సుడా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పోలీసు అధికారులకు సమాచారమిచ్చి సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పోలీసులు మెయిన్ గేటు వద్ద పర్యవేక్షణ చేసి విధ్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. డిఈవో గంగాధర్, ప్రిన్సిపాల్ నిర్మల, సూపరిండెంట్ కిరణ్‌కుమార్, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిహారం ఇవ్వాలని జాతీయ రహదారి అడ్డగింత



**ప్రజాపక్షం/ముత్తారం:** నేషనల్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాకే పనులు చేయాలంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు నేషనల్ హైవే రోడ్డు పనులను బుధవారం అడ్డుకున్నారు.రోడ్డు పనులను అడ్డుకున్న విషయాన్ని తెలుసుకున్న ముత్తారం తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ముత్తారం ఎస్సై రవికుమార్ తోపాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రాజబాబు, సరీన్ సాయితో పాటు మరి కొంత మంది అధికారులు రోడ్డు పనులను అడ్డుకున్న వారి వద్దకు వెళ్లిన తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి రైతులతో మాట్లాడగా సుమారు పదిమందికి చెందినఒక ఎకరం 20 గుంటల భూమితో పాటు బోరు బావులు నేషనల్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా కోల్పోవడం జరుగుతుందని తాము కోల్పోతున్న భూమికి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. కనీసం భూములు కోల్పోతున్న లిస్టులో తమ పేర్లు కూడా లేవన్నారు. తమ భూములకు పరిహారం అందాకే పనులు చేయనిస్తామని తాసిల్దార్‌కు చెప్పడంతో స్పందించిన తాసిల్దార్ మాట్లాడుతూ ఒక ఎకరం 20గుంటల భూమికి సంబంధించిన వివరాలు ఆర్డిఓ వద్ద నివేదికలు ఇవ్వడం జరిగిందని ఆర్డిఓ ద్వారా వచ్చిన నివేదికల ఆధారంగా పరిహారం అందిస్తామని తెలిపారు. భూముల కోల్పోతున్న రైతులందరికీ పరిహారం వస్తుందని అన్నారు. కానీ ఇలా రోడ్డు పనులను అడ్డుకోవడం సరికాదని రోడ్డు పనులకు రైతులు సహకరించాలని తాసిల్దారు సూచించారు.

## మెగా రక్తదాన శిబిరం: సిపి

**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ సిపి గౌష్ ఆలం తెలిపారు. ఈ సంధర్భంగా సిపి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణార్ధం నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. తలసేమియా బాధితులకు ఎంతో అవసరమన్నారు. సామాజిక బాధ్యతతో అందరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 160 యూనిట్లను సేకరించామని, ఈ రక్తాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు, ఏసిపిలు వెంకటస్వామి, వీరారెడ్డి, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### రొంపికుంట పంచాయతీ కార్యదర్శి విధుల నుంచి తొలగింపు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సంబంధించి ఎటువంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. బుధవారం కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామం జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. వారధి సొసైటీ ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న ఎం.తిరుపతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన కలెక్టర్, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంటనే సంబంధి త ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సేవలను టర్మినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఎ టువంటి అక్రమాలకు పాల్పడినా అత్యంత కఠిన చ ర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

**గ్రామాలను పరిశుభ్రంగా తయారు చేయాలి**

గ్రామాలను పరిశుభ్రంగా తయారు చే యాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ శాఖ ప నితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ నిర్మాణా ల చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని, నవంబర్ 3నుంచి నవంబర్ 11 వరకు పెద్దపల్లి జిల్లాలోని ప్రతి గ్రామంలోప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, గ్రామాలలో ప్లాస్టిక్ ఎక్కడ ఉండడానికి వీలు లేదని, చిన్న కవర్ కూడా ఉండవద్దని, ఆరితీలో పారిశుధ్య పనులు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఎవరు బయట చెత్త వేయడానికి వీలులేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపిఓలు, అధికారులు, పాల్గోన్నారు.

## తడిసిన ధాన్యం.. ఆందోళనలో అన్నదాత



**ప్రజాపక్షం/గంగాధర:** అన్నదాతపై ప్రకృతి పగబట్టింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలైంది. చేతికి వచ్చిన పంట అకాల వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం వానకు వరిపంట పడిపోగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు నానా తంటాలు పడ్డారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రైతుల ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దాన్యం కుప్పలు తడిసిపోవడంతో పంటను కాపాడుకోవడానికి ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు వంటి వాటిని ఉపయోగించి వర్షం నుంచి కాపాడుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుంది. కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసిన ధాన్యం వర్షానికి తడిసిముద్దయిపోయింది. తడిసిన ధాన్యంతో పాటు తేమశాతం చూడకుండానే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** తుఫాన్ నేపధ్యంలో జిల్లాలో 2 రోజుల పాటు భారీ నుంచి అతిభారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29.30 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు ఎవరు చేపలు పట్టడానికి వెళ్లవద్దని సూచించారు. కల్వర్టులు దాటవద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

## కేంద్ర నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లించవద్దు

### మంత్రి బండి సంజయ్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్:** పార్టీలకతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తీసుకువచ్చామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కో ఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. 851 కోట్ల రూపాయల ఎంపి నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో హుజురాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విధ్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని, మరో 5వేల సైకిళ్లు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు. పీఎంశ్రీ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్‌వోబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు రోజువారీ నివేదికుల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్య,వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులున్నారు.

## బిఆర్‌ఎస్‌వి కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

### పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** పెండింగ్‌లోని ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్త పరిస్థితిలకు దారితీసింది. భారీగా విధ్యార్థులతో తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులకు విధ్యార్థి నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు బలవంతంగా బిఆర్‌ఎస్‌వి నాయకులు, విధ్యార్థి నాయకులను అరెస్టు చేసి పిటిసికి తరలించారు. ఈ సంధర్భంగా జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక తుగ్లక్ పాలన నడుస్తుందన్నారు. విద్యాశాఖను సీఎం తన దగ్గరనే పెట్టుకుని ఎలాంటి సమీక్షలు లేకుండా ఎవరు ఏది ప్రశ్నించినా స్పందించకుండా నియంతపాలన కొనసాగిస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణలోని విధ్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరి నశించాలన్నారు. కరీంనగర్‌లో ఎక్కడా లేని విధంగా పోలీసులు విధ్యార్థులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారని వాపోయారు. కళాశాలల యాజమాన్యాలను బెదిరించారని, కానీ నిర్బంధాలన్నింటినీ తెంచుకుని ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. పోలీసుల లాఠీలు, తూటాలు విధ్యార్థి ఉద్యమాలకు అడ్డుకాలేవని నిరూపించారన్నారు. కార్యక్రమంలో మధు, అజయ్‌కుమార్ గౌడ్ , శ్రీనివాస్, మోహన్స్, చైతన్య, ఆరె రవి గౌడ్,గంగాధర చందు, వసంత్, పరశురామ్, రవి తేజ, మున్నా, వేణు యాదవ్, ధీరజ్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, రాజు, శ్రీరామ్, సుమంత్, ఓంకార్, తదితరులున్నారు.

## ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆద్వర్యంలో బిక్షాటన




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. ఫలితంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్ చేయడంతో విధ్యార్థుల చదువులకు తరచూ ఆటంకాలు కలుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఏఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆద్వర్యంలో నగరంలో బిక్షాటన చేశారు. ఈ సంధర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిదర్శనమన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, విధ్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నార్నారు. సీఎం ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారన్నారు. డిగ్రీతో పాటు ఇంజనీరింగ్ కళాశాలలు సైతం నవంబర్ 3 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలల నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయన్నారు. తరగతులు ప్రారంభమైన నేపధ్యంలో కళాశాలల బంద్ ప్రభావం విధ్యార్థులపై తీవ్రంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, రాహుల్, ఏనోస్, మచ్చ అభిలాష్, రాజేష్, ఆకాష్ తదితరులున్నారు.

## విద్యారంగానికి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న విద్యారంగనికి ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని ఏఐఎస్‌ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో ప్రజలకు విద్యార్థుల సమస్యలను తెలుపుతూ వర్షంలో దోసెడు పట్టి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడారు. 8000 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్ పెండింగ్లో ఉండడంవల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే వాటిని విడుదల చేయాలని అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి విద్యార్థులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. విద్యార్థుల బలిదానాల మీద ఏర్పడిన రాష్ట్రం మళ్ళీ అదే దిశగా విద్యార్థుల బలిదానాలు కోరుకుంది పూర్తిగా విద్య వ్యవస్థ భ్రష్టు పట్టించిందనీ అన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకునే అధికార ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు మరిచిపోయారా అన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఏఐఎస్ఎఫ్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేటు దసరాలోగా 600 కోట్లు రిలీజ్ చేస్తామని, దీపావళి తర్వాత 600 కోట్లు రిలీజ్ చేస్తామని మాయమాటలు చెప్పి మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రివర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పాతవి, కొత్తవి అనకుండా మొత్తం వెంటనే విడుదల చేయాలన్నారు. సర్కార్ ఫీజులు చెల్లింపులు చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థులకు న్యాయం చెయ్యాలి లేనియడల భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాలు ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య నాయకులు శశి కుమార్, బట్టి హరికృష్ణ, రాహుల్, సంపత్, శ్రీకాంత్, సన్నీ పాల్గొన్నారు.

## వాహనదారులకు బిగ్ అలెర్ట్.. ఇకపై సిసి కెమెరాల ఆటోమేటిక్ క్లిక్

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ కెమెరాలను కే.ఎస్.పి శేషాద్రిని రెడ్డితో కలిసి ప్రారంభించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేములవాడ పట్టణ పరిధిలోని కోరుట్ల బస్టాండ్, సాయిరక్ష చౌరస్తా, ఒల్డ్ బిడ్జి, తిప్పపూర్ బస్టాండ్ కరీంనగర్ నుండి వచ్చే దారి, సిరిసిల్ల నుండి వచ్చే దారిలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎ ఎన్ పి ఆర్ ) సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కెమెరాల ద్వారా పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాల, ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాల నంబర్ ప్లేట్స్ ఆటోమేటిక్‌గా స్కాన్ చేసి సంబంధిత వాహనాల యజమానులకు ఈ చాలాన్ జారీ చేయబడుతాయన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలను నియంత్రించడం, చోరీ వాహనాలను గుర్తించడం, నేర పరిశోధనలో వేగం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ఆటోమేటిక్ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వేములవాడ పట్టణానికి చెందిన ఐ ఎంఎ వారిని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు పట్టణ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు రామ్మోహన్, వెంకట్రాజం, ఎల్లగౌడ్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## ధరూర్‌లో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలోని ఈ నెల 13 వ తేదీన ధరూర్ గ్రామంలో తెల్లవారుజామున ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలో గల బంగారు, వెండి నగదును దొంగిలించినారని అని ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేసి జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ ఎస్సై ఎన్.సధాకర్, మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్, బీర్పూర్ ఎస్సై రాజు వారి సిబ్బంది సాంకేతిక పరిజ్ఞాన నిపుణులైన మల్లేష్, మహేష్, రాజశేఖర్ లతో మూడు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి నిందితులకు గురించి గాలింపు చర్యలు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానంతో కొద్దిరోజుల క్రితం ముగ్గురు నిందితులను పట్టుకొని బంగారు ఆభరణాలు రికవరీ చేసి నిందితులను జైలుకు పంపమని జగిత్యాల డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మార్కులే అనిల్ ను పట్టుకోవడం కోసం జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ టీంను ఏర్పాటు చేసి వెతికే క్రమంలో బుధవారం రోజున చెల్ గల్ గ్రామ శివారులో నమ్మదగిన సమాచారం మేరకు అతన్ని పట్టుకొని నిందితుడి వద్ద నుండి వెండి బంగారు ఆభరణాలు రికవరీ చేయడం జరిగిందని దొంగలను పట్టుకున్న జగిత్యాల రూరల్ పోలీసులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారని జగిత్యాల డీఎస్పీ.రఘుచందర్ తెలిపారు.

# క్రీడ

# వర్షార్పణం..

## టీమ్ఇండియా.. ఆసీస్ మధ్య తొలి టీ20 రద్దు



అయిదు టీ20 సిరీస్‌లో భాగంగా టీమ్ఇండియా, ఆస్ట్రేలియా మధ్య బుధవారం కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దైంది. కేవలం 9.4 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. మొదట టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆట నిలిచి పోయే సమయానికి భారత్ 1 వికెట్ కోల్పోయి 97 పరుగులు చేసింది.
మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆది నుంచి దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ తనకు దక్కిన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (3.5) అతడు ఫీల్డర్ మీదుగా ఫోర్ కొట్టే ప్రయత్నంలో భాగంగా బంతిని గాల్లోకి లేపాడు. దాన్ని టిమ్‌డేవిడ్ ఒడిసి పట్టుకున్నాడు. దీంతో అభిషేక్ 19 పరుగులకు (14 బంతుల్లో, 4 ఫోర్లు) పెవిలియన్‌కు చేరాడు. దీంతో టీమ్ఇండియా తన తొలి వికెట్‌ను 35 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, గిల్‌తో కలిసి టీమ్ఇండియాను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 5 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. తర్వాత కాసేపటికి వాన ఆగిపోవడంతో మ్యాచ్ ప్రారంభమైంది. అయితే ఆటను 18 ఓవర్లకు కుదించారు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైన తర్వాత కాసేపటికి.. సూర్యకుమార్ 18 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. జేవియర్ బ్రేట్‌లెట్ బౌలింగ్‌లో (7.3) అతడు ఇచ్చిన క్యాచ్‌ను జోష్ ఫిలిప్ పట్టుకోలేకపోయాడు. అనంతరం మరింత జాగ్రత్తగా ఆడిన.. గిల్, సూర్యకుమార్ యాదవ్ రెండో వికెట్‌కు 32 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యం నమోదు చేశారు. భారత బ్యాటర్లు ఇక గేర్లు మార్చి వేగంగా పరుగులు చేయాలని చూస్తున్న తరుణంలోనే 9.4 ఓవర్ల వద్ద వరుణుడు ఆటకు మరోసారి ఆటంకం కలిగించాడు. అప్పటికి టీమ్ఇండియా స్కోర్ 97/1గా ఉంది. రెండోసారి మ్యాచ్ ఆగడానికి ముందు నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో (9.3) సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన సిక్స్ బాదాడు. ఇది అతడికి టీ20ల్లో 150వ సిక్స్. అతడు 86 ఇన్నింగ్స్‌ల్లో, 1649 బంతులు ఎదుర్కొని ఈ ఘనతను సాధించాడు.
తర్వాత ఆటను కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను అర్ధాంతరంగా ముగించారు. మ్యాచ్ ఆగే సమయానికి శుభ్‌మన్ గిల్ (37*), సూర్యకుమార్ యాదవ్ (39*) నాటౌట్‌గా నిలిచారు. రెండో టీ20 మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా.. శుక్రవారం (అక్టోబర్ 31) జరగనుంది.

## 'కంగారూ'ను జయిస్తేనే ఫైనల్‌కు..

మహిళల ప్రపంచ కప్ ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్ఇండియా.. ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్‌లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది.




కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా 'కంగారూ'ను జయించాలి. అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను హర్మన్‌ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు అంత తేలిక కాదు. ఇప్పటికే లీగ్ దశలో కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 330 పరుగులు చేసినా లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్‌నర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా ఉన్నవాళ్లే. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్‌తో సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇది భారత్‌కు ఉపశమనాన్ని ఇచ్చే అంశం. బౌలింగ్‌లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్‌తో భారత్‌కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్‌నర్ కూడా బంతితో రాణిస్తే టీమ్ఇండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్‌కు ముందు ఫామ్‌లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ సింగ్, దీప్తి శర్మ, రిచా ఘోష్‌లతో పేపర్ మీద టీమ్ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నా వీరు ఏ మేరకు రాణిస్తారనే దానిపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. క్రాంతి గౌడ్ శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్‌కు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లడం ఖాయం!
మహిళల క్రికెట్లో ఇప్పటి దాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్‌లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2005లో కివీస్‌ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్‌ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమ్ఇండియా.. సెమీస్‌లో 'ఆస్ట్రేలియా' గండాన్ని దాటితే.. ఫైనల్‌లో ఇంగ్లాండ లేదా సౌతాఫ్రికాతో తలపడుతుంది.

# ఫోకస్




## పాఠాలు నేర్పే సలమిస్ యుద్ధం

చారిత్రక ఘటనలు కేవలం చరిత్రను మాత్రమే వివరిస్తాయనుకుంటే పొరపాటే. కొన్ని ఘట్టాలన పాఠాలు నేర్పుతాయి. క్రీస్తు పూర్వం 480లో జరిగిన 'సలమిస్ యుద్ధం' ఇందుకు ఉదాహరణ. పర్షియన్ సామ్రాజ్యం (ప్రస్తుత ఇరాన్ తదితర ప్రాంతాలు) విస్తరణకు జెర్జెక్స్ విస్తారమైన సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. అన్ని రకాలుగా యుద్ధ సామాగ్రిని సిద్ధం చేసుకొని గ్రీస్ (యవన దేశం)పై దాడికి దిగాడు. ఆ రోజుల్లో పర్షియన్ నౌకా బలానికి తిరుగు లేకపోయేది. నౌకాదళం పొంచి ఉండగా, పర్షియన్ సైనికులు ఏథెన్స్‌పై విరుచుకుపడ్డారు. నగరాన్ని ధ్వంసం చేశారు. ప్రజలు భయంతో పారిపోయారు. గ్రీస్ ఓటమి అంచున నిలిచింది. ఆ సమయంలో గ్రీకు వ్యూహకర్త థెమిస్టోక్లిస్ తన దేశాన్ని రక్షించుకోవడానికి గొప్ప ప్రణాళిక వేశాడు.



పర్షియన్ నౌకా దళంలో భారీ నౌకలు ఉండగా, గ్రీస్ వద్ద ఉన్నవి చిన్న నౌకలు. ఈ విషయాన్ని గుర్తించిన థెమిస్టోక్లిస్ మధ్యదరా సముద్రం నుంచి తమ భూభాగాన్ని కలిపే ఒక ఇరుకైన జల సంధిలోకి తమ నౌకలను చేర్చాడు. పర్షియన్ నౌకాదళంపై మెరుపుదాడి దాడి చేసి, వెంటనే వెనుదిరగాల్సిందిగా సూచించాడు. అతని వ్యూహం ఫలించింది. గ్రీకు నౌకలను అనుసరిస్తూ వెళ్లిన పర్షియన్ నౌకలు, ఆ ఇరుకైన జలసంధిలో చిక్కుపడ్డాయి. భారీగా ఉండడంతో, పక్కకు తిప్పడానికిగానీ, వెనక్కు తిరగడానికిగానీ వీలులేని పరిస్థితి. అదే అదునుగా గ్రీకు నౌకా దళం చెలరేగిపోయింది. దాడులు ముమ్మరం చేసింది. ఒకదాని తర్వాత మరొకటిగా నౌకలను ముంచేయడం మొదలు పెట్టింది. తన కళ్ల ముందే నౌకాదళం నాశనం కావడాన్ని చూసి పర్షియన్ రాజు జెర్జెక్స్ దిగ్భ్రాంతికి గురయ్యాడు. యుద్ధం విరమించి, మిగిలిన సేనలను తీసుకొని తిరుగుప్రయాణమయ్యాడు. ఈ యుద్ధంలో గ్రీస్ చారిత్రక విజయాన్ని సాధించింది. ఒకే ఒక వ్యక్తి తన వ్యూహ రచనతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. గ్రీకులు తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుగోలిగారు. పాశ్చాత్య నాగరికతను పునాది అయిన ప్రజాస్వామ్యం, తత్వశాస్త్రం, కళలు గ్రీస్ నుంచి ఉద్భవించాయి. ప్రపంచమంతటా విస్తరించాయి. ఈ యుద్ధం ద్వారా బలంతో మాత్రమే విజయం సాధ్యం కాదని, బుద్ధి, వ్యూహం, ధైర్యం ఉంటే అసాధ్యమనే పదమే ఉండదని థెమిస్టోక్లిస్ నిరూపించాడు. తక్కువ సైన్యంతోనే, వ్యూహాత్మకంగా పెద్ద సామ్రాజ్యాన్ని ఓడించాడు. అందుకే సముద్ర యుద్ధ మేధావిగా చరిత్రలో నిలిచిపోయాడు.

## కెర్బ్‌స్టోన్

ఐర్లాండ్‌లోని బోయిన్ వ్యాలీ ప్రాంతంలో ఉన్న 'నోత్' అనేది సుమారు 5000 సంవత్సరాల నాటి నియోలిథిక్ సమాధి సముదాయం. కెర్బ్‌స్టోన్ (పురాతన కాలంలో దీనిని ఫుట్‌పాత్ లేదా పేవ్‌మెట్ కోసం వాడేవారు) రాతి పలకలు ఆధునిక పురావస్తు పరిశోధనల్లో అత్యంత మర్మమైన కళాఖండాలుగా పేరు సంపాదించాయి. ఇక్కడ మొత్తం 124 రాతిపలకాలలో గొప్ప అందం, జ్యామితీయ (జామెంట్రికల్) నైపుణ్యం, ఖగోళ సార్థకత కారణంగా విశేష ప్రాధాన్యం పొందింది. ఈ రాయి ఉపరితలంపై చెక్కిన స్పైరల్‌లు, వజ్రాకారాలు, జిగ్‌జాగ్ ఆకారాలు చూసినప్పుడు అవి సాధారణ అలంకారాలు కాదనే విషయం తెలుస్తుంది. పురావస్తు శాస్త్రజ్ఞుల ప్రకారం ఈ నమూనాలు సూర్యుడు, చంద్రుడు, మాసాలు, ఋతువులు వంటి ఖగోళ చక్రాలకు సంకేతాలై ఉండవచ్చు. ప్రత్యేకంగా కనిపించే గీతలు , కేంద్రీకృత వృత్తాలు ప్రాచీన సూర్య చంద్ర గమనాలు గుర్తించేందుకు ఉపయోగించబడిన సూచికలుగా కొంతమంది పరిగణిస్తున్నారు. సౌర కాలమానం సిద్ధాంతంకొన్ని పరిశోధకులు కెర్బ్‌స్టోన్ 15 ను సౌర క్యాలెండర్ లేదా ప్రాచీన దిన గణన పరికరంగా అభివర్ణించారు. రాయిపై కనిపించే 13 స్పైరల్ తిరుగులు ఒక సంవత్సరంలోని నెలలను లేదా రుతు మార్పులను సూచిస్తాయని, కేంద్రం నుండి బయటి వృత్తాల దిశలో సూర్యుని మార్గాన్ని సూచించే తూర్పు–పడమర మార్గాల దిశలతో అనుసంధానం చెందుతాయి. ఇది సూర్యోదయం, సూర్యాస్తమం మధ్య సమతౌల్యం సాధించేందుకు నిర్దిష్టంగా రూపొందించబడినట్టు సూచిస్తుంది. ఈ రాతిపై నమూనాలు కేవలం ఖగోళ వివరాలు కాకుండా, పూజా కర్మకాండాలు, ఆత్మల పట్ల గౌరవం, జీవిత చక్రం పట్ల విశ్వాసంతో కూడిన ఆధ్యాత్మిక చిహ్నాలుగా కూడా ఉండవచ్చు. ఈ స్థలంలో కళ, నమ్మకం, ప్రకృతి జ్ఞానం వంటి అంశాలు ఇవి కలిసిన ప్రాచీన ప్రజల మేధస్సును ప్రతిబింబిస్తున్నాయి.
ప్రయత్నమని భావిస్తున్నారు. ఇది ప్రాచీన ఐరిష్ ప్రజల ఖగోళ అవగాహనకు, కాలం గమనాన్ని గమనించే గణనాత్మక ప్రయత్నాలకు ఉదాహరణగా నిలుస్తుంది. ఆస్ట్రోనామికల్ నిర్దేశాలు 'నోత్' సమాధి సముదాయంలోని









# కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం

- ఎల్ఐసి బీమా డబ్బులను అదానీకి అప్పగించిన కేంద్ర సర్కార్
- డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి..
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/యాదాద్రి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును ఆదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగ వ్యవహరిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ఆరోపించారు. బుధవారం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఎండి ఇమ్రాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎల్ఐసి అనేది కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక. ఈ సంస్థను ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వదిలేయడం అంటే ప్రజల భవిష్యత్తుతో ఆటలాడటమే. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు బహుమతిగా ఇస్తూ, ప్రజా రంగ సంస్థలను క్రమంగా బలహీనపరుస్తోంది అని, ప్రభుత్వం నిర్ణయాని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం వేదికగా డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించి ఖమ్మంకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్రభాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని, బీసీ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలుపాలని, వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన వరి ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. వరి,పత్తి తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. వరి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలని ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, కల్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుల్ల లింగం, పెరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, కల్లేపల్లి మహేందర్, రేకల శ్రీనివాస్, దాసరి లక్ష్మయ్య, గోరేటి రాములు, బబ్బురి శ్రీధర్, ఆలేటి బాలరాజు, ఇంజ హేమలత, వల్లకొండ భరతమ్మ తదితరులు పాల్గొన్నారు.




# డిసెంబర్ 26న ఖమ్మం నగరానికి దండుగా కదులుదాం

- బస్తీలు, పల్లెల్లో సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా జరపాలి
- ప్రజాక్షేత్రంలో విస్తృతంగా ప్రచారం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంత సంబురాలను పురస్కరించుకుని రానున్న డిసెంబర్ 26వ తేదిన ఖమ్మం నగరంలో జరిగే ముగింపు సభను ప్రతి పల్లె, బస్తీ నుండి దండుగా కదలాలని, ఇందు కోసం పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో శేషగిరి భవన్‌లో జరిగిన కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యాతిధిగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ శంతవసంతాల ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకులుగా కాకుండా ప్రజల ఉద్యమ చరిత్ర గుర్తు చేసే సమయంగా ఉండాలని, ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాటాలు నిర్వహించిన సిపిఐ చరిత్ర నేటి తరానికి ఆదర్శంగా ఉండేలా గ్రామ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించాలని, వందేళ్ల ఉత్సవాలు సిపిఐ ఆలోచనలు, విలువలను కొత్తతరం వరకు తీసుకెళ్లే అవగాహన కార్యక్రమాలుగా మలచాలని సూచించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ డిసెంబర్ 26 వరకు సిపిఐ శ్రేణులు ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. వందేళ్ల ఉత్సవాన్ని వేదికగా చేసుకుని కార్మికులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు, యువత, మహిళా సమస్యలపై విస్తృతంగా చర్చలు, సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజా చైతన్యం పెంచాలనిసూచించారు.
ప్రతీ వార్డు ప్రతి గ్రామంలో ఎర్రజెండా ఎగురవేయాలని, సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ప్రజల పండుగగా మార్చాలని కూనంనేని పిలుపునిచ్చారు. మర్రి గోపికృష్ణ, మాచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్, వంగ వెంకట్, కందుల భాస్కర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు ఎఐఎస్‌ఎఫ్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా శ్రీ చైతన్య పాఠశాలను నడిపిస్తున్నారని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఫీజులు కట్టని విద్యార్థులను గంటల తరబడి క్లాస్ రూమ్ ముందు నిలబెట్టుతున్నారని, వారికి ఎటువంటి పరీక్షలకు అనుమతించకుండా విద్యార్థులను నానా ఇబ్బందుల కు గురి చేస్తున్నారని అన్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసి ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.



## సిపిఐలో 30 కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సాంబయ్య గూడెం గ్రామానికి చెందిన సుమారు 30 కుటుంబాలు బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి ఎర్ర జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సాంబయ్యగూడెం గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పులిగల రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కెసాబీర్ భాషా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం, నిత్యం పనిచేసే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆకర్షితులై నేడు సామాన్యగూడంలో 30 కుటుంబాలు చేరిక జరిగిందని ఇది శుభ పరిణామం అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పనిచేసే ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు వేడుకలకు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం హాజరై మాట్లాడుతూ శత వసంతాల ముగింపు వేడుకలకు 45 దేశాల నుండి ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకత్వం మొత్తం భారీ బహిరంగ సభలో పాల్గొటారని కావున ఈ శత జయంతి ముగింపు వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రద చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు మండల పట్టణ కార్యదర్శిలు రాజబాబు, సుధాకర్, జిల్లా సమితి సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

## దేశాల ఆర్థిక స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం

- ఎగుమతులు దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరికాదు
- చరిత్రలో నిలిచే సిపిఐ శత వసంతాల ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దేశాల స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని ఎగుమతులు, దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరికాదని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. బుధవారం జిల్లా సిపిఐ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య జిల్లా కౌన్సిల్‌ను ఉద్దేశించి పశ్య పద్మ మాట్లాడారు. డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావలన్నారు. చరిత్రలో నిలిచే సిపిఐ శతజయంతి ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అమెరికా బిగ్ అగైన్ అని అతి పెద్ద సంపద గల దేశంగా మార్చుకోవటంలో భాగంగా ఎగుమతులు, దిగుమతులను పెంచుతూ ట్రంప్ కుట్ర చేస్తున్నారన్నారు. అమెరికా దేశ ఆర్థిక స్థితిగతులను పెంచేలా చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు న్యాయబద్ధంగా లేకపోవటంతో పాటు వివిధ దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసేలా ప్రయత్నిస్తున్నారన్నారు. రష్యా నుంచి దిగుమతి అవుతున్న నేపథ్యంలో క్రూడాయిల్‌కు సంబంధించి వెంటనే ఆపాలని, లేని పక్షంలో 25 శాతం అదనంగా సుంకాలు వసూలు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. రష్యా నుంచి ఆయిల్‌ను దిగుమతి చేసుకోమని మోడీ మౌనం వహించటం ఏంటని ప్రశ్నించారు. బిజెపి అవలంభిస్తు న్న తీరుపై ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉం దన్నారు. ప్రజాపోరాటాలు సిపిఐ సాధించిన విజయాలపై చర్చించగలిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావలన్నారు. కేంద్రం ప్ర భుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక, రైతు వ్య తిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. నవంబర్ 18న మైనార్టీలపై దళితలనై మహిళలపై జరుగుతున్న దారుణమైన హత్యలు దాడులను నిరసిస్తూ కార్యక్రమం చేపట్టాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపుని విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో బి.రఘురాం, బొంబాయి గంగారాం, కె. గంగామణి, ఎం.సాయిలు, ఎన్.సాయిలు, అనిల్, హన్మాండ్లు, ఆలీ, ఇమ్రాన్, ప్రసాద్ పాల్గొన్నారు.




# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

సహాయక చర్యల్లో సిపిఐ శ్రేణులు

భాగస్వాములు కావాలని కూనంనేని పిలుపు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొంథా తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాలశాఖ, వ్యవసాయశాఖ, ప్రజారోగ్య, విద్యుత్‌శాఖతో పాటు పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పలు సూచనలు చే శారు. పునకు ముంగు గురయ్యే ఇబ్బందులు పడే ప్రజలను ఆదుకునేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధంగా ఉండి సహాయక చర్యల్లో ముమ్మరంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

## బస్టాండ్ స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్టాండ్ ఏర్పాటు చేయాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బుధవారం మణుగూరు మున్సిపల్ కమీషనర్ ప్రసాద్ తో కలిసి బస్టాండ్ స్థల పరిశీలన చేశారు. అనంతరం సాధారణ ప్రజలతో మమేకమై వారితో కూర్చుని టీ తాగారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి రూ. లక్షల విలువ గల ఫ్రిజర్ బాక్స్ వితరణ



**ప్రజాపక్షం/కామేపల్లి:** తాళ్లగూడెం గ్రామ పంచాయతీకి తాళ్లగూడెం గ్రామ ఆడబిడ్డ మలీదు పద్మ, వీరభద్రం వారి కుమారుడు డాక్టర్ ఉదయ్ కిరణ్ ఆర్థిక సహకారంతో రూ లక్ష విలువ కల్గిన ఫ్రిజర్ బాక్స్‌ను పుచ్చకాయల వెంకటరామయ్య(పెద్దగొల్ల), నారమ్మల జ్ఞాపకార్థం గ్రామ పంచాయితీకి వితరణగా అందజేశారు. వితరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొని పంచాయితీ కార్యదర్శి విజయ్ కుమార్‌కు ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యను గుర్తించి దాతలు ముందుకు వచ్చిన ఫ్రీజర్‌ను వితరణగా అందించడం అభినందనీయమన్నారు. దాతలు గ్రామంలో సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పుచ్చకాయల నారమ్మ, వెంకటరామయ్య, కుమారులు నాగరాజు, మంగయ్య, కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పుచ్చకాయల అప్పారావు, మాజీ ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను కలిసిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారీ వర్షాల కారణంగా పలు చోట్ల పారిశుధ్యంతో పాటు ఇతరత్రా సమస్యలు తలెత్తడంతో జోరు వానను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికులను ఏఐటియుసి నాయకులు కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ మాట్లాడుతూ భారీ వర్షం నుంచి ఇబ్బందులు పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కార్మికులకు సూచించారు. రెయిన్ కోట్లు, బూట్లు, గ్లౌజులను తప్పని సరిగా ఉపయోగించాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తున్న కార్మికులను ఆయన అభినందించారు. కార్మికులను కలిసిన వారిలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, కటుకూరి సతీష్‌రెడ్డి, వీరన్న తదితరులు ఉన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మొంథా తుఫాన్ వర్షాభావ పరిస్థితుల్లో మండల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ మద్దెల రమాదేవి తెలిపారు. మొంతా తుఫాన్ కారణంగా ఈదురు గాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉన్నందున పాతపడిన ఇంటిలో, పాత గోడల వద్ద ఉండకూదని, కరెంట్ సంబంధించిన పనులు చేయవద్దని, కరెంట్ స్తంభాలను తాకకూడదని, చిన్న పిల్లలు బయట ఆడుకోవడానికి వెళ్లకుండా చూసుకోవాలని తెలిపారు. తుఫాన్ తగ్గే వరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని, అవసరమైన చోట్ల సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు సెలవు ప్రకటించడంతో ఈ రెండురోజులు తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించి బయటకు వెళ్లకుండా జాగ్రత్తలో ఉండాలని ప్రజలకు తెలిపారు.

## సన్నబియ్యం సరఫరా సజావుగా జరగాలి

ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు సన్నబియ్యం సరఫరా సజావుగా జరిగేలా చూడాలని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలోని ఎఫ్‌సిఐ గౌడంలో నూతన సెంటర్‌ను ప్రారంభించారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా సకాలంలో పూర్తి చేసేందుకు ఏర్పాటు చేసిన ఎంఎల్ఎస్ పాయింట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సెంటర్ గతంలో ఖమ్మంనగరంలోని నర్తకి థియేటర్ వద్ద ఉండేదన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, డీలర్లు వెంకన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

# వరి రైతుకు అపార నష్టం

# నిండా ముంచిన 'మోంతా'



నేలవాలిన కోతకు వచ్చిన వరి పొలాలు

ఉమ్మడి జిల్లాలో పొంగి పొర్లుతున్న వాగులు, నదులు

మున్నేరుకు వరద ఉధృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రకృతి మరోసారి తన ప్రకోపాన్ని చూపింది. మొంథా తుఫాన్ రూపంలో బీభత్సాన్ని సృష్టించింది. ఈ ఏడాది అతివృష్టి కారణంగా ఇప్పటికే మెట్ట పంటలు దెబ్బతినగా ఇప్పుడు వరి సాగు చేసిన రైతులను నిండా ముంచింది. తుఫాన్ దెబ్బకు వరి పొలాలు నేలవాలాయి. పూర్తిగా కోతకు వచ్చిన పొలాలు నేల వాలడం పైనుంచి నీళ్లు పారుతుండడంతో అపార నష్టం జరగనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిపైనే ఆశలు పెంచుకున్నామని ఆ ఆశలను సైతం తుఫాన్ గల్లంతు చేసిందని రైతులు వాపోతున్నారు. మిర్చి తోటలు సైతం తుఫాన్ గాలికి పక్కకు ఒరిగాయి. మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి నుంచి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఎడతెగకుండా వర్షం కురుస్తుంది. వర్షానికి తోడు భారీగా ఈదురు గాలులు వీస్తుండడంతో జన జీవనం స్తంభించింది. భారీ వర్షాలకు వర్షపు నీటితో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖమ్మం నగరంతో పాటు మధిర, వైరా సహా పలు ప్రాంతాలలో వర్షపు నీరు కారణంగా పల్లపు ప్రాంతాలలో నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా కామేపల్లిలో తొమ్మిదిన్నర సెంటి మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఖమ్మంజిల్లాలోని అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వర్షపు నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. ఖమ్మం జిల్లాలో 16 చోట్ల రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపి వేశారు. కామేపల్లి మండలంలోని బుగ్గవాగు ఉధృతికి ఖమ్మం డోర్నకల్ మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. ఖమ్మం సమీపంలోని మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. బోనకల్ మండలంలోని పెద్దవాగుకు భారీగా వరద రావడంతో పలు చోట్ల రహదారులను ముంచేసింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై రాకపోకలను నిలిపి వేశారు. చింతకాని మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద వాగు ఉధృతికి లారీ కొట్టుకుపోయింది. లారీతో పాటు డ్రైవర్ కూడా గల్లంతయ్యాడు. బుగ్గవాగు ఉధృతిని సిఈవో దీక్షారైనా పరిశీలించగా మున్నేరు వరద నీటిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో మున్నేరు ప్రమాదకర స్థితికి చేరుతుందని జలగం నగర్, కెబిఆర్ నగర్, గ్రీన్ కాకతీయ తదితర ప్రాంతాలలో కలెక్టర్ పర్యటించారు. 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించి సాయం పొందాలన్నారు. పాలేరుకు వరద ఉధృతి పెరిగింది. భారీగా వరద రావడంతో 24 గేట్లను ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. తల్లాడ మండలంలో వాగుల ఉధృతిని స్థానిక ఎంపిడివో ఏనుగు సురేష్ బాబు తో కలిసి ఆశాలత లు పరిశీలించారు. పెనుబల్లి మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో లంకా సాగర్ ప్రాజెక్టును సబ్ కలెక్టర్ పరిశీలించారు. మధిర పట్టణంలో ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీ తదితర ప్రాంతాలు జలమయమైన అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు రోడ్డెక్కి వైరా, మధిర రహదారిపై ఆందోళన నిర్వహించారు. దీనితో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. మున్నేరు 17 అడుగులకు చేరుకోవడంతో ఖమ్మం నగరంలోని మున్నేరు బాధిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో భారీ వర్షాల కారణంగా పలు చోట్ల రైలు పట్టాల మీదకు వర్షపు నీరు చేరడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మధిరలో షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపి వేయగా ఖమ్మం సమీపంలోని డోర్నకల్‌లో గొల్కొండ, కొణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపి వేశారు. ఖమ్మంకు 110 కిలో మీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమైందన్న వార్తల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు పలు సూచనలు చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. పల్లపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. మొత్తంగా మొంథా తుఫాన్ ఖమ్మం జిల్లాలో బీభత్సన్ని సృష్టించింది.





## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్నేరు ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో ము న్నేరు ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సి బ్బంది, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మున్నేరు పరివాహక ప్రా ంతంలో ముందస్తు జాగ్రత్తల కోసం బుధవారం ఖమ్మం నగరంలోని కా ల్వొడ్డు, మున్నేరు ఘాట్, గణేష్ నిమజ్జన ఘాట్, బొక్కల గడ్డ, ఖమ్మం రూరల్ మండలంలోని జలగం నగర్, గ్రీన్ కాకతీయ నగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యటించారు. మున్నేరు బ్రిడ్జి వద్ద వరద నీటి ప్రవాహాన్ని, నీటి మట్టం స్థాయిని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. ఎగువ నుండి వరద పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులకు సహకరించాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఖమ్మం వద్ద మున్నేరు 18 అడుగుల మేర ప్రవహిస్తుందని మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాం టి అత్యవసర పరిస్థితులు తలెత్తినా స్పందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర సమయంలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌లో 1077, 90 63 211298 టోల్ ఫ్రీ నెంబర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో జి. నర్సింహారావు, ఖమ్మం మున్సిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, ఖమ్మం, అర్బన్ రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్ శాఖాధికారులు పాల్గొన్నారు.

## పాలేరు రిజర్వాయర్.. 24 గేట్లు ఎత్తిన అధికారులు



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పాలేరు రిజర్వాయర్ 24 గేట్లను ఎత్తిన ఎన్ఎస్పి అధికారులు. గత రెండు రోజుల నుండి మండలంలోని పాలేరు రిజర్వాయర్ పరిసర జిల్లాలలో(ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్)కురుస్తున్న వర్షాలకు పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న నీటి ప్రవాహం పాలేరు రిజర్వాయర్‌కు చేరుకోవడంతో ఇప్పటికే రిజర్వాయర్ 22.25 అడుగుల నీటితో నిండుకొని ఉండటంతో బుధవారం నాడు అధికారులు రిజర్వాయర్ 24 గేట్లను ఎత్తారు. పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న నీటి ఇన్ ఫ్లో 524 క్యూసెక్కులు కాగా గేట్ల ద్వారా వదులుతున్న నీరు 4102క్యూసెక్కులుగా ఎన్ఎస్పి అధికారులు తెలిపారు.

## మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా మండలంలో ఐదు దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు దాన్యాన్ని కొనుగోలు చేయనున్నామని సొసైటీ అధ్యక్షులు, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సహకారం సంఘం కార్యాలయంలో దాన్యం కొనుగోలు నిర్వాహకులు, వ్యవసాయ అధికారుల సమావేశం బుధవారం జరిగింది. ఏగ్రేడ్ దాన్యానికి రూ.2,359/లు, సాధారణ రకం దాన్యానికి 2,369/లుగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినదన్నారు. సన్న రకం దాన్యానికి కింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. కావునా రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నూతన సిఇఒ:** పాల్వంచ సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన లక్ష్మినారాయణ బూర్గంపాడుకు బదిలీ అయ్యారు. సొసైటీ వైస్ చైర్మన్ కాంపల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహనరావు, సామా జనార్ధన రెడ్డి, జరబన సీతారాం బాబు, భూక్యా కిషన్, ఎర్రంశెట్టి మధుసూధన్ రావు, కార్యదర్శులు బివి ప్రసాద్, జి. లక్ష్మి నారాయణ, ఏఈఓ అణురిక, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికులకు అండగా ఎర్రజెండా

సిపిఐ నేతలు చూపిన చొరవపై అభినందనల వెల్లువ

సెప్టెంబర్ 29న వార్తథనానికి అధికారుల స్పందన.



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పేదోడి అండ.. దండ ఎర్రజెండా అని తెలిసిందే..కానీ ప్రయాణికులకు కూడా అండదండ ఈ ఎర్రజెండా అనేలా మారిపోయింది. అది ఎలా?అంటారా? ఖమ్మం సూర్యాపేట రహదారిపై ఏర్పడిన ఓ పెద్ద గుంత ద్వారా స్పష్టమైనది. జోరున కురుస్తున్న వర్షంలో సైతం ప్రయాణికుల పట్ల కమ్యూనిస్టులు చూపిన చొరవ ఆ ఎర్రజెండా గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలోని చౌరస్తాలో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు అందులో పడి గుల్లవుతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలతో ఆ గుంత మొత్తం నీటితో నిండిపోయింది. ఈ క్రమంలో వాహనాల ప్రయాణం భయానకంగా మారింది. దీన్ని గమనంచిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్‌తో పాటు అక్కడి ఎలక్ట్రికల్‌షాప్ యజమాని బబుతారాం ఓ వాటర్ డ్రమ్మును ఆ గుంతపై పెట్టారు. అంతేకాకుండా ఎలక్ట్రికల్ పైపులను ఆ డ్రమ్ములో పెట్టి ఎర్రజెండాను తొడిగి, ప్రమాదసూచికగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వాహనాలు అది చూసి పక్క నుంచి వెళ్లాయి. ఈ సందర్భంగా వాహనదారులు చేపట్టిన మంచి పనిపై హర్షం వ్యక్తం చేశారు. కాగా ప్రజాపక్షం దినపత్రికలో సైతం సెప్టెంబర్ 29న కథనం ప్రచురితం అయ్యింది. అటు తర్వాత అధికారులు తూతూ మంత్రంగా గుంతలను పూడ్చి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులకు కనువిప్పు కలిగించుకుని, సమస్యను పరిష్కారం చేయాలని పలువురు కోరుతున్నారు.

## తుపాన్ ప్రభావిత పంటలను పరిశీలించిన ఎఒ

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పోచారం, హట్యతండా, పెరికసింగారం, జక్కేపల్లి గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంలో నీటిని వెంటనే తీసి వేయాలని, గింజ తయారై కోతకు సిద్ధంగా ఉన్న పొలాలు నీట మునిగినట్లయితే, లీటరు నీటికి 50 గ్రాములు చొప్పున ఉప్పును కలిపి ఆ ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే గింజలు మొలకెత్తకుండా ఉంటాయని రైతులకు తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎఒ రామడుగు వాణికి అభినందన వెల్లువ

కూసుమంచి మండల రైతులు



మండలంలో బుధవారం నాడు ఏకధాటిగా కురుస్తున్న వర్షంను సైతం లెక్కచేయకుండా మండలంలోని పోచారం, జక్కేపల్లి, పెరికిసింగారం, అత్యాతండ గ్రామాల్లో రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ మహిళా అధికారి రామడుగు వాణిని మండలంలోని పలువురు రైతులు ఆమె సేవలను అభినందించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి నాట్లు వేసే మొదలు మొక్కలు విత్తనాలు పెట్టే మొదలు నుండి పంటలు పూర్తయ్యేంతవరకు మహిళా అయినప్పటికీ అనేక మార్లు అనేక సమయాలలో రైతుల కోసం ఎంత సమయమైనా హెచ్చించి ఓపికతో పంట పొలాలను పరిశీలించి వారికి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం ఎంతో ఓపికతో రైతులకు సమాచారం అందించి వారిని మెప్పిస్తుండటంతో పలువురు రైతులు ఆమెను సేవలను అభినందిస్తున్నారు.

## మోంతా తుఫాన్‌తో సింగరేణిలో నిలిచిన ఉత్పత్తి

రూ.7 కోట్ల నష్టం





**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మొంథా తుఫాన్ ప్రభావం సత్తుపల్లిలోని జేవిఆర్, కిష్టారం ఓసిలపై భారీగానే ప్రభావం చూపినట్టు తెలుస్తుంది. గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా సత్తుపల్లి పరిధిలోని ఓపెన్‌కాస్ట్ లలో బొగ్గు వెలికితీత పనులునిలిచిపోవాటంతో పాటు, ఓబి పనులకు అంతరాయం ఏర్పడింది. వర్షపాతం కారణంగా గనుల్లో నీరు చేరటంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. బుధవారం సింగరేణి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ 1, 2లో సుమారు 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడగా, రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలిచే పనులు నిలిచిపోయినట్లు తెలిసింది. అదే విధంగా సుమారు రూ. 7 కోట్ల నష్టం వాటిలినట్లు తెలియజేశారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## వరంగల్ నగరంలో జలమయమైన కాలనీలు, రహదారులు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ నగరంలో ఉదయం నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. రహదారిని ఒక సైడ్ తాత్కాలికంగా పోలీసులు మూసివేయడంతో, శివనగర్, మైసయ్యనగర్, ఎన్ఎన్నగర్, లక్ష్మీ గణపతి, విశ్వనాథ్ కాలనీ, కాశిబుగ్గ, వివేకానంద కాలనీ, ఓసిటి స్టేషన్ రోడ్డు, బట్టల బజార్, కొత్తవాడ, మట్రి వెంకటయ్య కాలనీ, దేశాయిపేట, పలు కాలనీలు రహదారులపై




వరద నీరు చేరడంతో వాహనాదారులు ప్రజలు ఇబ్బంది పడ్డారు.

## రాష్ట్రాన్ని నిండా ముంచిన మొంథా తుపాన్

### బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా దంచి కొడుతున్న భారీ వర్షాలతో చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో రైతాంగానికి కోలుకోలేని అపారమైన నష్టం వాటిల్లిందని, దీన్ని జాతీయ విపత్తుగా గుర్తించి పెద్ద మొత్తంలో రైతులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక విధాలుగా ఇబ్బందులకు గురై నష్టపోయిన సన్న, చిన్న కారు రైతులకు ఈ ప్రకృతి బీభత్సం సృష్టించిన నష్టం ఇంత అంతా కాదన్నారు. అనేక ఇండ్లు దెబ్బతిన్నాయని, సర్వస్వం కోల్పోయిన వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భారీ వర్షాలతో జరిగిన నష్టాల వివరాలను సేకరించి వారిని అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబాలకు తాత్కాలిక సహాయంగా రూ.20వేల రూపాయలు , 50 కిలోల బియ్యం ఉచితంగా అందించాలన్నారు.

## కలెక్టరేట్‌లో అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/హనుమకొండ:** భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కంట్రోల్ రూమ్ ద్వారా సేవలను 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 7981975495 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. వరదల కారణంగా అత్యవసర సేవల నిమిత్తం అందుబాటులో తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని ప్రజలను కోరారు.

## ప్రభుత్వ హత్యనా? టీచర్ల హత్యనా?




**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ నరసింహారావు రెసిడెన్షియల్ పాఠశాలలో ఇటీవలే ఉరేసుకొని మృతి చెందిన విద్యార్థిని వర్షిత మరణం చుట్టూ తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అడ్డూరి అనిల్ మాదిగ, కో కన్వీనర్ బొంకూరి కార్తీక్ మాదిగ అన్నారు. అదేవిధంగా ఈ ఘటనపై ఉన్నతాధికారుల చేత సమగ్ర విచారణ జరపాలని శ్రీవర్షిత మరణించిన రోజున డ్యూటీలో ఉన్న ప్రిన్సిపాల్ మరియు టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ వర్షిత తండ్రి తిరుపతి నా కూతురును చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని శ్రీ వర్షిత తండ్రి తిరుపతి అన్నటువంటి విషయాన్ని ఉన్న అధికారులు పరిగణంలోకి తీసుకోవాలని తెలిపారు. ఇది సాధారణ ఆత్మహత్య కాదు వర్షిత మరణం వెనుక దాగి ఉన్న అఘాయిత్యం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యనా, లేక టీచర్ల చేత జరగిన హత్యనా, ప్రజలకు, సమాజానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద దుర్ఘటన జరిగినా స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించకపోవడం తీవ్రంగా ఖండించారు. శ్రీ వర్షితకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మరియు కో ఇన్‌చార్జ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ చింతలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ మాదిగ, ఉపాధ్యక్షుడు శనిగరం వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**ప్రజాపక్షం/కమలాపూర్:**మద్దతు ధర ప్రకారం రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లి, మాదన్నపేట, శనిగరం, నేరెళ్ళ, పంగిడిపల్లి, మర్రిపల్లి గూడెం, గుండేడు గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రవీందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న ముందా తుఫాన్ వలన తడిసిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పండించిన ధాన్యం డబ్బులతో పాటు బోనస్ సత్వరమే ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఐకెపి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, ఐకెపి ఏపిఎం లలిత, మాజీ సర్పంచ్ గుండపు చరణ్ పటేల్, డైరెక్టర్లు కెత్తే విజయేందర్, చకిలం దయాకర్, యాకుబ్ పాషా, నెగ్గుల లింగయ్య, కాంగ్రెస్ నాయకులు గూడెపు మొగిలయ్య, దూడ శ్రీకాంత్, నాంపల్లి ప్రభాకర్ ప్రజాపతి, తాటిపాముల రాములు, అబ్బరవేణి అనిల్, బాలపూరి కనకరత్నం, డాక్టర్ యుగేందర్, డాక్టర్ రాజు, సురేంద్ర రాజు, ఉపాసి కృష్ణ, ఐకెపి సిబ్బంది, ఎస్‌హెచ్‌జి సభ్యులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మరణించడంతో హైదరాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని, సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.ఎమ్మెల్యే వెంట చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, లింగాల ఘనపూర్ మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, బ్రహ్మ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ముంచెత్తిన ‘మొంథా’ తుపాన్

### ఉమ్మడి వరంగల్‌జిల్లాలో భారీ వర్షాలు
### జలమయమైన రోడ్లు,నిలిచిన ట్రాఫిక్
### తడిచిన ధాన్యం,మొక్కజొన్న,పత్తి




**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ ఉమ్మడి జిల్లాలో మొంథా తుఫాన్ ఎఫెక్ట్ భారీ వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడుతుండగా డోర్నకల్, వర్ధన్నపేట మండలాల్లో పది సెంటిమీటర్లకు పైగా వర్షం పడింది. ఈ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం కాగా ఆరు జిల్లాల పరిధిలో అలర్ట్ ప్రకటించారు. మొంథా తుఫాను వల్ల భారీ వర్షాలు పడుతుండటంతో మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. ఈ భారీ వర్షాలకు వరంగల్ నగరం పరిధిలో కూడా జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రధాన రోడ్లపైన లోతట్టు కాలనీలో వరద నీరు చేరింది. రాత్రి నుంచి వర్షం పడుతుండటంతో ప్రధాన రోడ్లన్నీ బోసిపోయాయి. భారీ వర్షాలకు డోర్నకల్ ,వరంగల్, కాజీపేట, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ లలో వరద నీరు చేరడంతో గోల్కొండ, కోణార్ ఎక్స్ ప్రెస్ నిలిచిపోయాయి.ఉమ్మడి జిల్లాలో పడుతున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు పొంగుతున్నాయి. ఏకధాటిగా వర్షాలు పడుతుండటంతో జిల్లా కలెక్టర్లు, అధికారులందరూ విధుల్లో ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. సెలవులను రద్దు చేశారు. వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో మార్కెటింగ్, వ్యవసాయ, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని స్థాయిలోని శాఖల ఆదేశాలు ఇచ్చారు. మండల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్లు కోరారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి రోగులకు చికిత్సలను అందించాలని ఆదేశాలు ఇచ్చారు. భారీ వర్షానికి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం**

మొంథా తుఫాన్ ఎఫెక్ట్ కు ఉమ్మడి జిల్లా పరిధిలో భారీ వర్షం పడింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్లో 104 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. కురవిలో 90 మిల్లీమీటర్లు, మహబూబాబాద్ లో 89.3 మిల్లీమీటర్ల నమోదు అయ్యింది. వర్ధన్నపేటలో 102.3 మిల్లీమీటర్లు, రాయపర్తిలో 95.8, ఖానాపూర్ లో 94, పర్వతగిరిలో 91.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. కాజ్ వేలపై నుంచి వరద నీరు వెళ్తుండటంతోపలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి.

**పంటలకు తీవ్ర నష్టం**

ఉమ్మడి జిల్లాలో పడుతున్న వర్షాలతో పలు గ్రామాల పరిధిలో వరి, పత్తి బాగా దెబ్బతింది. ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉన్నా పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లతో మంత్రి కొండ సురేఖ జూమ్ మీటింగ్‌లో సమీక్షించారు. వర్షాల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని ఆదేశించారు. వరంగల్ సిపి, నగర కమీషనర్, జిల్లా అధికారులతో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో నియోజకవర్గాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, యశస్విని రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళినాయక్, మాధవరెడ్డి, సత్యనారాయణరావు, కడియం శ్రీహరిలు ఆదేశాలు ఇచ్చారు. భారీ వర్షాలు పడుతుండటంతో పలు చోట్ల పోలీసులు వరదనీరు చేరడంతో ట్రాఫిక్ ను మళ్లించి చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూములను ఏర్పాటుచేసి సహాయక చర్యలు చేపట్టారు. అవసరం అయితే తప్ప ప్రజలు బయటికి రావొద్దని జిల్లా కలెక్టర్లు కోరారు.

## రైతులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ :** వాతావరణశాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వరంగల్ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్ తో జిల్లా అధికారులతో మంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల.. రైతులకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, డీఆర్డీఓ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి ప్రజలను తరలించేలా పూర్తి సన్నద్ధంతో ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా జిల్లా మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ముఖ్యంగా తహసీల్దారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి వర్కర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జలమయమై ప్రాంతాల్లో నిర్వాసితులైన ప్రజలకు భోజనం, వృద్ధులకు పండ్లు, పిల్లలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంటుందని, కావున రోడ్డు రవాణా విద్యుత్ సరఫరాలో అంతారం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, విద్యుత్, రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో పట్టాలపైకి వరదనీరు

### పలు రైళ్ళ రాకపోకలు అంతరాయం
### సందర్శించిన జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్
### ప్రయాణికులు త్రాగునీరు, ఆహారం పంపిణీ

**ప్రజాపక్ష/మహబూబాబాద్:**భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లాలో పలు రోడ్లు జలమయమయ్యాయి. వాహనల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో వరదనీరు చేరుకుని పలు రైళ్ళు రాకపోయకలకు అంతరాయం ఏర్పడింది. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ రైల్వేస్టేషన్‌లోనే నిలిపివేశారు. అలాగే మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్ నిలిపివేశారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ సందర్శించి నిలిచిపోయిన రైళ్ళలో ప్రయాణికులకు త్రాగునీరు, ఆహారపదార్థాలు అందించారు. ప్రయాణిలు ఇబ్బందులు పడకుండా జిల్లా పోలీసులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. మహబూబాబాద్ టౌన్ సిఐ మహేందర్‌రెడ్డి, రూరల్ సిఐ సరవయ్య, డోర్నకల్ సిఐ చంద్రమౌళి,సిబ్బంది, ఎస్ఐలు,కానిస్టేబుళ్ళు రైల్వేస్టేషన్‌కుచేరుకుని ప్రయాణికులకు బిస్కెట్ ప్యాకెట్లు, పులిహర ప్యాకెట్లు పంపిణీచేసి సేవలు అందించారు.

**ప్రజలతోనే పోలీసులు: ఎస్‌పి**

పోలీసులు ఎల్లవేళలా ప్రజలతోనే ఉంటారని, వారికి అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా సహాయం అవసరమైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్‌పి సుధీర్‌రాంనాథ్ కేకన్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడం పోలీసుల ప్రధాన ధ్యేయమని విపత్తు సమయాల్లో ప్రజల భద్రత కోసం నిరంతరంపోలీసులుకృషిచేస్తారనిఎస్‌పితెలిపారు.

## గంజాయి మత్తులో యువకుడు హల్‌చల్, అరెస్ట్



**ప్రజాపక్షం/జనగామ** :గంజాయి మత్తులు యువకుడు హల్‌చల్ చేసి పలువురిని గా యపరిచిన సంఘటన జనగామలో పట్టణ ంలో జరగగా ఆ యువకుడిని అరెస్ట్ చేసినట్లు జనగామ సిఐ సత్యనారాయణరెడ్డి తె లిపారు. బుధవారం నిందితుడిని అరెస్ట్ చే సి రిమాండ్‌కు పంపించారు. ఈ సందర్భ ంగా సిఐ సత్యనాయణరెడ్డి మాట్లాడుతూ జనగామ పట్టణంలోని ధర్మకంచెకు చెంది న సౌద సన్నీ అనే 21 సంవత్సరాల యువడు డెకరేషన్ పనులు చేస్తుంటాడన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి తె చ్చుకొని ఎవరికి తెలియకుండా సేవిస్తాడ ని, మంగళవారం సాయంత్రం గంజాయి సేవించి వీరేషం కిరాణం షాపు వద్ద టెంట్‌హౌస్ హరిబాబు స్కూటర్‌పై వెళుతుండగా ఆయనను, ఆయన కుమారుడు శ్రీధర్‌లను డెకరేషన్ పనులు తనకు ఇవ్వడం లే దని బెదిరించాడన్నారు. డెకరేషన్ పనులు వేరే వ్యక్తులతో చేపించుకోవడంతో కక్ష పె ంచుకున్న సన్నీ అప్పటి నుండి తండ్రి కొ డుకులు హరిబాబు, శ్రీధర్ లపై కక్ష తీసుకోవాలనే ఉద్దేశ్యంతో తన వద్ద ఉన్న కత్తి తో అతని మీద దాడి చేశాడని, తప్పించుకునే క్రమంలో హరిబాబు కాలి బ్రొటనవేలుకు గాయమైందన్నారు. అదే మత్తులో మదీనా మసీదు వద్దకు వెళ్లి హరిబాబు కొ డుకు పైనా కూడా దాడి చేయబోగా తప్పించుకున్నాడన్నారు. అనంతరం అక్కడే ఉ న్న మరో ముస్లిం వ్యక్తిపై కత్తి పిడితో చెంప పై కొట్టాడని సన్నీపై గతంలోనూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఉన్నాయన్నారు. హ రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చే సి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

## ఉమ్మడి వరంగల్ అభివృద్ధిలో మరో మైలురాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలిక ప్రాతిపదికన 14నవంబర్ 2025 నాటికీ క్రీడా పాఠశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల పక్షాన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు నెలవైన ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలి అనే సంకల్పంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్ని తానై ముందడుగు వేశారు. అందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను సమన్వయం చేసి వారితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రీడా పాఠశాల ఏర్పాటు అవశ్యకతను వివరించి సీఎంను ఒప్పించి స్పష్టమైన హామీ తీసుకున్నారు. హన్మకొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల శాశ్వత మరియు తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలిక ప్రాతిపదికన హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. 14నవంబర్ 2025నాటికీ క్రీడా పాఠశాలను ప్రారంభించాలని అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. క్రీడా పాఠశాలను 2025–26 సంవత్సరానికి సంబంధించిన 4వ తరగతి విద్యార్థులు 40మంది బాలురు, 40మంది బాలికలను కౌన్సిలింగ్ ద్వారా ఎంపిక చేసి ప్రారంభించనున్నట్లు అందుకు అవసరమైన సిబ్బంది, ఉపాధ్యాయులను, కోచ్ లను వెంటనే నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ కు, క్రీడా శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. 14నవంబర్ 2025 నాటికి ప్రారంభం అయ్యే హన్మకొండ క్రీడా పాఠశాలలో 4వ తరగతి విద్యార్థుల ప్రవేశానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించాలని అందుకు 6సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. విద్యార్థుల కౌన్సిలింగ్ నిర్వహణను హన్మకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో 6గురు సభ్యుల కమిటీ ఆధ్వర్యంలో బాలురకు 05 నవంబర్ 2025 రోజున, బాలికలకు 06 నవంబర్ 2025 రోజున కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కు, క్రీడా శాఖ అధికారులను ఆదేశించింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంత ప్రజల ఆకాంక్షల ప్రతిబింబంగా ఈ నిర్ణయం నిలుస్తుందని పేర్కొన్నారు. క్రీడా ప్రోత్సాహానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## 31వ తేదీన డిఇఒ కార్యాలయాల ముట్టడి



**ప్రజాపక్షం/ములుగు:**ఈ నెల 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరిగే డిఇఒ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ వంట కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచకుండా నాణ్యమైన భోజనాలు అందించాలని, మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఇప్పటికే 11 నెలల అల్పాహారం బిల్లులు ,వంట బిల్లులు ఆరు నెలలుగా, వేతనాలు 8 నెలలుగా పెండింగ్‌లోనే ఉంటే వంట కార్మికులు వంటలు ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీశారు.ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని అధికారులు సంప్రదిస్తే ఏమాత్రం పట్టించుకోపోవడం వలన ప్ర భుత్వం దృష్టికి మా సమస్యలు తీసుకుపోవాలని లక్ష్యంతో త ప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 31వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పా ఠశాలలో వంటలు బంద్ చేసి జిల్లా విద్యాశాఖ అధికారి కా ర్యాలయాల ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎఐటియుసి నాయకత్వం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకత్వాలు, అంకితభావంతోపాల్గొనిజయప్రదం చేయాలని ప్రకటనలో పిలుపునిచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే నాయిని

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:**మొంథా తుపాన్ ప్రభావం నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఫోన్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అధికారులకు,ప్రజలకు సహాయక చర్యలు అందేలా చూడాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గాలులు, వాతావరణ మార్పులు నమోదవుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉం డటం అత్యంత అవసరం. వరంగల్ పశ్చిమ ని యోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందరూ ఎప్పటికప్పుడు పరిస్థితుల ను గమనించి, అవసరమైన చోట సహాయక చర్య లు తీసుకునేలా తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మె ల్యే నాయిని సూచించారు. నీటి నిల్వల దగ్గర, వి ద్యుత్ తీగల దగ్గర, పాత చెట్ల సమీపంలో వెళ్లకూడదని, అవసరమైతే స్థానిక అధికారులను సంప్రది ంచాలి అని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తెలిపా రు.అత్యవసర ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా సహాయం చేయాలని పిలుపునిచ్చారు.

## పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఏక్యూ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడిఓసికార్యాలయ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ, సహకార, రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎఫ్ఏక్యూ నిబంధనలకు అనుసరించి ధాన్యం కొనుగోలు నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో మొత్తం 44,396 హెక్టార్లలో వరి పంట సాగు జరిగిందని, దాదాపు 1.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం ఉన్నందున, పకడ్బందీగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని అధికారులకు, మిల్లర్లకు సూచించారు. జిల్లాలో సహకార సంఘాలు, డిఆర్డీఏ ద్వారా 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లుపై ధ్రువీకరణ నివేదికలు ఇవ్వాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేలా తగిన సంఖ్యలో లారీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు తదుపరి తక్షణమే ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు జరిగిన వెంటనే ఏపీఎంలు, సహకార సంఘాల సీసీలు రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని, గరిష్టంగా 48 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు సమన్వయం పాటిస్తూ ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పవర్ పాయింట్ ద్వారా అవగహన కల్పించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఆదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబురావు, డిఆర్‌డిఓ బాలకృష్ణ, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

**నేడు పాఠశాలలకు సెలవు**

మొంథా తుఫాను ప్రభావం దృష్ట్యా భద్రతా చర్యలలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు 30న గురువారం సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ సమాచారాన్ని తక్షణమే తెలియజేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**ఉద్యాన పంటల పై అవగాహన పెంచాలి**

జిల్లాలో ఉద్యాన పంటలపై అవగాహనను మరింత పెంచి, రైతులకు సాంకేతిక సమాచారం సమయానుకూలంగా చేరేలా చేసేందుకు ఉద్యాన దర్శిని పుస్తకాలు ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు మండల వ్యవసాయ అధికారులకు ఉద్యాన దర్శిని పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు ఆధునిక పద్ధతులు, పంట సంరక్షణ, మార్కెట్ సదుపాయాలు, రాయితీల వివరాలు క్షేత్ర స్థాయిలో విస్తరణాధికారులు రైతులకు తెలియచేయాలని తెలిపారు.

# రీల్




## నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి'

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ ధ్న్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వరక్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ థియేట్రికల్ రిలీజ్ కు చేస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించేందుకు హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ.. రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూశాను. ఇది నా మనసుకు హత్తుకుంది. కొందరి లైఫ్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమా చేశారు. ఇది కాల్పనిక కథ అయితే మనం ఆ దర్శకుడి ఊహకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఇలా ఎలా ఆలోంచించారు అనుకునేవాళ్లం. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక ఎమోషనల్ ఫీల్ తో వస్తారు. అఖిల్ రాజు పాత్రలో బాగా నటించాడు. తేజస్విని తెలుగు అమ్మాయి. ఈ సినిమాలో తన స్కీన్ ప్రెజెన్స్, పర్ ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంది. హీరో సిద్ధు జొన్నలగడ్డ బ్రదర్ చైతన్య ఒక మంచి రోల్ చేశాడు. అతనికి నటుడిగా మంచి పేరు తెచ్చే మూవీ అవుతుంది. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఆయనతో పాటు ఈటీవీ విన్ వారికి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా.

## ఆయన నటనకు అభిమానిని

### 'మాస్ జాతర' ప్రీ రిలీజ్ వేడుకలో సూర్య



మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 31న సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు.ఈ వేడుకకు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూర్య మాట్లాడుతూ.. రవితేజతో నాది 20 ఏళ్ళ అనుబంధం. తెరపై ఒక కామన్ మ్యాన్‌ని కింగ్ సైజ్‌లో సహజంగా చూపించాలంటే అది రవితేజకే సాధ్యమవుతుంది.ఇడియట్, కిక్ సహా రవితేజ నటించిన పలు సినిమాలు తమిళ్ లోనూ మంచి ఆదరణ పొందాయి. విక్రమార్కుడు రీమేక్ నా సోదరుడు కార్తీ కెరీర్‌కి టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. రవితేజలా వినోదాన్ని పంచే వాళ్ళు అరుదుగా ఉంటారు. రజినీకాంత్ , అమితాబ్ బచ్చన్ ఎలాగైతే వినోదాన్ని పంచగలరో రవితేజ కూడా అలాగే అలరిస్తారు. రవితేజ ఇలాగే వినోదాన్ని పంచుతూ ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. రేపు మాస్ జాతర రూపంలో రవితేజ జాతర చూడబోతున్నాం. 31 విడుదలవుతున్న మాస్ జాతర సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, 'టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్.' అన్నారు. రవితేజ మాట్లాడుతూ.. శివుడు పాత్ర చేసిన నవీన్ గురించి మాట్లాడాలి. నవీన్ ఇలా కూడా చేయగలడా అని ఆశ్చర్యపోయేలా చేశాడు. నటుడిగా ఈ సినిమాతో మరో స్థాయికి వెళ్ళాలని కోరుకుంటున్నాను. సినిమా విడుదలయ్యాక శివుడు పాత్ర గురించి మాట్లాడుకుంటారు. రాజా ది గ్రేట్ తర్వాత రాజేంద్ర ప్రసాద్ తో కలిసి నటించాను. రాజేంద్ర ప్రసాద్ పాత్ర అద్భుతంగా ఉంటుంది. మా కాంబినేషన్ ని ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ కోరుకుంటారని అనుకుంటున్నాను. నాది, శ్రీలీలది సూపర్ హిట్ జోడీ. ఈ సినిమాలో కొత్త శ్రీలీలను చూడబోతున్నారు. ఫుల్ మాస్ పాత్ర చేసింది. గెస్ట్‌గా విచ్చేసిన సూర్యకి థాంక్యూ సో మచ్. మాస్ జాతర చిత్రం ఖచ్చితంగా బాగుంటుందని నమ్ముతున్నాను అని అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. 'పెళ్లి సందడి విడుదలకు ముందు రవితేజతో ధమాకా సినిమా చేశాను. ధమాకా తర్వాత మళ్ళీ ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. రవితేజ ఎప్పుడు హుషారుగా ఉంటారు. ఎంత బాధ ఉన్నా పైకి నవ్వుతూ ఉండటం రవితేజని చూసి నేర్చుకోవచ్చు అన్నారు. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'అన్ని మసాలాలు సరిగ్గా ఉన్న మాస్ సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. ఆ లోటుని తీర్చే సినిమా ఈ మాస్ జాతర. ఈ చిత్రం చూసి మీరందరూ ఆశ్చర్యపోతారు. ఇప్పటిదాకా ఎందరో హీరోలతో కలిసి నటించాను. కానీ, రవితేజతో నటించలేదు. 'మాస్ జాతర' లాంటి మంచి సినిమా చేయాలనే ఇంత సమయం పట్టినట్టుంది. దర్శకుడు భాను అద్భుతమైన సినిమాని రూపొందించాడు అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు నవీన్ చంద్ర , నిర్మాత సూర్యదేవర నాగవంశీ ,దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో దర్శకులు శివ నిర్వాణ, రామ్ అబ్బరాజు, ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న, కళా దర్శకుడు శ్రీ నాగేంద్ర తంగాల తదితరులు పాల్గొన్నారు.

## ఘట్టమనేని వారసురాలు హీరోయిన్‌గా ఎంట్రీ




సూపర్‌స్టార్ కృష్ణ ఘట్టమనేని వారసత్వం తెలుగు సినీ పరిశ్రమలో విశిష్టమైనది. ఇప్పుడు ఘట్టమనేని లెగసీ నుంచి తొలిసారిగా హీరోయిన్‌గా వెలుగులోకి వచ్చింది. జాన్వి ఘట్టమనేని. ఆమె తన తాత కృష్ణ గ్రేస్, తన మామ మహేష్ బాబు మాగ్నటిజం, తల్లి మంజుల ఘట్టమనేని ఆత్మీయతను తనలో కలుపుకుని గొప్ప వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంది. జాన్వి ఘట్టమనేని క్లాసిక్ బ్యూటీ. ఇటీవల వెలుగుచూసిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇండస్ట్రీ వర్గాలు ఆమెను ఇటీవలి తెరపై కనిపించే అత్యంత అందమైన అమ్మాయి'గా అభివర్ణిస్తున్నాయి. జాన్వి ఎటువంటి హడావుడి లేకుండా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. కొన్ని ఫొటోలు, కొన్ని టెస్ట్ రీల్స్ ద్వారానే తన చార్మ్ చూపించింది. దర్శకులు ఆమె నటనను చూసి మాటల కన్నా కళ్ళతోనే భావాలను చెప్పగల సహజ నటిగా వర్ణించారు.ఆమె ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా ప్రత్యేకం. పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్నెస్, డ్రైవింగ్, గేమింగ్ ప్రతి విషయంలోనూ సమాన ఆసక్తి చూపిస్తుంది. జిమ్లో ట్రైనింగ్‌తో మొదలై తన డే, నైట్ తన ఆర్ట్ కార్నర్లో ముగుస్తుంది. కొత్తగా సినీ రంగంలోకి వచ్చే వాళ్లు సాధారణంగా ఒకే గుణంతో గుర్తింపుపొందుతారు. కానీ జాన్వి ఘట్టమనేని మాత్రం అందం, మాధుర్యం, ప్రతిభ, వారసత్వం.. ఈ నాలుగింటినీ కలగలిపిన ప్రత్యేక వ్యక్తిత్వం. బ్రాండ్ నిపుణులు ఆమెను దక్షిణాది శైలి, పాన్‌ఇండియా అప్పీల్ కలిగిన పేస్ అని పేర్కొంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు కుటుంబం నుండి వస్తున్న జాన్వి ఎంట్రీ త్వరలోనే జరుగనుంది. జాన్వి సంప్రదాయ లుక్ నుంచి మోడరన్ గ్లామర్ వరకు సునాయాసంగా మెరిసిపోతుంది. ఇంకా సినిమా రిలీజ్ కాక ముందే ఆమెకు గుర్తింపు వచ్చేసింది. ఒక అద్భుతమైన జ్యువెలరీ క్యాంపెయిన్ తర్వాత, జాతీయ స్థాయి బ్రాండ్లు, దర్శకులు ఆమెను సంప్రదించారు. మంజులకి ఇది ప్రత్యేకమైన క్షణం. ఎన్నేళ్ల క్రితం ఆమెకూ నటనపై కలలు ఉండేవి, కానీ ఆ కాలం మహిళలకు అంత అనుకూలంగా ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ప్రపంచం సిద్ధంగా ఉంది, ప్రేమతో ఉంది, ఎదురు చూస్తోంది. నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వి కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వి చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం అన్నారు మంజుల.

## మార్చి 19న 'డకాయిట్' రిలీజ్



అడివి శేష్ తాజాగా నటిస్తున్న సినిమా 'డకాయిట్'. ప్రేమ ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు.తాజాగా డకాయిట్ రిలీజ్ డేట్ అప్డేట్ ఇచ్చారు. 2026 ఉగాది కానుకగా మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రం డకాయిట్ కావడం విశేషం.అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు.

## 'ఓహ్ కాదలే' పాట విడుదల



ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించిన 'తేరే ఇష్క్ మే' చిత్రంలోని మొదటి తమిళ పాట 'ఓ కాదలే' ను విడుదల చేశారు. ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటను ఆదిత్య ఆర్కే పాడిన ఈ పాటకు మషోక్ రెహమాన్ సాహిత్యాన్ని అందించారు. ధనుష్ , కృతి సనన్ ఇందులో హీరో హీరోయిన్ లుగా నటిస్తున్నారు. ఇద్దరి పై సాగే ఈ పాట కోసం ఏ ఆర్ రెహ్మాన్, ఆదిత్య ఆర్కే, మశోక్ రెహ్మాన్ కలిసి పని చేయడం విశేషం. 'తేరే ఇష్క్ మే' చిత్రాన్ని ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మించారు. మరియు భూషణ్ కుమార్ మరియు క్రిషన్ కుమార్ కలిసి నిర్మించారు. గుల్షన్ కుమార్, టిసిరీస్ మరియు కలర్ యెల్లో సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించారు, శర్మ, నీరజ్ యాదవ్ స్క్రీన్ ప్లే రాశారు. అజయ్ దేవగన్ మరో కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా తమిళం హిందీ భాషలలో విడుదల కానుంది.

## 'ఆర్యన్' సినిమా విడుదల వాయిదా



విష్ణు విశాల్ హీరోగా నటించిన తాజా థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్టోబర్ 31న విడుదల చేయాలని ముందుగా అనుకున్న ఈ సినిమా నవంబర్ 7కి వాయిదా పడింది. అయితే, తమిళ వెర్షన్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 31న విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి, మేకర్స్ రెగ్యులర్ అప్డేట్లతో అలరిస్తున్నారు. టీజర్, ట్రైలర్, ఫస్ట్ సింగిల్ అద్భుతమైన స్పందనను పొంది సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.వాయిదాకు గల కారణాలను స్పష్టం చేస్తూ విష్ణు విశాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు రెండు స్ట్రెయిట్ సినిమాలు ఈనెల 31న విడుదల అవుతున్న సందర్భంగా ఈ తమిళ డబ్బింగ్ సినిమా విడుదల వాయిదా వేశారు.

# సమీక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

జరిపారు. 'పిఎం శ్రీ' పథకంలో కేరళ రాష్ట్రం చేరడానికి వ్యతిరేకంగా సిపిఐకి చెందిన రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి నాయకత్వం చాలా గట్టి వైఖరి అవలంబించడంతో ముఖ్యమంత్రి విజయన్ స్వయంగా ఈ విషయంలో జోక్యం చేసుకున్నప్పటికీ కూడా ప్రతిష్ఠంభన తొలగిపోలేదు.

### ఇది వామపక్ష ఐక్యతకు విజయం : బినోయ్ విశ్వం

ఎంపిక చేసిన స్కూళ్ళల్లో జాతీయ విద్యావిధానాన్ని అమలు చేసేందుకు ఉద్దేశించిన 'పిఎం శ్రీ' పథకం అమలుపై సమీక్ష చేయాలని కేరళ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వామపక్ష ఐక్యతకు విజయంగా ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి, మాజీ ఎంపి బినోయ్ విశ్వం పేర్కొన్నారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఉద్దేశించిన తదుపరి ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. రాష్ట్రంలోని స్కూళ్ళల్లో పథకాన్ని అమలు చేయాలా? వద్దా? అనే విషయంపై సమీక్ష చేసేందుకు ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి విజయన్ చెప్పారు. ఈ నివేదిక వచ్చేవరకూ ఈ పథకం అమలు నిలిపివేస్తారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై బినోయ్ విశ్వం బుధవారం స్పందిస్తూ, ఈ విజయం వామపక్షాల ఐక్యతకు విజయమని, వామపక్ష సైద్ధాంతిక, రాజకీయ విజయమని అన్నారు. ఈ విజయాన్ని సిపిఐకి ఆపాదించవచ్చా అని చాలా మంది తనను అడిగారని, కానీ దీనిని విజయమా? విజయం కాదా? అనే కొలమానాల పరిధిలోకి చూడాలని పార్టీ కోరుకోవడంలేదని, ఒకవేళ అలా అనుకుంటే ఇది వామపక్షాల ఐక్యతకు, వామపక్ష సైద్ధాంతిక,రాజకీయాలకు లభించిన విజయం అవుతుందని బినోయ్ విశ్వం చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానాన్ని వామపక్షాలు మొదటినుండీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కానీ దీనిని అమలు చేసేందుకు పిఎం శ్రీ కింద ముద్ర వేసి కొన్ని స్కూళ్ళల్లో అమలు చేసేందుకు కేరళ ప్రభుత్వం తన అంగీకారాన్ని తెలియజేయడాన్ని వామపక్ష సంఘటనలో ఉన్న ప్రధాన భాగస్వామ్యపార్టీ సిపిఐ గట్టిగా వ్యతిరేకించింది. దీంతో ఎల్‌డిఎఫ్ కూటమిలో ఉన్న పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావడం ద్వారా పిఎం శ్రీ అమలుపై సమీక్షకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

# నేడు ట్రంప్-జిన్‌పింగ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

డోనాల్డ్ ట్రంప్ బుధవారం ఎఫ్–16 యుద్ధ విమానాల సంరక్షణలో ఉదయం 11.40 గంటలకు దక్షిణ కొరియా ఆగ్నేయప్రాంత నగరం బుసాన్‌లోని గిమ్హే విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు 21 సార్లు తుపాకులు పేల్చి కొరియా ప్రభుత్వం రెడ్ కార్పెట్‌తో ఘన స్వాగతం పలికింది. విదేశాంగమంత్రి చో హ్యూన్, ఉపమంత్రి కిమ్ జిన్‌లు ట్రంప్‌కు స్వాగతం పలికారు. అనంతరం బుధవారం మధ్యాహ్నం జియోంగ్జులో దక్షిణ కొరియా దేశాధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ట్రంప్ ద్వైపాక్షిక సమావేశం జరిపారు. రెండు దేశాల ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించారు. రెండు దేశాల నాయకులూ టారిఫ్‌లు, వాణిజ్య సంబంధాలే ప్రధానంగా చర్చించారు. గతంలో రెండు దేశాలమధ్యా పరస్పర టారిఫ్‌లు 25 శాతంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఈ టారిఫ్‌లను 15 శాతానికి తగ్గించుకుంటామని, ముందుగా నిర్దేశించుకున్నవిధంగా ఈ టారిఫ్‌లను తగ్గించుకుంటామని అధ్యక్షుడి సహాయకుడు కిమ్ యోంగ్ బియోమ్ చెప్పారు. అమెరికాలో 350 బిలియన్ డాలర్లను దక్షిణ కొరియా పెట్టుబడిగా పెడుతుందని కూడా ఆయన చెప్పారు.

# తూర్పు లద్ధాఖ్ సరిహద్దుల్లో శాంతికి భారత్-చైనా కమాండర్స్ అంగీకారం

**న్యూఢిల్లీ:** తూర్పు లద్ధాఖ్‌లో వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) వెంట శాంతి–స్థిరత్వం కొనసాగించేలా చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయి సైనికాధికారుల చర్చల్లో భారత్–చైనా దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల సైన్యాలూ కమాండర్స్ స్థాయిలో అక్టోబరు 25వ తేదీన 23వ విడత సమావేశమై ఈ మేరకు అంగీకరించాయి. భారత్ వైపు మోల్డో–ఛుశూల్ సరిహద్దు కేంద్రం వద్ద ఈ సమావేశం జరిగింది. రెండు దేశాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు అంటే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ గడచిన ఆగస్టు నెలలో సమావేశమైన తర్వాత ఇరు సైన్యాలస్థాయిలో చర్చలు జరగడం ఇదే మొదటిసారి. చర్చలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనో బుధవారం తెలియజేసింది. గత ఏడాది అక్టోబరులో రెండు దేశాల సైన్యాల మాండర్స్‌స్థాయిలో 22వ విడత సమావేశం జరిగినప్పటినుండీ రెండు వైపులా పరిస్థితుల్లో మంచి పురోగతి వచ్చింది. శాంతి, స్థిరత్వాలకు సంబంధించిన అభిప్రాయాలను రెండు దేశాల ప్రతినిధులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఇదే విధానం కొనసాగించాలనివారు నిర్ణయించారు. 'ఈ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించుకోవడానికి ప్రస్తుతం అమలులో ఉన్న యంత్రాంగాలనే ఉపయోగించుకుని వాటి ద్వారానే పరిష్కారాలు చేసుకోవాలని రెండు వైపులా సైన్యాల ఉన్నతస్థాయి అధికారులు అంగీకరించారు' అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది. గడచిన కొద్ది నెలలుగా రెండు దేశాల మధ్యా పరిస్థితులను సాధారణీకరించేందుకు వరుస చొరవ చర్యలు కొనసాగుతున్నాయి. తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లో నాలగు సంవత్సరాలుగా రెండు దేశాల సైన్యాలూ మోహరించి ఉన్నాయి. ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత ఏడాది అక్టోబరు నెలలో ఈ ఉద్రిక్తతలకు తెరపడే చర్యలు ప్రారంభమయ్యాయి. రెండు దేశాలకు చెందిన సైన్యాలూ డెమ్చోక్, దెస్పాంగ్ ప్రాంతాల నుండి చాలా విజయవంతంగా వెనక్కు మళ్ళడం ద్వారా ఉద్రిక్తతలు సడలిపోయాయి. చైనా తరఫున ఆ దేశ ప్రత్యేక ప్రతినిధి, విదేశాంగమంత్రి వాంగ్ యీ ఈ ఏడాది ఆగస్టు 19వ తేదీన భారత్‌లో పర్యటించారు. రెండుదేశాలు శాంతి, స్థిరత్వం సాధించేందుకు వరుసగా అనేక చర్యలకు శ్రీకారం చుట్టాయి. సహకాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు వారు అంగీకరించారు. రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్యా 24వ విడత సమావేశం తర్వాత పశ్చిమ రంగంలో జనరల్ లెవెల్ మెకానిజంలో సంభాషణలు జరగడం ఇదే మొదటిసారి అని విదేశాంగశాఖ ప్రకటించింది. ప్రస్తుతం లద్ధాఖ్ రీజియన్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి 50,000 నుండి 60,000 వరకూ సైన్యాలు మోహరించి ఉన్నాయి. 2020 మే నెలలో రెండు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణలు జరిగాయి. అప్పటినుండీ నాలుగేళ్ళు ఈ ఉద్రిక్తతలు కొనసాగాయి.

**ఏడాదికాలంగా స్థిరమైన సంబంధాలు: చైనా ప్రకటన**

అదేవిధంగా చైనా జాతీయ రక్షణ మంత్రిత్వశాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా–భారత్ సరిహద్దుల్లోని వెస్టర్న్ సెక్టర్‌ను ప్రశాంతంగా ఉంచడానికి ఇరువైపులా జనరల్స్ స్థాయి సమావేశంలో చాలా లోతుగా, సానుకూలంగా సంభాషణలు జరిగాయని పేర్కొంది. రెండు దేశాల నాయకులు ముఖ్యమైన సమావేశం నిర్వహించిన తర్వాత వారి మార్గదర్శకత్వంలో ఈ సంభాషణలు జరిగాయని పేర్కొంది. సైనిక, దౌత్యస్థాయి మార్గాల్లో రెండు దేశాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ సంభాషణలు జరపాలని, శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించేందుకు చర్యలు ముందుకు తీసుకువెళ్ళాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఏడాది కాలంగా రెండు దేశాలమధ్య స్థిరమైన సంబంధాలు కొనసాగుతున్నాయని ప్రకటించింది. భారతదేశం ఐదు సంవత్సరాల తర్వాత గడచిన ఆదివారం మొదటిసారి చైనా ప్రధాన భూభాగానికి విమానాల రాకపోకలను కూడా పునరుద్ధరించినట్లు భారత అధికారులను ఉటంకిస్తూ ప్రకటన గుర్తుచేసింది. రెండు దేశాలమధ్యా 2020 ప్రారంభం వరకూ విమానాల రాకపోకలు కొనసాగాయి. కరోనా మహమ్మారి కారణంగా ఈ రాకపోకలు నిలిచిపోయాయి.

# ఉద్యోగులకు అన్యాయమే

(మొదటి పేజీ తరువాయి)

ఉండడమంటే, ఇది వారికి అన్యాయమే అవుతుందని అన్నారు.

### పరిశీలనాంశాలు ఇంత కఠినమా?

ఎనిమిదవ కేంద్ర వేతన సంఘానికి ప్రభుత్వం సూచించిన పరిశీలన అంశాలు చాలా కఠినంగా ఉండటంతో సిఫార్సులను ఖరారు చేసేందుకు అనేక ఒత్తిళ్ళు ఉంటాయని అమర్‌జీత్ కౌర్ అన్నారు. పరిశీలన అంశాలన్నీ ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక భవిష్యత్తు, అభివృద్ధి వ్యయం, సంక్షేమ చర్యలకు తగిన వనరులను నిర్ధారించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని సిపిసికి సూచిస్తున్నాయని, అన్నికంటే ఘోరమేమిటంటే నాన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం కోసం నిధుల లేని ఖర్చు గురించి సూచించాలని పేర్కొందని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ఏదైనా ప్రయోజనం కల్పించేటప్పుడు మాత్రమే ప్రభుత్వానికి ఇవన్నీ గుర్తుకు వస్తాయని, కార్పొరేట్లు జాతీయ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు రాయితీలు,సహాయాలు ఇవ్వడం, రద్దు చేయడంలో లేదా కార్పొరేట్లపై పన్ను రేట్లను తగ్గించడంలో మోదీ ప్రభుత్వానికి ఇలాంటి ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక భవిష్యత్తుం మొదలైన వాటిని ఎప్పుడూ పరిగణించబోదని మండిపడ్డారు.

### కుటుంబం అంటే 3 కాదు.. ఐదు..

ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఉన్నప్పటికీ విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన 8వ కేంద్ర వేతన సంఘం మూడు యూనిట్లు కాకుండా ఐదు యూనిట్లు ఉన్న కుటుంబానికి అవసర ఆధారిత కనీస వేతనాన్ని నిష్పాక్షికంగా అధ్యయనం చేసి సిఫార్సు చేయాల్సిన బాధ్యత ఉందని అమర్‌జీత్ కౌర్ విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ రక్షణ చట్టం లేదా తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం–2007 ప్రకారం వృద్ధాప్య తల్లిదండ్రుల ఆలనాపాలన పిల్లల చట్టపరమైన బాధ్యత అని, కాబట్టి తల్లిదండ్రులు కుటుంబంలో భాగమే అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుత జీవిత అవసరాలు, సమాచార సాంకేతికతపై ఖర్చు, పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణపై ఖర్చు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవాలని, ఎందుకంటే ప్రస్తుత ప్రభుత్వం వీటన్నిటినీ ప్రైవేటీకరించిందన్నారు. వివిధ పోటీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులు మంచి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి 8వ సిపిసి కనీస వేతనాన్ని సిఫార్సు చేయాలని అన్నారు.

### పెన్షన్‌లో వివక్షత వద్దు

2026 జనవరి ఒకటవ తేదీకి ముందు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు 2026 జనవరి 1వ తేదీ నుండి పెన్షన్ సవరణకు సంబంధించి ఆందోళనకరమైన విషయాన్ని సిపిసి పరిగణలోకి తీసుకోవాలని అమె సూచించారు. భవిష్యత్తు, పాత పెన్షనర్ల మధ్య వివక్ష చూపడానికి సిసిఎస్ (పెన్షన్) నియమాలు– 1972 (ఇప్పుడు 2021) చట్టం ద్వారా ప్రభుత్వం తీసుకున్న ధృవీకరణ కారణంగా వారు నష్టపోతారని తెలిపారు. గతంలో మాదిరిగానే వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా 2026 జనవరి 1వ తేదీ నుండి పనిచేస్తున్న ఉద్యోగులతో సమానంగా పెన్షన్ సవరణకు సిఫార్సు చేయాలని ఎనిమిదవ సిపిసి ప్రభుత్వాన్ని కోరాలని అన్నారు. అలాగే ఎన్‌పిఎస్‌లో ఉన్న 24 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 2004 జనవరి 1వ తేదీ నుండి తమను నాన్‌కంట్రిబ్యూటరీ వృద్ధాప్య పెన్షన్ పథకానికి తరలించాలనే న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం కేంద్ర వేతన సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.



### ఐక్యంగా వ్యవహరించాలి

ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం ముందు తమ డిమాండ్లను సమర్పించడానికి, న్యాయం పొందడానికి అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా తమ వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సిపిసి నుంచి గౌరవప్రదమైన, సహేతుకమైన వ్యవహారాన్ని ఆశించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జరిపే పోరాటంలో ఎఐటియుసి గతంలో లాగానే వారితో భుజం భుజం కలిపి నిలబడుతుందని అమర్‌జీత్ కౌర్ స్పష్టం చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com